

కనిగిరిలోని పామూరు రోడ్డులో జగన్ రోడ్ షో సమయంలో అరకొరగా ఉన్న జనం



దొనకొండ అడ్డరోడ్డు వద్ద సిద్ధం సభలో జగన్ మాట్లాడుతుండగా వెనుదిరిగి వెళ్తున్న జనం(ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న జగన్

సిద్ధంకు రాంరాం!

జగన్ పర్యటనకు జనం నుంచి స్పందన కరువు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఆదివారం నిర్వహించిన రోడ్‌షోలు వెలవెలబోయాయి. కొనకనమిట్ల మండలం దొనకొండ అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సభ పేలవంగా సాగింది. వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేసినా ప్రజల నుంచి స్పందన కరువైంది. మద్యం, డబ్బులు ఆశ చూపినా సభకు వెళ్లేందుకు ససేమిరా అన్నారు. అనేక ప్రాంతాలకు వెళ్లిన బస్సులు ఖాళీగానే తిరుగుముఖం పట్టాయి. దీంతో సభాప్రాంగణంలోని అత్యధిక భాగం ఖాళీగా కన్పించింది. కనిగిరితోపాటు ముఖ్యప్రాంతాల్లో జగన్ రోడ్‌షోలు నిర్వహించగా ఎక్కడా పెద్దగా జనం కన్పించలేదు. సీఎం పర్యటన సాగినంత దూరం విద్యుత్ తీగలు, సర్వీసు వైర్లు తొలగించడంతో కరెంటు లేక ప్రజలు పడరానిపాట్లు పడ్డారు. ఓ వైపు ఎండ తీవ్రత, మరో వైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. జగన్ తన ప్రసంగంలో పార్టీ కేడర్ ఊసెత్తకపోగా స్థానిక సమస్యలను ప్రస్తావించకపోవడం ఇటు శ్రేణులు, అటు నాయకులు డీలాపడ్డారు.

- మద్యం, డబ్బులు ఇచ్చినా ససేమిరా
- రోడ్ షోలు వెలవెల.. పేలవంగా సభ!
- కేడర్ ఊసే కరువు
- స్థానిక అంశాల ప్రస్తావనే లేదు
- కనిగిరిలో 'షో' అట్టర్‌ఫ్లాప్
- పొదిలిలో చిమ్మచీకట్లో పర్యటన
- సీఎం రాకతో ప్రజలకు చుక్కలు
- 12 గంటలు కరెంటు నిలిపివేత
- ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'మేమంతా సిద్ధం' పేరుతో బస్సుయాత్ర ద్వారా వైసీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం పలికిన సీఎం జగన్ ఆదివారం జిల్లాలో పర్యటించారు. శనివారం రాత్రి కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం జువ్విగుంట వద్ద ఆయన బసచేశారు. ఆదివారం ఉదయం 10.45 గంటల నుంచి ప్రారంభమైన యాత్ర రాత్రి 9.30 గంటల వరకూ సాగింది. రాత్రికి దర్శి మండలం చలివేంద్రం వద్ద బస చేశారు. మధ్యలో దొనకొండ క్రాస్‌రోడ్డు సమీపంలో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం చిమ్మచీకట్లోనే పొదిలి, దర్శిల్లో రోడ్‌షో నిర్వహించారు. మొత్తం ఆయన పర్యటన తీరుతెన్నులు, ప్రసంగాన్ని పరిశీలిస్తే ఆపార్టీ కార్యకర్తలు, నాయకులను కూడా ఉత్సాహపరచలేకపోయిందని చెప్పవచ్చు. ఎన్నికల నేపథ్యంలో ఇలా కార్యక్రమం పేలవంగా సాగడంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన ఆరంభమైంది. జనసమీకరణకు ఒంగోలు లోక్‌సభ పరిధిలో పెద్దఎత్తున ప్రయత్నం చేసినా కార్యక్రమం విజయవంతం కాలేదు.



మేమంతా సిద్ధంగా లేమన్న జనం

ఒంగోలు లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణకు నాయకులు ప్రయత్నాలు చేశారు. ఆర్టీసీతోపాటు, అన్ని ప్రాంతాల్లో విద్యాసంస్థల బస్సులను వినియోగించారు. వాహనాల్లో వచ్చిన వారికి మద్యం బాటిళ్లను, పలావు పొట్లాలు సరఫరా చేశారు. సాధారణ ప్రజలకు రోజువారీ కూలికింద డబ్బులిచ్చి మరీ తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

అయినా సభా ప్రాంగణం నిండలేదు. మధ్య ప్రాంతమంతా ఖాళీగానే దర్శనమిచ్చింది. ముందు భాగం ర్యాంప్ చుట్టూ ఉన్న జనంపైనే కెమెరా తిరగడంతో భారీగా జనం వచ్చినట్లు లైవ్ చూసేవారికి కనిపించినా అక్కడ నేరుగా వీక్షించేవారికి మధ్యప్రాంతంలో జనంలేక వెలవెలబోయి కనిపించింది. వచ్చిన వారిలో దర్శి, మార్కాపురం, ఒంగోలు నియోజకవర్గాల నుంచే అధికంగా ఉన్నారు. ఆ నియోజకవర్గాల నుంచి కూడా నాయకులు ఏర్పాటుచేసిన వాహనాలన్నీ రాకపోవడం విశేషం. సరాసరిన పది బస్సుల్లో నాలుగింటిలో మాత్రమే నిండుగా జనం వచ్చారు.

సంతృప్తిపడని కేడర్.. నేతలు

సభ పేలవంగా జరగ్గా జగన్ ప్రసంగం ఇటు కార్యకర్తలను కానీ, అటు పోటీలో ఉన్న అభ్యర్థులను కానీ సంతృప్తిపరచలేదంటే అతిశయోక్తి కాదు. అర్ధగంట ఆలస్యంగా సాయంత్ర 5.06 గంటలకు సభా వేదికవద్దకు బస్సు రాగా 5.20గంటలకు జగన్ ప్రసంగం ప్రారంభించారు. 6.11 గంటలకు ముగించారు. పోటీలో ఉన్న అభ్యర్థులను నామమాత్రంగా పరిచయం చేసి తిరిగి బస్సు యాత్రను ప్రారంభించారు. జగన్ తన ప్రసంగంలో వలంటీర్లను పొగడ్తలతో ముంచెత్తారు. ఒక్కసారైనా పార్టీ కార్యకర్తల గురించి ప్రస్తావించలేదు. ఆ విషయంపై సభలో ఉన్న కేడర్ నిరుత్సాహంగా మాట్లాడుకోవటం స్పష్టంగా వినిపించింది. ఇక జిల్లా రాజకీయ, అభివృద్ధి అంశాలను కానీ ఆయన ప్రస్తావించలేదు. ముందుగా మాట్లాడిన మార్కాపురం అభ్యర్థి అన్నా రాంబాబు వెలిగొండ, మెడికల్ కాలేజీల అంశాలను ప్రస్తావించి ఇక్కడ చాలా పనులు చేశారని జగన్‌ను పొగిడారు. వెలిగొండ పెండింగ్ పనుల గురించి కానీ, పూర్తి కాని మెడికల్ కాలేజీ విషయాన్ని కానీ, ఇతర ప్రాంతాలకు సంబంధించి గతంలో ఆయన ఇచ్చిన హామీల గురించి కానీ జగన్ మాట్లాడలేదు. కొత్త జిల్లాల ఏర్పాటుపై గొప్పగా చెప్పుకున్న జగన్ పశ్చిమప్రాంత ప్రజల ఆకాంక్షలను, మార్కాపురం జిల్లా ఏర్పాటు గురించి మాట వరుసకు కూడా ప్రస్తావించలేదు. చివర్లో ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులను పరిచయం చేసిన ఆయన ఒక్కొక్కరి గురించి మంచివారు, నాతమ్ముడు లాంటి వారు అన్నారు. అంతకుమించి వారికున్న ప్రజాసంబంధాల గురించి కానీ, సేవాకార్యక్రమాల గురించి కానీ మాట్లాడకపోవటంతో అభ్యర్థులు డీలాపడ్డారు.

కనిగిరిలో కనిపించని జనం

జువ్విగుంట నుంచి సిద్ధం సభా ప్రాంగణం వరకు సుమారు 55 కి.మీ పొడవున జగన్ బస్సుయాత్ర సాగించారు. అగ్రహారంలో ఒకటికి తొమ్మిది చోట్ల గజమాలలతో స్వాగత కార్యక్రమాన్ని మంత్రి సురేష్ ఏర్పాటు చేశారు. అన్ని చోట్లా పార్టీ నాయకులే తప్ప సాధారణ ప్రజలు కనిపించలేదు. ఆతర్వాత గంగదేవాలయం ప్రాంతంలో కనిగిరి నియోజకవర్గంలోకి బస్సు యాత్ర చేరగా కేవలం నాయకులే స్వాగతం పలికారు. ఆలవలపాడులో పదిమంది ఉన్న ప్రాంతంలో బస్సు లోంచి బయటకు చూడని జగన్ ఐప్యాక్ ప్రతినిధులు ఏర్పాటుచేసిన బాధితుల వద్ద మాత్రం ఆగి దరఖాస్తులు తీసుకుని ప్రజల సమస్యలపై స్పందించే ప్రయత్నం చేశారు. మధ్యాహ్నం సమయానికి నియోజకవర్గ కేంద్రమైన కనిగిరికి బస్సుయాత్ర చేరింది. కనిగిరి నడిబొడ్డులో ఆయనకు పేలవమైన స్వాగతం లభించింది. బస్సుపైకి వచ్చిన జగన్ అక్కడ పలుచగా ఉన్న జనాన్ని చూసి ఒక నమస్కారం చేసి రెండో నిమిషంలోనే బస్సులోకి వెళ్లిపోయారు. పక్కనున్న అభ్యర్థి నారాయణను పరిచయం చేయడం కానీ, ఆయనతోపాటు బస్సుపైకి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే బాబూరావుల గురించి చెప్పడం కానీ జరగలేదు. ఆతర్వాత 3 గంటల సమయానికి చినారికట్ల వద్ద మధ్యాహ్న భోజనానికి ఏర్పాటు చేసిన ప్రాంతానికి చేరారు. మధ్యలో ఆయనకు ఎక్కడా భారీ సంఖ్యలో ప్రజలు స్వాగతం పలుకకపోగా ఉన్నవారిని కూడా ఆయన పలుకరించిన దాఖలాలు లేవు. మధ్యాహ్న భోజనం చేసిన ప్రాంతానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దొనకొండ క్రాస్‌రోడ్డు వద్ద సభా ప్రాంగణానికి ఆయన సాయంత్రం 5 గంటలకు చేరారు. షెడ్యూల్ ప్రకారం 4.30 గంటలకే సభ ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఆశించిన మేర జనం రాలేదన్న సమాచారంతో ఆయన అర్ధగంట సేపు మధ్యాహ్న భోజనం శిబిరం వద్దే వేచి ఉన్నట్లు వెల్లడైంది.

12 గంటలు కరెంటు కోత.. చీకట్లో రోడ్ షో

జువ్విగుంట నుంచి దొనకొండ క్రాస్‌రోడ్డు వద్ద సభాప్రాంగణం వరకు గ్రామాలన్నింటిలో ఆదివారం విద్యుత్‌శాఖ కరెంటుకోత విధించింది. కనిగిరిలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఆరున్నర వరకు సరఫరా నిలిపేసింది. ప్రజలు ఉక్కపోతతో నానా అవస్థలు పడ్డారు. బహిరంగ సభ అనంతరం బస్సుయాత్ర జరిగే పొదిలితోపాటు మార్గమధ్యంలోని గ్రామాల్లోనూ కరెంటు తీసేశారు. పొదిలిలో జగన్‌ను చూసేందుకు రోడ్డుమీదకు వచ్చిన వారికి కూడా జగన్ కనిపించకపోగా కరెంటుకోతతో ఆయన ప్రయాణించిన బస్సుకూడా కనిపించలేదు. చివర్లో రాత్రి 9 గంటల ప్రాంతంలో దర్శిలో మాత్రం కరెంటుకోత విధించలేదు.

మండుటెండలో పడిగాపులు!

- బస్సులన్నీ సిద్ధం సభకు కేటాయింపు
- ముందస్తు సమాచారం లేక ప్రయాణికులకు తప్పని పాట్లు
- వైసీపీ తీరుపై ఆగ్రహం

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 7 : వైసీపీ సభ అంటేనే జనానికి విరక్తి వస్తోంది. ఎన్నికల్లో గెలుపు కోసం ఆపార్టీ నేతలు చేస్తున్న జిమ్మిక్కులను చూసి వారు అసహ్యించుకుంటున్నారు. కోడ్ రాకముందు వరకు సిద్ధం సభ, పథకాలకు బటన్ నొక్కుడు, ఇళ్ల పట్టాలు పంపిణీ.. ఇలా అయినదానికి, కానిదానికి ప్రజలను పరుగులు పెట్టించారు. ఆర్టీసీని సొంత సంస్థలా వాడేశారు. అధికారులు కూడా వారికి వంతపాడుతున్నారు. ఇప్పుడు కూడా అదేపంథాను కొనసాగిస్తున్నారు. ఆదివారం జిల్లాలో జరిగిన సీఎం పర్యటన, దొనకొండ క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన బహిరంగ సభకు జనాన్ని తరలించేందుకు రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి 1,400 బస్సులు కేటాయించారు. అందులో ఉమ్మడి జిల్లా నుంచి 257 ఉన్నాయి. వాటిలో ఒంగోలు, పొదిలి, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు ఆర్టీసీ డిపోలకు చెందిన 170 పల్లెవెలుగు బస్సులున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం, ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతమయ్యాయి. పల్లెవెలుగు బస్సుల కోసం పడిగాపులు కాశారు. ఒకవైపు ఆదివారం జిల్లాలో 41 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రత నమోదు కాగా మండుటెండలో ప్రజలు పడిగాపులు కాశారు. బస్టాండ్‌లలో గంటల తరబడి ఎదురుచూసిన వారు అటు వైసీపీ నేతలు, ఇటు ఆర్టీసీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎర్రగొండపాలెం బస్టాండ్ వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

డిపోల వారీ కేటాయించిన బస్సుల వివరాలు ఇవీ..

సీఎం సభకు రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి 1,400 బస్సులు కేటాయించారు. అందులో ఒంగోలు డిపో నుంచి 48, మార్కాపురం నుంచి 58, కందుకూరు నుంచి 45, అద్దంకి నుంచి 27, చీరాల నుంచి 22, కనిగిరి నుంచి 7, గిద్దలూరు నుంచి 42, పొదిలి నుంచి 30, మార్కాపురం నుంచి 20 బస్సులు ఉన్నాయి. ఇవి కాక బద్వేలు డిపో నుంచి 20, కడప నుంచి 30, కావలి నుంచి 50, పీలేరు నుంచి 30, సత్యవేడు నుంచి 15, సూళ్లూరుపేట నుంచి 10, నెల్లూరు నుంచి 60, రాజంపేట నుంచి 30, పుత్తూరు నుంచి 15, రాపూరు నుంచి 30, బాపట్ల నుంచి 26, రేపల్లె నుంచి 25, వెంకటగిరి నుంచి 20, గూడూరు నుంచి 20 బస్సులు కేటాయించారు. తిరుపతి డిపో నుంచి 15, శ్రీకాళహస్తి నుంచి 20, మంగళం 15, రాయచోటి నుంచి 40, జమ్మలమడుగు నుంచి 20, పులివెందుల నుంచి 30, ప్రొద్దుటూరు నుంచి 30, ఉదయగిరి నుంచి 30, ఆత్మకూరు నుంచి 8, గుంటూరు నుంచి 110, మంగళగిరి నుంచి 20, పొన్నూరు నుంచి 20, తెనాలి నుంచి 40, కనిగిరి నుంచి 22, పొదిలి నుంచి 30, చిలకలూరుపేట నుంచి 40, మాచర్ల నుంచి 20, నరసరావుపేట నుంచి 30, పిడుగురాళ్ల నుంచి 35, సత్తెనపల్లి నుంచి 30, వినుకొండ నుంచి 45, ఆత్మకూరు నుంచి 32, నెల్లూరు నుంచి 45, కనిగిరి నుంచి 3, మైదుకూరు నుంచి 20 బస్సులు కేటాయించారు. దీంతో ప్రయాణికులకు వెతలు తప్ప లేదు.

నీళ్లు, నిధులు నిల్

- పంచాయతీల్లో పైసా లేదు
- తీవ్రమవుతున్న తాగునీటి సమస్య
- గొంతెండుతున్న గ్రామాలు
- నిస్సహాయ స్థితిలో పాలకవర్గాలు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 7 : జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతోంది. తాగునీటి సమస్య తీవ్రమైంది. అనేక గ్రామాల్లో నీటి కోసం ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈసమయంలో వారి గొంతు తడిపేందుకు గుక్కెడు నీరు కూడా సరఫరా చేయలేని దుస్థితిలో పంచాయతీ పాలకవర్గాలు ఉండిపోయాయి. అందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమయ్యాయి. పంచాయతీలకు వివిధ రూపాల్లో వస్తున్న నిధులను ఎప్పటికప్పుడు లాగేసుకోవడంతో ఖాతాలు ఖాళీ అయ్యాయి. దీంతో పాలకవర్గాలు ప్రజలకు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాయి.

చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేని దయనీయం

వేసవి కాలం వచ్చిందంటే సాధారణంగా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. పంచాయతీ కార్యాలయంతోపాటు ముఖ్యకూడళ్లలో వీటి ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తుంటారు. కానీ ప్రస్తుతం పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలంటేనే పాలకవర్గాలు భయపడుతున్నాయి.

తాగునీటి సమస్య తీవ్రతరం


ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో మార్చి రెండో వారం నుంచే జిల్లాలో ఎండల తీవ్రత పెరిగిపోయింది. గ్రామాల్లో మంచినీటి పథకాలు మొరాయిస్తున్నాయి. చేతి పంపులు కొన్ని ఎండిపోగా, మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. అదేసమయంలో పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించడం, ఆంక్షలు విధించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇటీవల రూ.35కోట్లు విడుదల చేసినా వినియోగించుకునే అవకాశం లేకుండాపోయింది. సాధారణంగా వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో పశ్చిమప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాలో అనేక అక్రమాలు జరగడంతో రవాణాపై షరతులు విధించింది. ఆ ప్రకారం ఆయాగ్రామాల పరిస్థితులకు అనుగుణంగా అధికార యంత్రాంగం పరిశీలన చేసి కలెక్టర్‌కు నివేదికను ఇచ్చిన తర్వాత ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని సరఫరా చేయాల్సి వస్తోంది. ఇది సమస్యగా మారింది.

టీచర్ల విదేశీ ప్రయాణ అనుమతులు రద్దు

- పోలింగ్ తేదీ ముగిశాకే పరిశీలన
- ఎన్నికల విధులకు నియమితులైన వారికే వర్తింపు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 7 : ఎన్నికల ప్రవర్తనా నియామావళి అమలులో ఉన్నందున ఉపాధ్యాయుల విదేశీ ప్రయాణ అనుమతులను రద్దు చేశారు. ఈమేరకు పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు మే 13న జరగనున్నాయి. అందుకు సంబంధించిన విధులకు ఉపాధ్యాయులను నియమించి వారికి శిక్షణ ఇస్తున్నారు. అలాంటి వారిలో ఇప్పటికే మే 13లోపు విదేశాలకు వెళ్లేందుకు ఇచ్చిన అనుమతులు, నిరభ్యంతర సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)లను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం మళ్లీ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, హైస్కూలు హెచ్‌ఎంలు తమ పరిధిలో పనిచేస్తున్న వారు ఎవ్వరైనా ఎన్నికల విధులకు నియమితులై మే 13లోపు విదేశాలకు వెళ్లే వారు ఉంటే నిలిపివేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు నియమితులు కాని వారి విదేశీ ప్రయాణానికి ఎటువంటి ఆటంకాలు లేవని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మద్యానికి రేషన్



బార్లలో కొనుగోలుకు వైసీపీ నాయకుల చీటీలు

బార్లలో మద్యం కొనుగోలు చేసేందుకు వైసీపీ నాయకులు చీటీల విధానం అవలంబిస్తున్నారు. పొదిలిలోని ఒక బార్‌లో ఈ తరహా వ్యవహారం జరుగుతుందని సమాచారం. జిల్లా ఉన్నతాధికారికి అందింది. అక్కడ సీఎం పర్యటన నేపథ్యంలో ఇది జోరుగా నడుస్తుందని ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎక్సైజ్, ఎస్‌ఈబీ అధికారులను అప్రమత్తం చేశారు. ఒంగోలు ఎక్సైజ్ ఈఎస్ టి.శౌరి, ఎస్‌ఈబీ ఈఎస్ రవికుమార్‌ల ఆధ్వర్యంలోని బృందాలు అక్కడకెళ్లి తనిఖీలు నిర్వహించాయి. అక్కడ స్లిప్పుల విధానం ఏమీ జరగడం లేదని తేల్చాయి. కానీ ముందస్తుగా అందిన సమాచారం మేరకు బార్ యజమాని అప్రమత్తమైనట్లు తెలుస్తోంది.

- రెండురోజుల నుంచి అమలు
- విచ్చలవిడి విక్రయాలపై ఈసీ సీరియస్
- మధ్యాహ్నానికే మూతపడుతున్న సర్కారు దుకాణాలు
- బార్లు మాత్రం బార్లా
- పొదిలిలో ఎక్సైజ్, ఎస్ఈబీ తనిఖీలు

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 7 : ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపట్టడంపై ఈసీ సీరియస్ అయ్యింది. దీంతో రేషన్ విధానాన్ని అధికారులు అమల్లోకి తెచ్చారు. ఆ ప్రకారం గత ఏడాది ఏప్రిల్ నెలలో ఏతేదీన ఎంత మద్యం విక్రయించారో ఇప్పుడు కూడా అంతే అమ్మాల్సి ఉంటుంది. దాన్ని శనివారం నుంచే ఆచరణలో పెట్టారు. దీంతో నిర్దేశిత కోటా మధ్యాహ్నానికే పూర్తయి అన్ని దుకాణాలు మూతపడుతున్నాయి. ఈ విధానం బార్ల యజమానులకు మాత్రం బాగా కలిసివస్తోంది. బార్లకు సైతం నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు యజమానులు ఖాతరు చేయడం లేదు. ఉదయం 6నుంచి రాత్రి 12 గంటల వరకు తెరచి మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. గత ఏడాది ఏప్రిల్‌లో సరాసరిన రోజుకు సుమారు రూ.4కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది ఎన్నికల సీజన్ కావడంతో



నిన్నమొన్నటి వరకు భారీగానే అమ్మారు. ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేసే సరికి రేషన్ విధానం ప్రారంభించి మద్యం విక్రయాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. అంతేకాకుండా బెల్ట్ దుకాణాలను కట్టడి చేసేందుకు ఒక్కొక్కరికి ఒక బాటిల్ చొప్పున విక్రయిస్తున్నారు.

గత నెల రెండో పక్షంలో రూ.60కోట్ల విక్రయాలు

జిల్లాలో 178 మద్యం దుకాణాలు, 35 బార్లు ఉన్నాయి. వీటిలో కోడ్ అమల్లోకి వచ్చిన మార్చి 16 నుంచి 31 వ తేదీ వరకూ 15 రోజుల్లో సుమారు రూ.58.81కోట్ల మేర విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. అందులో 67,375 బాటిళ్ల మద్యం, 17,203 బీరు సీసాలు ఉన్నాయి. గత ఏడాది మార్చి రెండో పక్షంలో రూ.56.01 కోట్ల అమ్మకాలు జరిగాయి. అంటే సుమారు రూ. 2.80 కోట్ల మద్యం అధికంగా విక్రయిచారు.

'సన్'డే!

- మండిన ఎండ
- ఒంగోలులోనూ 40డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- పశ్చిమప్రాంతంలో మరింత తీవ్రత

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 7 : జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. ఇప్పటికే పశ్చిమప్రాంతంలోని పలుచోట్ల 44 డిగ్రీలు దాటింది. ఆదివారం తూర్పుప్రాంతంలో కూడా తీవ్రత అధికంగా కన్పించింది. ఒంగోలులో గరిష్ఠ ఉష్ణోగ్రత 40.5 డిగ్రీలు నమోదైంది. ఉదయం 11 గంటల నుంచే నగరంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఒకవైపు ఎండ తీవ్రత, ఇంకో వైపు ఉక్కపోతతో ప్రజానీకం అల్లాడిపోయారు. రోజువారీ చిరువ్యాపారాలు చేసుకొని జీవించే వారు అనేక ఇబ్బందులు పడ్డారు. ఏదైనా పనిమీద బయటకు వెళ్లిన వారు మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతతో ఎక్కడో ఒకచోట కొద్దిసేపు సేదతీర్చుకోవాల్సి వస్తోంది. మరోవైపు శీతల పానీయాలకు డిమాండ్ ఏర్పడింది. సాయంత్రం కూల్‌డ్రింక్, జ్యూస్, ఐస్‌క్రీమ్ దుకాణాల వద్ద రద్దీ కనిపిస్తోంది. ఇదే పరిస్థితి మరికొద్దిరోజులు కొనసాగే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.





ఒంగోలులో ఎండను తట్టుకోలేక రక్షణ చర్యలతో ఇంటికెళ్తున్న బైకిస్టులు



జగన్ పర్యటన సందర్భంగా మందు బాబుల విన్యాసాలు

గిరిజనుల ద్రోహి జగన్‌రెడ్డి..!

తెలుగుదేశం కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల ధ్వజం

వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పిలుపు

గిరిజన ఆత్మీయ సమావేశం

హాజరైన ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన గిరిజనులతో దామచర్ల జనార్దన్, దారునాయక్



టీడీపీలో చేరిన 49వ డివిజన్ వైసీపీ కార్యకర్తలతో దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 7: గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీని వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని, గిరిజన ద్రోహి జగన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కూటమి ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగిన గిరిజన ఆత్మీయ సమావేశానికి దామచర్లతోపాటు పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులు మరింత వెనుకబాటుతనానికి గురయ్యారని ఆరోపించారు. గిరిజనులు అభివృద్ధి కోసం తెలుగుదేశం అనేక పథకాలు ప్రవేశపెట్టి అన్ని విధాలుగా అండగా నిలిచిందన్నారు. వైసీపీ వచ్చాక ఒక్క సంక్షేమపథకాన్ని కూడా అమలు చేయకపోగా దళిత, గిరిజనులపై దాడులు, అక్రమ కేసులు పెట్టి అన్ని విధాలుగా ఇబ్బందులు పెట్టిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించడానికి గిరిజనులందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. టీడీపీ ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని, ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎంను చేసుకుందామని కోరారు. ఒంగోలు నగరంలో రూ.50లక్షలతో గిరిజన భవనం నిర్మించడం జరిగిందని, ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్ నుంచి వందల మందికి సబ్సిడీ రుణాలు అందించినట్లు తెలిపారు. కానీ వైసీపీ పాలకులు కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని, ఒక్క పైసా నిధులు ఇవ్వకపోగా ఒక్క రుణానికి కూడా అందించలేని దౌర్భాగ్య వైసీపీ ప్రభుత్వానిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం దారునాయక్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్, గ్రూప్ 1, సివిల్స్ కోచింగ్ ఇచ్చి ఎందరికో ఉద్యోగ అవకాశాలు అందిచ్చినట్లు చెప్పారు. విదేశీ విద్య ద్వారా అనేకమంది గిరిజనులను విదేశాలకు పంపించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కానీ నేడు వైసీపీ వచ్చాక వాటన్నిటిని రద్దు చేయడమే కాకుండా జగన్ సొంత పేర్లు పెట్టుకున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా స్థానిక జయప్రకాష్‌కాలనీ నుంచి సుమారు 50 మంది గిరిజనులు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. సమావేశంలో నాయకులు రాపూరి శ్రీను, కత్తి పద్మ, పార్లమెంట్ అధ్యక్షులు సేవ్యనాయక్, రాచగర్ల వెంకట్రావు, లక్ష్మనాయక్, పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

6వ డివిజన్‌లో దామచర్ల ప్రచారం

తెలుగుదేశం అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలతోనే ప్రజలకు సంక్షేమం లభిస్తుందని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 6వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ప్రజలు ఆశీర్వదించి మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనుభవం గల చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే నిరుద్యోగులు, యువతకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అలాగే ప్రతి ఏటా రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థిక సహాయం. మహిళ శక్తి ద్వారా ప్రతరి మహిళకు నెలకు రూ.1500, పాఠశాలకు వెళ్ళే విద్యార్థులకు ఏడాదికి రూ.15వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా వంటగ్యాస్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. గడిచిన ఐదేళ్ళలో వైసీపీ ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి, ఒక్కఛాన్స్ అంటూ ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం, చివరికి చెత్తపైనా పన్ను విధించిన చెత్త ప్రభుత్వం అన్నారు. సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకుండా చేసి, లక్షలాది మంది భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి దూరం చేసిన దుర్మార్గపు వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. వచ్చేనెల 13న జరిగే ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, టీడీపీని గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని దామచర్లకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, మంత్రి శ్రీనివాసరావు, బండారు మదన్, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, రాచగర్ల వెంకట్రావు, కుట్టుబోయిన శ్రీను, ఆవుల శ్రీను, శ్రీరాములు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

49వ డివిజన్ నుంచి టీడీపీలో చేరిక

నగరంలోని 49వ డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రమణబోయిన శ్రీను, చీరబోయిన రమణయ్య, యారం బండయ్య, మేకల జగదీష్, మల్లెబోయిన హరీష్, బుర్రా పవన్ కళ్యాణ్, ఆవుల శ్రీహరితోపాటు మహిళలు, పెద్దసంఖ్యలో చేరనివారిలో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు భైరపనేని శ్రీను, పొనుగుపాటి వెంకటేశ్వర్లు, పేలప్రోలు బ్రహ్మానందం, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టే పార్టీలను ఓడించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 7: రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి బీజేపీకి వంతపాడుతున్న పార్టీలను ఓడించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం కందే బాలకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెద్దబ్బాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోనాలను తాకట్టు పెడుతూ దేశ సంపదను దోచుకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి మద్దతు పలికిన టీడీపీ, జనసేన, వైసీపీలను ఓడించి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. దేశంలో రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీని ఓడించాలన్నారు. రాష్ట్రంలో గ్యాస్, విద్యుత్ చార్జీలు, ఇంటి పన్ను,చెత్తపన్ను పెంపు పాపం బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలదేనని ఆయన ఆరోపించారు. కార్యదర్శి తోట తిరుమలరావు మాట్లాడుతూ జిల్లాలోవర్షపాతం తక్కువగా ఉండటం, సాగర్‌నీరు రాకపోవడంతో జీవాలకు, పశువులకు స్థానికంగా మేత, నీళ్ళు దొరక్క అర్ధాకాలితో ఆలమటిస్తున్నాయన్నారు. పశునష్టపహారం, పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి శివయ్య, ఎన్.గంగరాజు, కె.జయరాం, రమేష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



నివాళులర్పిస్తున్న కళాసంస్థల ప్రతినిధులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 7: పద్మశ్రీ ఘంటసాల కళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. సంస్థ అధ్యక్షురాలు తులసీ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీతులసి, కోటేశ్వరరావు, శ్రీదేవి, నాగేశ్వరమ్మ, విజయ్, శివప్రసాద్, వై.వి.రావు తదితరులు పలు గీతాలను ఆలపించారు. పి.శివ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కాగా కీబోర్డుపై రవి, పాడ్స్ సురేష్, డ్రమ్స్ మోహన్, తబలా శివప్రసాద్‌లు వాద్య సహకారాన్ని అందజేశారు. బాపట్ల సమాచార శాఖ అధికారి టి.మోహన్ రాజు, సీనియర్ గాయకులు అప్పిశెట్టి రత్తయ్య, మొవ్వా నాగేశ్వరరావు, కుర్రా ప్రసాద్‌బాబు, వెన్నూరి నాగేశ్వరరావు, ఖాదర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

బడుగులకు టీడీపీతోనే భరోసా

తెలుగుదేశం కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ • పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేద్దామని పిలుపు



పేర్నమిట్ట వడ్డెరపాలెంలో మాట్లాడుతున్న బీఎన్



పార్టీలో చేరిన చంద్రపాలెంవాసులతో విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఏప్రిల్ 7: పేదలు, బడుగు బలహీన వర్గాలకు భరోసా ఇచ్చే తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పేర్నమిట్టలో వడ్డెరపాలెంలో స్థానిక నాయకులు గుంజిరాజు, తన్నీరు రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల పార్టీ అంటేనే టీడీపీ అని చెప్పారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల పార్టీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు సిరిపురం రుద్రయ్య, వివరం గోవిందు, తన్నీరు శ్రీను, రాంబాబు, వి.వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాసరావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఇ.విష్ణు, శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేర్నమిట్ట కమ్మపాలెంలో 38, 39, 40, 41, 42 డివిజన్ నాయకులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ కుటుంబంలో చిన్నచిన్న సమస్యలు ఉంటాయని, అదేవిధంగా టీడీపీలోని నాయకుల మధ్య ఉన్న అలాంటి సమస్యలు పక్కనబెట్టి గెలుపునకు కృషి చేస్తేనే ప్రజలకు న్యాయం చేసినవారవుతామని తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితులు అత్యంత దయనీయంగా మారిపోతున్నాయని, ఇటువంటి సమయంలో రాష్ట్ర పగ్గాలు చంద్రబాబు చేతికి వస్తేనే పాలన గాడిన పడుతుందని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఎన్

రాష్ట్రంలో ముస్లింల సంక్షేమం కోరే నాయకుడు చంద్రబాబునాయుడు అని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యంలో ఆదివారం సాయంత్రం టీడీపీ ముస్లిం నా



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఎన్

యకులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి విందును స్వీకరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. జనసేన నాయకులు ఎం.రమేష్, వి.వెంకటేశ్వరరెడ్డి, కె.శ్రీనివాసరావు, పఠాన్‌మన్సూర్‌ఖాన్, సయ్యద్‌ఖాజావలి, ఎస్‌కే.అమానుల్లా, సుభానీ, పఠాన్‌బాబు, ఇస్మాయిల్, ఫకీర్, వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బీసీల పుట్టినిల్లు

నాగులుప్పలపాడు : తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పుట్టినిల్లు అని టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి చదలవాడలో గ్రామ అధ్యక్షులు గుమ్మడి సురేష్ ఆధ్వర్యంలో చేకూరపాడు, మద్దిరాలపాడు, చీర్వానుప్పలపాడు, నాగులుప్పలపాడు గ్రామాల పరిధిలోని బీసీలతో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ బీసీల రక్షణ చట్టం టీడీపీతోనే సాధ్యమన్నారు. 50 ఏళ్ళకే బీసీలకు రూ.4వేల పింఛను అందజేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్ కుమార్, అడకా స్వాములు, బి.సెల్వం, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, జనసేన పార్టీ మండల అధ్యక్షులు భూపతి మురళీ, ఎంపీటీసీ శివకృష్ణ, ఇంటూరి శ్రీనివాసరావు, పెనుబోతు సునీల్ పాల్గొన్నారు. అనంతరం చదలవాడలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, పీపీఎస్ అధికారి కృష్ణప్రసాద్‌ను ఎంపీగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

చంద్రపాడులో..

చీమకుర్తి: మండలంలోని చంద్రపాడు గ్రామంలో అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పది కుటుంబాలు ఆదివారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికి టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపునకు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటానని బీఎన్ భరోసానిచ్చారు. కార్యక్రమంలో మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, కొండలు, వెంకట్రావు, శ్రీను, పాముల శ్రీను, వెంకటేష్, చిరంజీవి, అంకమ్మరావు, ధరాశి శ్రీను, రమణయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది పురస్కార వేడుకలు



సీవీఎన్ రీడింగ్ రూములో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 7: క్రోధినామ ఉగాది సందర్భంగా పలు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పురస్కార వేడుకలు, కవి సమ్మేళనాలు ఘనంగా ఆదివారం జరిగాయి. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మండవ మురళీకృష్ణ పలు సంస్థల ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కల్చరల్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు గాయకులు పలు గీతాలతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ ఉగాది తెలుగు సంప్రదాయానికి ప్రతీక అని, షడ్రుచుల ఉగాది పచ్చడి పచ్చడి ద్వారా జీవిత సారాన్ని పెద్దలు మనకు వివరిస్తారన్నారు. కార్యక్రమలో వేద పండితులు పరాంకుశం కేశవాచార్యులు, టీ.వి.శ్రీరామమూర్తి, కె.కుసుమకుమారి, సుజితా శేఖర్, వెంకట్, మొవ్వా నాగేశ్వరరావు, అర్జున్ కర్నాటి, నున్నా శ్రీనివాసరావు, ఐ.మురళీకృష్ణ, పి.శ్రావ్యరెడ్డి, సంగీత, గౌరి, ఉషారాణి, పరిమళ, సుహాసిని, డాక్టర్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు. అటు కళామిత్ర మండలి, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక గౌతమ్ మోడల్ స్కూలులో ఏర్పాటు చేసిన ఉగాది కవిసమ్మేళనానికి నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ఉగాది విశిష్టతను వివరించారు. కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబులు పాల్గొన్నారు. సభ అనంతరం పలువురు కవులు తమ కవితలను వినిపించారు. ఇక శ్రీ అభయ కళారాధన సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని గంగా పార్వతి సమేత శ్రీనగేశ్వర స్వామి దేవస్థానంలో సంస్థ అధ్యక్షుడు మద్దాలి మాధవరావు నిర్వహణలో అర్హులకు ఉగాది పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేల పెన్షన్

• టీడీపీ నేత బొమ్మాజీ అనిల్‌కుమార్



మద్దిపాడులో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

సంతనూతలపాడు, ఏప్రిల్ 7: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 50 సంవత్సరాలు వయస్సు దాటిన బీసీలకు రూ.4వేల పెన్షన్ అందజేస్తామని ఆ పార్టీ నాయకుడు బొమ్మాజీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గంగవరంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని, త్వరలో జరిగే ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా బీఎన్.విజయ్‌కుమార్ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్, వారి అభివృద్ధి, ఉపాధి ప్రోత్సాహకాలపై చంద్రబాబు పూర్తిస్థాయి స్పష్టతతో ఉన్నారని ఆయన తెలిపారు. వైసీపీ విముక్త రాష్ట్రం కోసం బీఎన్.విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు తన్నీరు శ్రీను, కె.రాజు, ఆర్.అంకారావు, ఆర్.సురేష్, బి.శ్రీను, కె.ఆంజనేయులు, శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు అధిక ప్రాధాన్యత

మద్దిపాడు : టీడీపీతోనే బీసీలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని ఆ పార్టీ నేత బొమ్మాజీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మద్దిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు తెలుగుదేశంతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. మండల అధ్యక్షుడు మండవ జయంతిబాబు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ పథకాలు మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అడకా స్వాములు, డొప్పా శేషయ్య, మందపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ అద్దేపల్లి భవాని, వేణుగోపాలరాజు, శుద్ధపల్లి అనిల్, నాయుడు బాలచందర్, బాపట్ల వెంకటేశ్వర్లు, వేల్పుల నాగరాజు, మండవ గోపీనాథ్, దేవబత్తిన ప్రసాద్, చింతల శ్రీనివాసరావు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, కడియాల రఘుబాబు, శుద్ధపల్లి అనిల్, శుద్ధపల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రిలియంట్ కంప్యూటర్స్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ న్యామతుల్లాబాషా

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 7: ఒంగోలు నగరం అంజయ్యరోడ్డులోని బ్రిలియంట్ కంప్యూటర్స్ 29వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ న్యామతుల్లాబాషా, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తహరాలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా న్యామతుల్లాబాషా మాట్లాడుతూ సాంకేతిక విద్యతో అత్యంత ఉపయోగకరమైన కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ యాప్ డెవలపింగ్, సైబర్ సెక్యూటీస్ తదితర కోర్సులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కంప్యూటర్ శిక్షణతో పాటు మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, ఎంఎస్‌డబ్ల్యూ లాంటి మరెన్నో సంస్థల నుంచి గుర్తింపు పొంది సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 100 మంది పేద విద్యార్థులకు జాబ్ ఓరియంటెండ్ కోర్సులు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 10లోపు సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ అఖిల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

స్కూలు కాంప్లెక్స్‌ల్లో ప్రశ్నపత్రాలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 7 : పాఠశాలల్లో 1నుంచి 9 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థుల వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను స్కూలు కాంప్లెక్స్‌ల్లో భద్రపర్చాలని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి ఆదివారం సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదట మండల విద్యా కేంద్రాల్లో భద్రపర్చి ప్రతి రోజు అక్కడి నుంచే ప్రశ్నపత్నాలను పాఠశాలలకు చేర్చాలని నిర్ణయించారు. అయితే ఎండల తీవ్రత, దూరాన్ని పరిగణలోకి తీసుకొని స్కూలు కాంప్లెక్స్‌ల్లోనే ప్రశ్నపత్రాలను భద్రపరిచి ఏరోజుకారోజు సంబంధిత పాఠశాలలకు అందజేయాలని చెప్పారు.

పాఠశాలలకు చేర్చాలి : ప్రశ్నపత్రాలను ఏరోజుకారోజు పాఠశాలలకు చేర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ టీచర్స్ గిల్డ్‌జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. స్కూలు కాంప్లెక్స్‌కు పాఠశాలలకు దూరం ఎక్కువగా ఉన్నందున అక్కడి వెళ్ళి ప్రశ్నపత్రాలు తీసుకురావడంలో జాప్యం జరుగుతుందన్నారు. దీనిని పరిగణలోకి తీసుకొని ఎంఈవోలు ప్రశ్నపత్రాలను పాఠశాలలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 7: ఒంగోలు లోక్‌సభసభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మంగళవారం ఉదయం 8గంటలకు స్థానిక మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 9 గంటలకు నగరంలో జరిగే ఉగాది పంచాగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జాళ్ళపాలెం అమ్మవారి తిరునాళ్ళకు హాజరవుతారు. బుధవారం ఒంగోలు నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. గురువారం ఉదయం 11 గంటలకు కనిగిరి నియోజకవర్గంలో పర్యటిస్తారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న కోటేశ్వరి

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 7: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉపగ్రంథాపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థుల కోసం నిర్వహించిన చదవటం మాకిష్టం కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. గ్రంథాలయంలో ఎన్నో విజ్ఞాన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య మాట్లాడుతూ ప్రతి రోజు కనీసం ఒక గంట పాటు వ్యాయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎం.శివకుమారి, ఎస్.అనిల్‌బాబు, నున్నా ఆంజనేయులు, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ వార్షికోత్సవం



ఉద్యోగ నియాయక పత్రాలతో విద్యార్థులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 7 : ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ 42వ వార్షికోత్సవ, ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లాపరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తులో కళాశాల డిప్లమో ఇంజినీర్లకు అండగా ఉండి సహకారం అందిస్తానని చెప్పారు. ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తాము చదువుతున్న ట్రేడ్‌లో పట్టు సాధించి నైపుణ్యాలు, మెలకువల అభివృద్ధి చేసుకుంటే తేలికగా ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. కళాశాలలో డిప్లొమో చివరి సంవత్సరం చదువుతున్న 76 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీఎస్ఎంఐడీసీ ఈఈ కె.సత్యనారాయణ. మోహన్‌బాబా లాజరస్‌బాబు, వి.శ్రీనివాసరావు, శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 7: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు ఆదివారం సాయంత్రం ఒంగోలులోని గాంధీపార్కులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్వో సుబ్బారెడ్డి కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు బి రవికుమార్, జ్యోతి, సీప్ అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


వైసీపీతోనే సంక్షేమ పాలన : మంత్రి

సంతనూతలపాడు, ఏప్రిల్ 7: సంక్షేమపాలన అందించే వైసీపీకి ఓటువేయాలని మంత్రి, సంతనూతలపాడు వైసీపీ అభ్యర్థి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ఆదివారం మాచవరం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ పరిపాలనలో పేదలకు ఎంతో భరోసా కలిగిందని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డి.రమణమ్మ, బి.క్రిష్ణయ్య, చెంచిరెడ్డి, యలమందారెడ్డి, శైలజ, అమరనాథ్, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైజ్‌లో ఘనంగా వీడ్కోలు వేడుకలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 7: ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ప్రకాశంగ్రూపు విద్యా సంస్థలో ఈఈఈ, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులు తమ సీనియర్లు నాల్గవ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అధ్యాపకులను సన్మానించారు. సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను ఇతర విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, డైరెక్టర్ ఏవీభాస్కరరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాధిపతి ఎ.కృష్ణ, ఈఈఈ విభాగాధిపతి రుషిసంతోష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సిమెంట్ బల్లల వితరణ



బల్లలను అందజేసిన శరత్‌బాబు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 7: ఒంగోలు నగరం కమ్మపాలెం అప్పాయగుంట దగ్గర ఉన్న ఆశయం వృద్ధాశ్రమానికి హోటల్ సాగర్ అధినేత దేవారెడ్డి శరత్‌బాబు ఆదివారం సిమెంట్ బల్లలు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి తిరుపతిరావు జ్ఞాపకార్థం బల్లలను అందజేసినట్లు తెలిపారు. కర్నూల్ రోడ్డు వ్యాపారస్తుల సంఘం ప్రధాన కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ వృద్ధాశ్రమాలకు ప్రతి ఒక్కరు శక్తికొద్దీ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు గోను లీలారాణి, గురవయ్య తదిత రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మల్టీటాలెంట్ ఎక్స్‌పో



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కరస్పాండెంట్

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 7: ఒంగోలు నగరం సుజాతనగర్‌లోని అపెక్స్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన మల్టీ టాలెంట్ ఎక్స్‌పో విశేషంగా ఆకట్టుకుంది. నృత్యాలు, కోలాటం, కర్రసాము, కరాటే, మార్షల్ ఆర్ట్స్, పీరియాడికల్ టేబుల్స్, రాపిడ్ రాకెట్ ట్రాకర్, కీబోర్డ్ ప్లేయింగ్ వంటి పలు అంశాలను విద్యార్థులు ప్రదర్శించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కరతాళ ధ్వనులు అందుకున్నారు. అనంతరం కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో బీఎంఆర్ ఇన్‌ఫ్రా అధినేత అర్జున్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ దారా విష్ణు, యూఎస్ కన్సల్టెన్సీ బాబాసాయి, గైనకాలజిస్ట్ కె.జ్యోష్ణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ జ్యోతి, డైరెక్టర్ పి.రామాంజనేయులు, అనురాధ, లక్ష్మి, కళ్యాణి తదిత రుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సుమారు 500 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాకుటూరివారిపాలెం పంచాయతీ కార్యాలయం

కార్యదర్శి లేని కాకుటూరివారిపాలెం పంచాయతీ

వైసీపీ నేతల ఒత్తిడి తట్టుకోలేక గత నెల 22న సెలవుపై వెళ్లిన ఉద్యోగి

గ్రామంలో పట్టిపీడిస్తున్న సమస్యలు

సిబ్బందికి అందని జీతాలు

కాకుటూరివారిపాలెం(టంగుటూరు) ఏప్రిల్ 7 : మండలంలోని కాకుటూరివారిపాలెం పంచాయతీకి కార్యదర్శి లేరు. మొన్నటివరకూ ఉన్న కార్యదర్శి తాను ఆ గ్రామంలో విధులు నిర్వర్తించలేనని గత నెల 22న సెలవులో వెళ్లిపోగా అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. కాకుటూరివారిపాలెం సర్పంచ్ కొమ్మినేని రమణమ్మ టీడీపీ మద్దతురాలు. ఆమె టీడీపీ మద్దతురాలు కావడం ఇక్కడ పెద్ద నేరంగా భావిస్తున్నారు. వైసీపీ స్థానిక నాయకుల ఒత్తిడి దెబ్బకు అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధికార వైసీపీ నేతలు పాలనలో అడుగడుగునా సర్పంచ్‌కి అడ్డంకులు సృష్టిస్తూనే ఉంది. పంచాయతీని కాదని గ్రామంలో పెత్తనం చెలాయించేందుకు స్థానిక వైసీపీ పెద్దలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అధికారులను తమ గుప్పెటబెట్టుకొని ఆడిస్తున్నారు. సర్పంచ్‌ని పక్కనబెట్టి తాము చెప్పిందే చేయాలని వైసీపీ నాయకులు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ నియోజకవర్గ బాధ్యతలు చేపట్టాక వైసీపీ పెద్దల పెత్తనానికి అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఇక గ్రామంలో సమస్యలు పట్టిపీడిస్తున్నా పట్టించుకునే వారే లేరని ప్రజలు వాపోతున్నారు.

ఉద్యోగులకు జీతాలు లేవు

పంచాయతీలో ఉద్యోగులకు జీతాలు లేవు. పంచాయతీలో పనిచేసే నౌకర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు వీరందరికీ జీతాల బిల్లుపై సంతకం పెట్టాలంటే కార్యదర్శి కావాలి. ఆయన లేకపోవడంతో ఆ బిల్లు కాలేదు. జీతాల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.

ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్న డీపీవో, ఎంపీడీవో

పంచాయతీ కార్యదర్శి నియామకంపై డీపీవో ఉషారాణి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శి సాంబయ్య పంచాయతీని వదలి వెళ్లిననాటి నుంచి కొత్త కార్యదర్శి కావాలంటూ సర్పంచ్ తనయుడు కొమ్మినేని వెంకట్రావు ఎంపీడీవో, డీపీవో వద్దకు పదేపదే తిరుగుతూనే ఉన్నారు. ఎంపీడీవోనే అడిగినప్పుడల్లా "డీపీవోకు సిఫార్సు చేశాను. డీపీవో పంచాయతీ కార్యదర్శిని నియమిస్తారని చెబుతున్నారు. డీపీవోను కలిస్తేనేమో.. పంచాయతీ కార్యదర్శి నియామకం ఎంపీడీవో పరిధిలోనిదని, పర్మినెంట్‌ను నియమించినా, ఇన్చార్జిని నియమించినా అంతా ఎంపీడీవో ఇష్టమని తెల్చిచెబుతున్నారని" వెంకట్రావు తెలిపారు. డీపీవో, ఎంపీడీవో ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కార్యదర్శి నియామకాన్ని అడ్డుకుంటుంటే ఇక ఎవరికి చెప్పుకోవాలని వెంకట్రావు వాపోయారు. సత్వరమే పంచాయతీ కార్యదర్శిని నియమించాలని, కార్యదర్శి ద్వారా ఉద్యోగుల జీతాలు పెట్టించాలని వెంకట్రావు కోరారు.

చేనేత అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- **ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి కొండయ్య**

చీరాల, ఏప్రిల్ 7: మాటల్లో చెప్పటం కన్నా, అవకాశం ఇస్తే చేతల్లో చేసి చూపిస్తా.. చీరాల నియోజకవర్గ ప్రజల గుండెల్లో నిలిచేవిధంగా నడుచుకుంటానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని దేవాంగపురిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు షృధ్వి లలితామోహన్, వ్యాపారవేత్త సిద్ధి బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చేనేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతన్నలు సంక్షేమానికి, అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తామన్నారు. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు అవసరమైతే తాము భూమి కొనుగోలుచేసి మరీ ప్రభుత్వానికి ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ముప్పల వెంకటరమణరావు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో యువతది కీలకపాత్ర

జిల్లాను ఫార్మా హబ్‌గా చేయడమే టీడీపీ లక్ష్యం

హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే స్వామి, సత్య, రాఘవరెడ్డి





హాజరైన ఐటీ ఉద్యోగులు (ఇన్‌సెట్లో) సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

కొండపి, ఏప్రిల్ 7 : గ్రామీణ యువతను ఐటీ వైపు మళ్లించిన ఘనత చంద్రబాబుదేనని పలువురు పేర్కొన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో ఐటీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హైదరాబాద్‌లోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో కొండపి నియోజకవర్గానికి చెందిన హైదరాబాద్‌లో ఉండే ఐటీ ఉద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీ ప్రొఫెషనల్స్ వింగ్ అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని మాట్లాడుతూ ఏపీలో ఐటీ రంగం అభివృద్ధి సాధించాలన్నా, పారిశ్రామిక ప్రగతి సాధించి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమన్నారు. యువత చంద్రబాబుకు మద్దతుగా నిలిచి, రానున్న ఎన్నికల్లో కీలకపాత్ర పోషించాలని చెప్పారు. ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ వైసీపీ నాయకులకు, ముఖ్యమంత్రికి చట్టాల మీద గౌరవం లేదన్నారు. రాష్ట్రాన్ని ఐదేళ్లలో దోచుకుతిన్నారని, అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిపోయాయని చెప్పారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఏపీ సర్వనాశనమైందన్నారు. యువతను గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు చేసి వారి జీవితాలను నాశనం చేశారని చెప్పారు. ప్రకాశం జిల్లాను ఫార్మాహబ్‌గా చేయాలనేది చంద్రబాబు సంకల్పమన్నారు. ఐటీ ఉద్యోగులు చంద్రబాబుకు అండగా నిలవాలన్నారు. యువనాయకుడు మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ కొండపి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కూటమి తరఫున పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థులు ఒంగోలు ఎంపీగా తన తండ్రి మాగుంట శ్రీనివాసులరెడ్డిని, కొండపి ఎమ్మెల్యేగా డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రావెళ్ల రోశయ్య, అనుమోలు సుధాకర్, నేతి రవి కుమార్, బెల్లం రామకృష్ణ, గుజ్జుల శ్రీనివాసరెడ్డి, యర్రమోతు శ్రీనివాసరావు, ఐనంపూడి రమేష్ టీడీపీ ఐటీ విభాగం నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జనం ఎక్కక వెనుదిరిగిన సిద్ధం సభ బస్సు

ఊరూరా తిరిగినా ప్రజలను పంపలేక పోయిన వైసీపీ నేతలు



సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో వెనుదిరిగి వెళుతున్న గూడూరు డిపో బస్సు

కొండపి, ఏప్రిల్ 7 : పొదిలి సమీపంలో సీఎం జగన్ సిద్ధం సభకు మండలంలోని గ్రామాల నుంచి జనాన్ని తరలించేందుకు 32 బస్సులను అధికార పార్టీ నాయకులు కేటాయించారు. ఆదివారం ఉదయానికి తిరుపతి, గూడూరు డిపోలకు చెందిన బస్సులు ఆయా గ్రామాలకు చేరుకున్నాయి. ఎక్కువ గ్రామాల్లో బస్సుల్లో జనం ఎక్కలేదు. ఆయా గ్రామాల నాయకులు ఎస్సీకాలనీలు, వివిధ కాలనీల్లో తిరిగి బస్సులు ఎక్కాలని పదేపదే కోరుతూ తిరిగారు. నాయకులు ఎంతగా బతిమిలాడినా సభకు వెళ్లాలన్న ఆసక్తి జనంలో కనిపించలేదు. దీనికితోడు ఎండలు తీవ్రంగా ఉండటంతో వెనుకడుగు వేశారు. ఒకదశలో నాయకులు జనాన్ని పోగు చేసి బస్సు ముందు నిలబెట్టి ఫొటోలు తీసి పార్టీ గ్రూపుల్లో పోస్టు చేశారు. తక్కువ మందిని బలవంతంగా ఎక్కించి బస్సులు సాగనంపారు. కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలేనికి ఒక బస్సును కేటాయించగా, జనం ఎక్కలేదు. దీంతో బస్సు మధ్యాహ్నం వరకు గ్రామంలోనే ఉంది. జనం ఎక్కకపోవడంతో బస్సును గ్రామానికి వెలుపలున్న ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల ఆవరణలో సాయంత్రం వరకు ఉంచారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత డ్రైవర్ బస్సును వెనక్కి తీసుకువెళ్లారు. బస్సు ఎక్కడికి వెళ్తోందని డ్రైవర్‌ను ఆంధ్రజ్యోతి అడగ్గా, సోమవారం దర్శి నియోజకవర్గంలో జరగనున్న సిద్ధం సభకు బస్‌ను కేటాయించారని, ఆర్టీసీ అధికారులకు ఫోన్ చేసి వెళ్లమంటే రేపటి సభకు కేటాయించిన మండలానికి బస్సును తీసుకెళ్తానని డ్రైవర్ తెలిపారు. మొత్తంగా వైసీపీ సభలకు ఈమధ్య కాలంలో ఆర్టీసీ బస్సులు అధికంగా గ్రామాలకు వస్తున్నా జనం బస్సులు ఎక్కకపోతుండటం గమనార్హం.

అనంతవరంలోనూ వెనుదిరిగిన బస్సు

అనంతవరం(టంగుటూరు) : సీఎం జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం సభకు జనాలను తరలించేందుకు మండలంలోని అనంతవరానికి కేటాయించిన బస్సు ఎక్కేవారు లేక ఖాళీగా వెనుతిరిగింది. పొదిలి సమీపంలోని కొనకనమిట్ల జంక్షన్‌లో ఆదివారం ముఖ్యమంత్రి జగన్ సిద్ధం సభకు అనంతవరానికి కేటాయించిన ఆర్టీసీ బస్సు ఉదయమే వచ్చింది. సభకు జనాలను పంపించేందుకు స్థానిక వైసీపీ నాయకులు నానాతంటాలు పడ్డారు. అయినా ఫలితం లేదు. బస్సు ఎక్కేందుకు ఎవరూ సంసిద్ధత తెలపలేదు. చేసేది లేక ఉదయం 11గంటల ప్రాంతంలో వచ్చిన బస్సు ఖాళీగానే వెనుతిరిగి వెళ్లింది. ఇదే విధంగా మండలంలోని మరి కొన్ని గ్రామాలకు కేటాయించిన బస్సులూ ఖాళీగా వెనుతిరిగిన్నట్లు సమాచారం.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- **ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్**



సంతమాగులూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ ఉమ్మడి అభ్యర్థులు కృష్ణప్రసాద్, రవికుమార్

సంతమాగులూరు, ఏప్రిల్ 7: ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సంతమాగులూరులో బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే రవికుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్-6 పథకాలతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా సార్వత్రిక ఎన్నికల తర్వాత చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలను ఉన్నత స్థితికి తీసుకెళ్లే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు ఆలోచన విధానం ఉందని చెప్పారు. అందులో భాగంగానే మేనిఫెస్టోను తయారుచేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో రైతన్నల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించక పోవడమే కాకుండా సరైన సమయంలో రైతులు పండించిన పంటలు కొనుగోలు చేయకపోవడం ద్వారా జగన్ రెడ్డికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదనే విషయం తేట తెల్లమవుతోందన్నారు. అధికారంలోకి రాగానే ఈనెల ఏప్రిల్ నుంచి అవ్వ, తాతలకు పింఛన్ రూ.నాలుగు వేలు పరిగణనలోకి తీసుకుని జూన్ నెలలో రూ.7 వేలు అందిస్తామని చెప్పారు. వలంటీర్లను వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నందువల్లే వారిపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో వలంటీర్ల ద్వారానే రూ.4 వేల పింఛన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాడిపర్తి వెంకట్రావు, అట్లా చినవెంకట రెడ్డి, దూపాటి ఏసోబు, ఆలూరి శ్రీనివాసరావు, తేలప్రోలు రమేష్, అట్లా పెద వెంకటరెడ్డి, నాగబోతు సుబాత, కోణికి గోవిందమ్మ, జనసేన మండల అధ్యక్షుడు జి.రామాంజి, చల్లా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు కుర్రావానిపాలెం సర్పంచ్ సంఘీభావం

మేదరమెట్ల : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు కుర్రావానిపాలెం సర్పంచ్ నాదెండ్ల దశరథరామయ్య సంఘీభావం ప్రకటించారు. ఆదివారం కుర్రావానిపాలెం గ్రామంలో సర్పంచ్ దశరథరామయ్యను ఎమ్మెల్యే కలిశారు. సంఘీభావం తెలిపినవారిలో నాదెండ్ల ఆంజనేయులు(తెనాలి), నాదెండ్ల రంగరావు, చుండూరి హరిబాబు, చల్లగుండ్ల భసవయ్య, భవన్నారాయణ, సతీష్, చైతన్య ఉన్నారు. అనంతరం వజ్జా చంద్రకళ పెద్దకర్మకు హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట సింగమనేని వాసు, నాదెండ్ల కోటేశ్వరరావు, పిన్నక శ్రీనివాసరావు, చింతల సహదేవుడు, వజ్జా వాసు, తదితరులు ఉన్నారు.

బీసీల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పూనూరులో బీసీ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

యద్దనపూడి(మార్టూరు), ఏప్రిల్ 7: తెలుగుదేశం పార్టీ బీసీలకు అండగా ఉంటుందని, వారి సంక్షేమం కోసం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం యద్దనపూడి మండలం పూనూరులో జరిగిన జయహో బీసీ సదస్సుకు గుదే తారకరామారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే మహిళలను డ్వాక్రా గ్రూపుల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేసినట్టు చెప్పారు. బీసీ కుటుంబాలలోని మధ్యతరగతి ప్రజానీకం కోసం ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. తద్వారా చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగించేవారికి పనిముట్లను అందజేసినట్టు చెప్పారు. మొదటినుంచి తెలుగుదేశం పార్టీ బీసీ కుటుంబాల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేసిందన్నారు. మరలా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బీసీ కుటుంబాలు కృషి చేయాలన్నారు. అందుకే ప్రతిఒక్కరూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడానికి శాయశక్తులా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గుంజి వెంకట్రావు, నల్లపనేని రంగయ్య చౌదరి, శివరాత్రి శ్రీను, పోలూరి సింగయ్య, తుమ్మలపాటి రాఘవయ్య, పల్లపు అంకమ్మరావు, బోయపాటి సాంబశివరావు, రావిపాటి సీతయ్య, సాంబశివరావు, అంజిబాబు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ బీసీ కుటుంబాలు

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన వైసీపీ మద్దతుదారులైన బీసీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆదివారం ఉదయం క్యాంపు కార్యాలయంలో బీసీ కుటుంబాలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ ఏలూరి పార్టీ కండువాలు మెడలో వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో కుంచాల వాసు, కుంచాల శ్రీను, కుంచాల అనిల్, తన్నీరు అంకమ్మరావు, వెంకట్రావు, శ్రీను, తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

పర్చూరు: పర్చూరులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గెలుపు కోసం కూటమి శ్రేణులు నేతృత్వంలో ప్రచారం జోరుగా సాగుతోంది. ఆదివారం స్థానిక నెహ్రూ నగర్‌లో చేపట్టిన ప్రచారంలో ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అభివృద్ధిని ఆకాంక్షించే ఏలూరి సాంబశివరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకట కృష్ణారావు, కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, తలారి శివయ్య, జనసేన ప్రతినిధులు కారంపూడి సందీప్ తేజ, పంద్రా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పర్యటన

చినగంజాం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విస్తృతంగా పర్యటించారు. ముందుగా స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం పల్లెపాలెం పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సోపిరాలలో ఇటీవల మృతి చెందిన తుమ్మల పెంట లక్ష్మమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు.



శిక్షణలో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఝాన్సీలక్ష్మి

పోలింగ్‌పై అవగాహన అవసరం

కొండపి, ఏప్రిల్ 7 : పీవోలకు, ఏపీవోలకు పోలింగ్ విధానంపై పూర్తిగా అవగాహన అవసరమని నియోజకవర్గ స్పెషల్ అధికారి ఝాన్సీలక్ష్మి చెప్పారు. కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీవోలకు, ఏపీవోలకు ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. శిక్షణలో 322 మంది పాల్గొన్నారు. 18 మంది మండల స్థాయి శిక్షకులు పాల్గొని పీవోలకు, ఏపీవోలకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్వో ఎ.కుమార్, కొండపి, సింగరాయకొండ తహసీల్దార్లు కిరణ్‌కుమార్, ఎం.భవానీశంకర్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. పాప మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

మేదరమెట్ల , ఏప్రిల్ 7: జాతీయ రహదారిలో వెంకటాపురం- పి.గుడిపాడు మధ్య ఎమర్జెన్సీ రన్‌వేపై కారు డివైడర్ దిమ్మెను ఢీకొన్న సంఘటనలో పాప మృతి చెందింది. కారులోని మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఉదయం శ్రీకాకుళం నుంచి స్వగ్రామమైన రైల్వేకోడూరుకు కారులో శివసురేందర్ కుటుంబంతో వెళుతున్నారు. ఉగాది పండుగకు, తమ తండ్రి తృతీయ వర్ధంతిని నిర్వహించడానికి శ్రీకాకుళంలో డాక్టర్‌గా పని చేస్తున్న శివసురేందర్, సంఘారికలు పిల్లలు శివశేషన్, ద్వారక, అత్త నాగేశ్వరమ్మతో వెళుతున్నారు. ఈక్రమంలో వెంకటాపురం- పి.గుడిపాడు మధ్య కారు డివైడర్‌ను ఢీకొని ఎదురు రోడ్డులోకి వెళ్లి లారీని ఢీకొంది. ఈప్రమాదంలో ఆరు సంవత్సరాల పాప ద్వారక అక్కడికక్కడే మృతి చెందింది. బెలూన్లు తెరుచుకోవడంతో మిగిలినవారు గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని 108లో ఒంగోలు ఆస్పత్రికి తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



ఖాళీగా ఉన్న అద్దంకి ఆర్టీసీ బస్టాండ్

సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికులకు పాట్లు

అద్దంకి, ఏప్రిల్ 7: వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్ యాత్రకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్‌లను తీసుకోవటంతో ప్రయాణికులకు పాట్లు తప్పటం లేదు. శనివారం కావలి, ఆదివారం కొనకనమిట్లలో జరిగిన సీఎం బహిరంగ సభలకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను తీసుకున్నారు. ఈనేపథ్యంలో అద్దంకి డిపోలో ఉన్న 27 పల్లెవెలుగు బస్సులు వెళ్లాయి. దీంతో ఆయా రూట్లలో ప్రయాణికులు మరింత ఇబ్బంది పడ్డారు. మరలా పిడుగురాళ్ళ, గుంటూరులో జరిగే బహిరంగ సభలకు కూడా రెండు రోజుల పాటు ఆర్టీసీ బస్సులు వెళ్ళే అవకాశం ఉంది. ఆ రెండు రోజులలో కూడా బస్సులు రద్దయ్యే అవకాశం ఉంది. అద్దంకి డిపోలో ప్రయాణికులకు రెండు రోజుల నుంచి అద్దె బస్సులు, ఎక్స్‌ప్రెస్‌లే దిక్కు అయ్యాయి. తరచూ ఆర్టీసీ బస్‌లను రాజకీయ నేతల సమావేశాలకు పంపిస్తూ ఆయా రూట్లలో రద్దు చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఇంకొల్లులోనూ అదేతీరు..

ఇంకొల్లు : గత వారం రోజులుగా ఇంకొల్లు చుట్టుపక్కల గ్రామాల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంకొల్లు బస్టాండుకు వచ్చే బస్సుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. ఈ రూటులలో తిరిగి బస్సులను సభలకు పంపారు. ఎటువంటి సమాచారం తెలియని ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఇంకొల్లు బస్టాండులో గంటలతరబడి బస్సులు లేక ప్రయాణికులు పడిన బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఒకవైపు మండే ఎండలకు తోడు బస్సు సర్వీసులు లేకపోవడంతో చిన్నారులతో ప్రయాణం చేయాల్సివచ్చినవారు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆర్టీసి అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యధోరణి పట్ల ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల తనిఖీల్లో బంగారం, వెండి వస్తువులు స్వాధీనం

మార్టూరు, ఏప్రిల్ 7: మార్టూరులో మండల కాంప్లెక్స్ వద్ద జాతీయ రహదారిపై గుంటూరు వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న కొల్లిపర సుపేరావు అనే యువకుడిని ఆదివారం సాయంత్రం పోలీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో యువకుడి దగ్గర ఉన్న 92 గ్రాముల బంగారపు వస్తువులు, 4 కిలోలు వెండి వస్తువులను స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. వలపర్లకు చెందిన సదరు వ్యక్తి బంగారపు పనులు చేస్తుంటాడు. స్వాధీనం చేసుకున్న ఈ వస్తువులను జిల్లా గ్రీవెన్స్ కమిటీకి పంపిస్తున్నట్టు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కమిటీకి వస్తువులకు సంబంధించిన బిల్లులు, తదితర ఆధారాలను చూపించి పొందవచ్చునని ఆయన తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

కొండపి, ఏప్రిల్ 7 : మండలంలోని కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సేవా సంస్థ ఆధ్వర్యంలో కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని యూత్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు రాఘవేంద్రశర్మ, అధ్యక్షుడు డి.సుధాకర్, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, సభ్యులు నరేంద్ర, మధు, విష్ణువర్ధన్‌రెడ్డి, రవికుమార్, వంశీ, దాసు, దయానందం,వెంకారెడ్డి, వాకా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీతోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు

- ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి
- వైసీపీని వీడి జోరుగా చేరికలు



యాచవరంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 7: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపుతోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి సాధ్యమవుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద యాచవరం గ్రామంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మార్కాపురం ప్రత్యేక జిల్లాతోనే మార్కాపురం చుట్టుప్రక్కల ప్రాంతాల భూములు రేట్లు పెరిగి రైతులు బాగుపడతారని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టును రెండు సంవత్సరాల్లో పూర్తి చేసి పొలాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామని అన్నారు. ఈ విషయాన్ని గ్రామంలోని ప్రతి ఒక్కరికి వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం నాయకులు జవ్వాజి రామానుజన్ రెడ్డి, కాకర్ల శీను, తాంద్ర వెంకటేశ్వర్లు, పెద్ద యాచవరం గ్రామం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెం నుంచి 30 కుటుంబాల చేరిక

మార్కాపురం,: మార్కాపురం నియోజకవర్గంలో రోజురోజుకు టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మార్కాపురం మండలం రాజుపాలెం ఎస్సీ పాలెంకు చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. స్థానిక జవహర్ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. కందుల నారాయణరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాకం పిచ్చయ్య, చిన్నగాలయ్య, అచ్చయ్య, ఏసోబు, నాగరాజు, చిన్నయ్య తదితరులున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జవ్వాజి రామాంజిరెడ్డి, ఏఎంసీ మాజీచైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తాంద్ర వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కందుల రామిరెడ్డి, టీడీపీ నేతలు

తర్లుపాడు : బీసీల అభ్యున్నతి కోసం పాటుపడే పార్టీ టీడీపీ అని ఆ పార్టీ యువ నాయకుడు కందుల రోహిత్ రెడ్డి అన్నారు. మండలంలోని మంగళకుంటలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల వలన కలిగే ఉపయోగాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వం బీసీల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభించి వారికి అందవలసిన సంక్షేమ పథకాలను కూడా అందు కుండా చేస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు సంక్షేమ పథకా లను అమలు చేస్తామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డికి సైకిల్‌గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, మాజీ ఎంపీపీ పులి వేముల ఏసుదాసు, టీడీపీ నాయకులు నంబుల లక్ష్మయ్య, గుర్రపుసాల నరసింహులు, నంబుల తిరుపతయ్య పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అడ్డుకట్ట వేయాలి



నారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

మార్కాపురం, ఏప్రిల్ 7: రానున్న సార్వత్రిక ఎన్నికలలో జగన్ అరాచకపాలనకు ప్రజలు అడ్డుకట్ట వేయాలని టీడీపీ పోల్‌మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు 'ఇంటింటికి మన కందుల' ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల రామిరెడ్డి మాట్లాడుతూ అక్రమాలు, అన్యాయాలు, దోపిడీలలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏపీని బీహార్ స్థాయిని దాటించారన్నారు. ఏపీని అభివృద్ధి, సంక్షేమ రంగాలలో ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. పేదలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నా, యువత భవితకు భరోసా, మహిళలకు రక్షణ, బీసీల అభ్యున్నతి వంటి అంశాలు చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, బీజేపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.కృష్ణారావు, జనసేన నాయకులు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

టీడీపీ విజయం తథ్యం : పుష్పలీల



ప్రచారం నిర్వహిస్తున్న ముత్తుముల పుష్పలీల

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 7 : ఈ పర్యాయం రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ ఘన విజయా లను కైవసం చేసుకుం టుందని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి భార్య పుష్పలీల అన్నా రు. ప్రజలలో టీడీపీపై కనిపిస్తున్న అభిమానం చూస్తుంటే ఈ విషయం స్పష్టమౌతోందన్నారు. ఆదివారం ఆమె పట్టణంలోని 2వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ప్రతివారితో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే స్థానికంగా ఉండే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. నిరంతరం మీకు అందుబాటులో ఉంటామని చెబుతున్నారు. ఆమె వెంట వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్‌యాదవ్, జడ్పీటీసీ మాజీ సభ్యులు, బీజేపీ నాయకురాలు పిడతల సరస్వతి, టీడీపీ నాయకులు పాముల వెంకటరమణ, కుసుమాల మహానంది, గిరి, బోదనబోయిన అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ పాలనను కూలదోస్తాం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి



ప్రచార సభలో మిత్రపక్షాలతో కలిసి మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

కంభం, ఏప్రిల్ 7 : రాష్ట్రంలో దోపిడీ పాలన చేస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూలదోసి సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని గిద్దలూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా 6వ రోజు కంభం మండలంలోని తురిమెళ్ల, మదారుపల్లి, నర్సిరెడ్డిపల్లి, కంభం పట్టణం, కందులాపురం గ్రామాలలో మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రతి గ్రామంలో అవ్వతాతలను, మహిళలు, గ్రామపెద్దలను కలుసుకొని నాడు టీడీపీ హయాంలో తాను చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రస్తుతం జగన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అవినీతి అక్రమాలను, దోపిడీ, దౌర్జన్యాలను ఎండగడుతూ ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి సంక్షేమం అందిస్తామని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి నిత్యవసర సరుకుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఇసుక, సిమెంటు, ఇనుము ధరలను పెంచి రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. నియోజకవర్గాలలో కూడా వైసీపీ నేతల అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వారి ఆగడాలను అడ్డుకట్ట వేసే సమయం ఆసన్నమైందన్నారు. తాను స్థానికుడినని, నియోజకవర్గంలో అందుబాటులో ఎల్లవేళలా ఉంటానని హామీ ఇచ్చారు. మే 13న జరిగే ఎన్నికల్లో తనకు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డికి సైకిల్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా, టీడీపీ, జనసేన, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం : ముత్తుముల



ప్రజలకు అభివాదం చేస్తున్న అశోక్‌రెడ్డి

కంభం, ఏప్రిల్ 7 : సంక్షేమ పథకాలకు జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన నిధులలో అధిక భాగం కేంద్ర ప్రభుత్వమే ఇచ్చిందని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామంలో మిత్రపక్షాలైన జనసేన నాయకులు బెల్లంకొండ సాయిబాబా, బీజేపీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 89 లక్షల రేషన్ కార్డులకు సరుకులు కేంద్రం ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది కేవలం 63 లక్షల కార్డులకు మాత్రమేనన్నారు. కరోనా సమయంలో పేదలకు ఇవ్వాలని కేంద్రం పంపిన 5.65 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్‌బియ్యం పేదలకు ఇవ్వకుండా జగన్‌రెడ్డి బియ్యం మాఫియా తినేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా 8 రకాల సరుకులు సరఫరా చేయగా జగన్‌రెడ్డి బియ్యానికే పరిమితం చేసి పేదలను మోసం చేశారన్నారు. పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లు రద్దు చేశారన్నారు. రైతుభరోసాలో రాష్ట్ర వాటా రూ.7500 ఇస్తుండగా, కేంద్రం రూ.6 వేలు ఇస్తోందన్నారు. అయితే జగన్‌మాత్రం తానే రూ.13,500 ఇస్తున్నట్లు చెప్పుకుంటున్నాడన్నారు.

టీడీపీ హయాంలోనే అధిక సంక్షేమం

సంక్షేమ పథకాలకు రాష్ట్ర బడ్జెట్‌లో చంద్రబాబు 19శాతం ఖర్చు చేయగా జగన్‌రెడ్డి 15 శాతమే ఖర్చు చేశారన్నారు. ఫీజ్ రీయంబర్స్‌మెంట్ చంద్రబాబు 16లక్షల మందికి ఇవ్వగా జగన్ 9లక్షలకు కుదించారన్నారు. 0 వడ్డీ కింద డ్వాక్రా మహిళలకు చంద్రబాబు రూ.5లక్షల వరకు రుణం అందిస్తే జగన్ రూ.3లక్షలకు కుదించారన్నారు. రూ.3లక్షల వరకు వడ్డీ రాయితీ కేంద్రమే భరిస్తోందన్నారు. అన్నా క్యాంటీన్, రైతు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, చంద్రన్నబీమా, పండుగ కానుకలు, విదేశీ విద్య లాంటివి ఎన్నో 100కు పైగా జగన్ ప్రభుత్వం రద్దు చేశారన్నారు. నవరత్నాల పేరుతో నవమోసాలు చేసిన పేదల ద్రోహి జగన్ అన్నారు.

వైసీపీని వీడుతున్న కేడర్

గిద్దలూరు టౌన్ : వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో టీడీపీ కేడర్ జోరు మీద ఉండగా, వైసీపీ కేడర్‌మాత్రం బేజారవుతోంది. ప్రతి గ్రామం నుంచి వందల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరుతుండడం విశేషం. ప్రధానంగా స్థానికంగా ఉండే అశోక్‌రెడ్డికే తమ మద్దతు అంటూ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఆదివారం మండలంలోని అంబవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శిరిపిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మాజీసర్పంచ్ ఎందూరి ఏసురత్నం, విద్యాకమిటీ చైర్మన్ షరీఫ్‌భాషా, వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిందని ఆయన తెలిపారు. ప్రజాసంక్షేమం కేవలం టీడీపీతోనే సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో పేరం శిరిపిరెడ్డి, పేరం నారాయణరెడ్డి, శిరిపిరెడ్డి నరసింహారెడ్డి, కంచర్ల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 7: రైలు కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మార్కాపురం-తర్లుపాడు రైల్వేస్టేషన్‌ల మధ్య శనివారం రాత్రి చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి రైల్వే ట్రాక్‌పై పడి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ట్రైన్ నెంబర్ 17330లో విజయవాడ నుంచి హుబ్లీ వెళుతున్న ట్రైన్‌లో ప్రయాణి స్తున్న సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ట్రైన్ నుంచి జారిపడి చనిపోయినట్లు తెలిపారు. మృతునికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసి ఉంటే మార్కాపురం రైల్వే పోలీసులకు అందించాలని కోరారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ రెడ్డి తెలిపారు.

391 మద్యం సీసాలు పట్టివేత



మద్యం సీసాలను సీజ్ చేసిన పోలీసులు

బేస్తవారపేట, ఏప్రిల్ 7: మండలంలోని పీవీ.పురం గ్రామంలో అక్రమంగా మద్యం నిల్వ చేసినట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై బి.నరసింహారావు ఆదేశాల మేరకు పోలీసులు సోదాలు నిర్వహించారు. ఒక ఇంటిలో అక్రమంగా 391 మద్యం సీసాలు నిల్వచేసి అమ్ముతున్నట్లు నిర్ధారణ కావడంతో మద్యం సీసాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్లపైనే ఇసుక, కంకర



రోడ్డుకు అడ్డంగా పోసిన కంకర, ఇసుక

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 7: మార్కాపురం పట్టణంలోని వివిధ వీధులలో తరచూ రోడ్లపైనే ఇసుక, కంకరా గృహ నిర్మాణ సామగ్రి ఉంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. స్థానిక రజక వీధిలో ఒక వ్యక్తి ఆదివారం ఇసుక, కంకర, మిషన్ పెట్టి నడవడానికి దారి లేకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు. ఇదే వ్యక్తి ఇప్పటికీ ఎన్నోసార్లు తన గృహ నిర్మాణం కోసం రోడ్లపైనే కంకర, ఇసుక వేసి వాహనదారులను, పాదాచారులను ఇబ్బందులు పెడుతున్నాడు. ఇక్కడే కాకుండా మార్కాపురం పట్టణంలోని పలు వీధులలో ఇదే తంతు దర్జాగా సాగుతోంది. పట్టించుకోవాల్సిన పోలీసులు, మున్సిపల్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఇప్పటికైనా అధికారులు ఇటువంటి ప్రజా వ్యతిరేక చర్యలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిద్ధం సభకు బస్సులు.. ప్రయాణికుల అవస్థలు



బస్సులు లేని ఆర్టీసీ బస్టాండ్

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 7: కొనకమిట్ల అడ్డరోడ్డు వద్ద సీఎం జగన్ సిద్ధం సభ మార్కాపురం పట్టణంలోని ప్రయాణికులకు శాపంగా మారింది. జన సమీకరణ కోసం మార్కాపురం డిపో నుంచి 98 బస్సులలో 50 బస్సులను కేటాయించారు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు తిలకించేందుకు మార్కాపురం రైల్వే స్టేషన్ నుంచి కర్నాటక రాష్ట్రం భక్తులు రైళ్లల్లో వచ్చి మార్కాపురం నుంచి శ్రీశైలం వెళ్తారు. కానీ బస్సులు తక్కువగా ఉండటంతో అవస్థలకు గురయ్యారు. దీనికి తోడు ఒంగోలు వెళ్లేందుకు నాగిరెడ్డిపల్లె మీదుగా వెలిగొండ ఆలయం పై నుంచి నంద్యాల-ఒంగోలు రహదారికి వాహనాలను మరల్చటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మార్కాపురం బస్టాండ్‌లో బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయించటంతో వారు ఇదే అదునుగా అదనపు చార్జీలు వసూలు చేశారు.

'సిద్ధం'కాని ముటుకుల

- పుల్లలచెరువులో బస్సు ఎక్కని వైసీపీ కేడర్



రోడ్డువెంబడి నిలిచిన బస్సు

పుల్లలచెరువు, ఏప్రిల్ 7: వైసీపీ ఆధ్వర్యంలో పొదిలిలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు ముటుకుల గ్రామస్థులు సిద్ధం కాలేదు. గ్రామంలో వర్గపోరుతో సిద్ధం సభకు బస్సు కదలలేదు. ఆదివారం పుల్లలచెరువు మండలం ముటుకులలో వైసీపీలో వర్గపోరుతో బస్సును ప్రజలు ఎక్కలేదు. మండల కేంద్రమైన పుల్లలచెరువులో మరో బస్సుకు జనం ఎక్కకపోవడంతో అక్కడే నిలిచిపోయింది.

బస్సులు లేక ఇక్కట్లు

గిద్దలూరు, ఏప్రిల్ 7 : సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లడంతో సాధారణ ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. మార్కాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బస్సుయాత్ర వైసీపీ నాయకులు, కార్యకర్తలను తరలించేందుకు ఆర్టీసి బస్సులను అద్దెకు తీసుకున్నారు. గిద్దలూరు ఆర్టీసి డిపో పరిధిలో 72 బస్సులు ఉండగా 42 బస్సులను వైసీపీ శ్రేణులు అద్దెకు తీసుకోవడంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. గ్రామీణ ప్రాంతాలకు కేవలం రూటుకు ఒక బస్సును మాత్రమే ఆర్టీసి అధికారులు నడుపడంతో ప్రయాణికుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు.

మార్కాపురంలో మారుతున్న సమీకరణలు

- టీడీపీలో చేరుతున్న కీలక నేతలు
- కందులకు పెరుగుతున్న ఆదరణ

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

మార్కాపురం నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. అనాధిగా కాంగ్రెస్, ఆ తర్వాత వైసీపీకి పట్టుగొమ్మలుగా ఉన్న నేతలు, క్రియాశీలక రాజకీయ కార్యకర్తలు ప్రస్తుతం టీడీపీలో చేరిపోతున్నారు. దీంతో కీలకమైన గ్రామాల్లో టీడీపీ బలం పుంజుకుంటోంది. దీంతో ఆ పార్టీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డికి ఆదరణ పెరిగింది. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో ప్రజా సంబంధాలు ఉన్న జనసేన, అలాగే బీజేపీ నేతలతో టీడీపీ అభ్యర్థి నారాయణ రెడ్డి సమష్టిగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. సరికొత్తగా టీడీపీలో చేరుతున్న వారితో మరింత బలాన్ని చేకూరుతోంది.

నియోజకవర్గంలో ప్రధానమైన మార్కాపురం మున్సిపాలిటీలో టీడీపీకి ఆధిక్యత లభిస్తుంది. రూరల్ మండలంలోని కొన్ని గ్రామాల్లోనూ, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో ఆ పార్టీకి కొన్ని సమస్యలున్నాయి. తాజాగా మున్సిపాలిటీలో టీడీపీకి ఆదరణ లేని ప్రాంతాలతోపాటు నియోజకవర్గంలోని పలు కీలక గ్రామాల్లో నేతలు, ప్రజలు ఇతర పార్టీల నుంచి స్వచ్ఛందంగా వచ్చి టీడీపీలో చేరుతున్నారు. గెలుపోటములకు అతీతంగా టీడీపీ అభ్యర్థి నారాయణరెడ్డి ప్రజా సంబంధాలను కొనసాగిస్తూ పాదయాత్రలు, ఇతరత్రా రూపాల్లో పోరాటాలు సాగించడం కూడా ఆయనకు ఈ ఎన్నికల్లో కలిసి వస్తోంది. ఉదాహరణకు వైసీపీకి పట్టు ఉన్న మార్కాపురం పట్టణంలోని 8, 9 వార్డుల్లో టీడీపీలోకి పలువురు చేరడం విశేషం. ఆరంభంలో కాంగ్రెస్, ఆ తర్వాత వైసీపీకి ఇవి బలమైన ప్రాంతాలు. మాజీ మున్సిపల్ చైర్మన్ దొడ్డా చలమారెడ్డి దాయాదులైన బ్రహ్మానందరెడ్డి, గణేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. మక్కామసీదు ప్రాంతానికి చెందిన వైసీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి మయూరి కాశిం టీడీపీలో చేరారు. ఆయన సతీమణి వైసీపీ తరపున ప్రస్తుతం మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులుగా ఉన్నారు. వివిధరగాల్లో ప్రముఖులు, సమీప బంధువులు కూడా టీడీపీకి మద్దతు ప్రకటించారు.



బీజేపీ, జనసేన నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న నారాయణరెడ్డి(ఫైల్)

జవహర్‌నగర్ కాలనీకి చెందిన రవికుమార్‌రెడ్డి, విజయాటాకీస్ ప్రాంతానికి చెందిన దొండపాటి వెంకటరెడ్డి, తూర్పువీధికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, గుంటక అచ్చిరెడ్డి, గాయం నారాయణరెడ్డి తదితరులు కూడా కందుల సమక్షంలో టీడీపీలో చేరారు. బలహీన వర్గాలకు చెందిన 9వవార్డులోని నాగారపు వెంకటేశ్వర్లు, అలాగే భగత్‌సింగ్ కాలనీకి చెందిన హరిబాబు యాదవ్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణరెడ్డి సొంత గూటికి రాగా, బేల్దారి సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి కందులకు మద్దతుగా టీడీపీలో చేరారు. పట్టణంలోని మక్కామసీదు ప్రాంతానికి చెందిన నూరుబాషా సంఘం రాష్ట్ర నేతలు షేక్ ఆదాంసాహెబ్‌తో పాటు ఆ సామాజిక వర్గానికి చెందిన ముఖ్యులు టీడీపీలో చేరడం ఆ పార్టీకి కలిసొచ్చిన అంశంగా చెప్పవచ్చు. ఇక రూరల్ మండలంలోని వేముల కోట గ్రామంలో కొందరు కీలక నేతలు టీడీపీలో చేరారు. గోగులదిన్నె గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది కంది నారాయణరెడ్డి, కొందరు వార్డు సభ్యులతో కలిసి టీడీపీలో చేరడం వైసీపీలో కలవరం రేపింది. ఆయన గతంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండేవారు. భూపతిపల్లి, పెద్దనాగులవరం, సుందరయ్యకాలనీ, తదితర ప్రాంతాల్లో వైసీపీకి చెందిన పలు కుటుంబాల వారు టీడీపీలో చేరడం కూడా ఆపార్టీ కేడర్‌లో జోష్‌ను పెంచింది. తర్లుపాడు మండలంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాషాపతిరెడ్డితోపాటు మాజీ జడ్పీటీసీ, సొసైటీ మాజీ అధ్యక్షుల ఆధ్వర్యంలో తుమ్మలచెరువులో ముస్లింమైనార్టీలు, బుడ్డపల్లెలో వడ్డెర సామాజిక వర్గం వారు, నాయుడుపల్లెలో రెడ్డి సామాజిక వర్గంవారు టీడీపీలో చేరారు. వీరి చేరిక బాగా కలిసొచ్చినట్లుగా రాజకీయ విశ్లేషకుల అంచనా. పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో కూడా చేరికలు ప్రారంభమయ్యాయి. కొనకనమిట్ల మండలంలో గార్లదిన్నె, రేగుంపల్లి తదితర గ్రామాల్లోనూ పొదిలి మండలంలో ఏలూరుతోపాటు మరికొన్ని గ్రామాల్లో వైసీపీకి చెందిన టీడీపీలో చేరారు. ఇలా నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో టీడీపీలో పెరుగుతున్న చేరికలతో ఆ పార్టీలో జోష్ పెరగడమేగాక నియోజకవర్గంలోని రాజకీయ సమీకరణలు టీడీపీకి అనుకూలంగా మార్పులు జరుగుతున్న విషయం తేటతెల్లమవుతోంది.

అవ్వాతాత అదరించండి.. అభివృద్ధి చేస్తాం

ఎరిక్షన్‌బాబు తనయ వినూత్న ప్రచారం

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 7:అవ్వా...తాత టీడీపీని ఆదరించండి. అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రిగా వస్తున్నారు. సంక్షేమ పథకాలు మన ముంగిటికే వస్తాయని గూడూరి ఎరిక్షన్‌బాబు తనయ చల్సియా ఆసక్తికరంగా ప్రచారం చేస్తున్నారు. దోర్నాలలో ఆదివారం టీడీపీ సీనియర్ నాయకులు మన్నె రవీంద్ర, గూడూరి ఎరిక్షన్‌బాబు తనయుడు అజిత్, కమార్తె చల్సియా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా చల్సియా తన తండ్రి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న ప్రచారం అందరినీ ఆకట్టుకుంటోంది. అందరినీ కలుసుకొని తన తండ్రి ఎరిక్షన్‌బాబును ఎమ్మెల్యేగాను, మాంగుట శ్రీనివాసులురెడ్డి ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. సైకిలు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఆమె పలకరింపు, అభ్యర్థన తీరును అభినం దిస్తూ పలువురు మహిళలు ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్నారు. హారతులిస్తూ స్వాగతం పలికారు. 'మీ నాన్న గెలుస్తాడులే బిడ్డా' అంటూ ఆశీర్వదిస్తున్నారు. దీంతో ఆమె మరింత వేగాన్ని పెంచింది. అలుపు లేకుండా ఎండను సైతం లెక్కచేయకుండా ఇంటింటికి వెళ్లి మరి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. పలువురు వైసీపీవారు సైతం చల్సియాకు స్వాగతం పలుకుతూ ఆమెను ప్రోత్సహిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండ ల అధ్యక్షులు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ బాష, షేక్ ఇస్మాయిల్, కే.శ్రీనివాసులు, ఎలకపాటి చంచయ్య, షేక్ మంజూర్ భాష, కేసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న చల్సియా, మన్నె రవీంద్ర



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

ఇఫ్తార్ విందుకు ఎరిక్షన్ బాబు

పుల్లలచెరువు, ఏప్రిల్ 7: పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ఎర్ర గొండపాలెం పట్టణం లో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైపాలెం టీడీపీ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు, డాక్టరు మన్నె రవీంద్రలు పాల్గొన్నారు. ఆదివారం మాచర్ల రోడ్డులోని షాదిఖానాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరైయ్యారు.ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ మ్యాక్స్ ఇస్మాయిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







సీఎం జగన్ సభ మధ్యలో ఉండగానే వెనుతిరుగుతున్న ప్రజలు, సభకు వెళ్లకుండానే ఆర్టీసీ బస్సు వద్దే ఎదురుచూస్తున్న కార్యకర్తలు, అరకొరగా ఉన్న ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

జనం లేక సీఎం సభ వెలవెల

కొనకనమిట్ల, పొదిలి ఏప్రిల్ 7 : పొదిలి సమీపంలోని కొనకనమిట్ల క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభ జనంలేక వెలవెలబోయింది. ఏడు నియోజకవర్గాల నుండి ఎమ్మెల్యే అభ్యర్థులు భారీగా జనసమూహాన్ని తరలించేందుకు అహర్నిశలు శ్రమించి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటుఉ వాహనాలలో జనాన్ని తరలించినప్పటికి అంతంత మాత్రంగా జనం వచ్చారు. దీంతో సిఎం నాయకులపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. బస్సులలో జనాన్ని తరలించినా సభవద్దకు జనరాక బస్సులవద్దే ఉండిపోయారు. సభ ప్రారంభం కాగానే రోజుమాదిరిగానే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుపై దుషణలకే జగన్ ప్రసంగం పరిమితం కావడంతో సభకు వచ్చిన ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు. రాబోయే ఎన్నికలలో కొత్తహామీలు ఇస్తారేమోనని ఆశగా చూసినప్పటికి ప్రతి పక్షం, మీడియాపై దుషణలు తప్ప ఏముంది అంటూ జనం నిట్టూర్చారు.

జగన్ రోడ్ షో అట్టర్ ఫ్లాప్..!

» కనిగిరిలో కనిపించని జోష్
» ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు కరెంట్ కట్
» ఆసుపత్రికి సరఫరా లేక అల్లాడిన రోగులు
» అవస్థలు పడిన ప్రజలు, వ్యాపారులు

కనిగిరి, ఏప్రిల్ 7 : కనిగిరిలో జగన్ రోడ్డు షో అట్టర్ ఫ్లాప్ అయింది. రోడ్ల వెంట జనం లేక వెలవెల బోయింది. జగన్ బస్సు యాత్ర ఆదివారం ప్రకాశం జిల్లాలోని కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి, కనిగిరి మండలాల్లోకి ప్రవేశించారు. ఈ షో సక్సస్ కోసం వైసీపీ నేతలు, అధికారులు పడిన తాపత్రయం ఏ మాత్రం ఫలించలేదు. ఉదయం 11గంటలకే కనిగిరి పట్టణ సమీపంలోని చింతలపాలెం వద్దకు జగన్ చేరుకుంటారని ప్రచారం చేసినా జనం పెద్దగా రాలేదు. దీంతో వైసీపీ అభ్యర్థి తలలు పట్టుకుని డబ్బులు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా ప్రజాస్పందన కరువైందని ప్రజలే చెప్తున్నారు. జిల్లా పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అప్పటికప్పుడు జెండాలను రెడీ చేశారు. పామూరు బస్టాండ్ సెంటరుకు 12 గంటలకు రావాల్సిన జగన్ మధ్యాహ్నం 2 గంటలకు వచ్చారు. అప్పటికి వచ్చిన జనం ఎండలను తట్టుకోలేక వెళ్లిపోయారు. జగన్ బస్సు కనిగిరి బస్టాండు సెంటరుకు చేరుకున్న సమయంలో కూడా పెద్దగా జనం కనిపించలేదు.

10 నిమిషాల జగన్ షో

జగన్ రోడ్డు షో కనిగిరిలో ఫెయిల్ అయింది. ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టుపని 1000 మంది కన్పించకపోవడంతో నేతల వద్ద జగన్ అసహనం కనపరిచారని తెలిసింది. మధ్యాహ్నం 12గంటలకు రావాల్సిన బస్సు యాత్ర 2గంటలకు చేరుకుంది. వచ్చిన కొద్ది సెకన్లకు జగన్ బస్సుపైకి ఎక్కి ప్రజలకు అభివాదం, నమస్కారం చేశారు. ఆ సమయంలో చుట్టూ చూసిన జగన్‌కు జనం లేరన్న సంగతి తెలుసుకొని 10 నిమిషాలకు బస్సులోకి వెళ్లిపోయారు. బస్సు అక్కడ ఉండగానే జనం వెనుదిరిగి వెళ్లడం జగన్ చూశారు. కనీసం పూలదండలు కూడా జగన్ వేయించుకోకుండా వెళ్లిపోయారు. ఆయనవెంట ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలినేని, మాజీ ఎమ్మెల్యేలు కదిరి బాబూరావు, బుర్రా, అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్, మున్సిపల్ చైర్మన్ గఫార్ ఉన్నారు.



జగన్ వస్తున్న సమయంలో నిర్మానుష్యంగా ఉన్న కనిగిరి - కందుకూరు రోడ్డు



కరెంట్ కట్ చేయడంతో బంక్‌లో ఏర్పాటు చేసిన జనరేటర్

బస్సులను ఏర్పాటు చేసినా జనం పల్చనే..!

పీసీపల్లి : ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన బస్సుయాత్రకు జన స్పందన అంతంతమాత్రంగానే కనిపించింది. ఆదివారం పొన్నలూరు మండలం జువ్విగుంట విడిది క్యాంపు నుంచి బయలుదేరిన జగన్ అగ్రహారం మీదుగా పీసీపల్లి మండలం పాలేటిగంగ వద్దకు ఉదయం 11.15గంటలకు చేరుకున్నారు. అక్కడ జనం పల్చగా కనిపించారు. పోలీసులు, రోప్ పార్టీ సిబ్బంది ఆయన భద్రతా సిబ్బంది, వారి వాహనాలు, ఇతర సిబ్బందే ఎక్కువగా కనిపించారు. జగన్ వచ్చే సమయానికి జనం లేకపోవడంతో పీసీపల్లి మండలం నుంచి సిద్ధం సభకు బయలుదేరిన బస్సులను రూట్ మళ్లించి గంగ వద్దకు తీసుకువచ్చారు. బస్సుల్లో వచ్చిన జనం కూడా సగం మంది బస్సుల్లోనే ఉండగా, సగం మంది రోడ్డుపైకి వచ్చారు. అక్కడ నుంచి బయలుదేరిన జగన్ బస్సు పెదఅలవలపాడు, రామాపురం, బండపాలెం మీదుగా కనిగిరి మండలం ఆజీస్‌పురంలోకి ప్రవేశించింది. అక్కడి నుంచి కనిగిరి వెళ్లింది. పెదఅలవలపాడు, రామాపురంలో మహిళలు నిల్చొని ఉన్న చోట బస్సు దిగిన జగన్ వారి తలలపై చేయి ఉంచి నవ్వుతూ తిరిగి బస్సులోకి వెళ్లిపోయారు. రామాపురం గ్రామానికి చెందిన కుదుముల జాన్ అనే వృద్ధుడు తనకు పక్షవాతం వచ్చిందని మందులకు నెలకు రూ.10వేలు ఖర్చు అవుతుందని, ఆసుపత్రిలో మందులు ఇప్పించాలని జగన్‌ను కోరారు. అదే గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య అనే వృద్ధుడు ఇంటిస్థలం కోసం రెండుసార్లు దరఖాస్తు చేసినా స్థానిక నాయకుల మాటలు విని అధికారులు ఇంటిస్థలం కేటాయించకుండా తన దరఖాస్తును తిరస్కరించారని జగన్‌కు ఫిర్యాదు చేశారు. బస్సుయాత్రలో కనిగిరి మాజీ ఎమ్మెల్యేలు బుర్రా, కదిరి, అభ్యర్థి దద్దాల, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి, మాజీ మంత్రి బాలినేని ఉన్నారు.

జగన్ వస్తున్నారని విద్యుత్ కట్

ఎండలు.. కరెంట్ కోతతో అల్లాడిన జనం

ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్ర ఆదివారం మండలంలోని పెదఅలవలపాడు నుంచి రామాపురం మీదుగా కనిగిరి వెళ్లింది. అయితే సీఎం బస్సుయాత్ర సందర్భంగా విద్యుత్ శాఖ సిబ్బంది వ్యవహరించిన తీరు ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. పెదఅలవలపాడు పెట్రోలు బంక్ నుంచి ఊరి చివర పాఠశాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలపై ఉన్న సర్వీస్ వైర్లను సిబ్బంది తొలగించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామంలో రోడ్డు కిరువైపులా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అసలే ఎండలతో అల్లాడుతున్న ప్రజలు కరెంట్ లేకపోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. మరోవైపు పెట్రోలు బంకుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెట్రోల్, డీజిల్ కోసం వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఇంతలో బంకు యజమాని అప్పటికప్పుడు జనరేటర్‌ను ఏర్పాటుచేసి వాహనాలకు ఆయిల్ నింపారు. జగన్ బస్సు అలవలపాడు దాటి వెళ్లిపోయిన తరువాత విద్యుత్ సిబ్బంది విద్యుత్‌ను పునరుద్ధరించారు.



గార్లపేట రోడ్డులో సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్సు

ప్రజాధనం దుర్వినియోగం

» జగన్ షో కోసం ఆర్టీసీ బస్సులు
» మళ్లీ వైసీపీకి ఓటేస్తే రాష్ట్రం అధోగతే
» టీడీపీ నేత వెంకటేశ్వర్లు యాదవ్

కనిగిరి, ఏప్రిల్ 7 : ప్రచారాలు, సభలు పేరుతో జగన్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని టీడీపీ నేత చావలి వెంకటేశ్వర్లుయాదవ్ ఆరోపించారు. జిల్లాలోని చినారికట్ల వద్ద జగన్ సిద్ధం సభకు తరలించేందుకు కనిగిరిలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటుపై ఆయన మండిపడ్డారు. కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డు వద్ద సభకు జనాల్ని తరలించేందుకు తిరుపతి ప్రాంతంలోని రాజంపేట బస్సును ఏర్పాటు చేశారు. జగన్ తన సభల కోసమని రాష్ట్ర ఖజానాను వినియోగించుకుని రాష్ట్రాన్ని దివాళా తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఇలాంటి వాటిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును గెలిపిస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. లేకుంటే ఈ రాష్ట్రాన్ని కాపాడడం ఎవరి తరం కాదన్నారు. సిద్ధం సభలకు వెళ్లేందుకు జనాలు పెద్దగా ఆశక్తి చూపలేదు.

జగన్ బస్సు యాత్రలో వలంటీర్

పీసీపల్లి, ఏప్రిల్ 7 : ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వలంటీర్లు ఎన్నికల విధుల్లో కానీ, ప్రచారాల్లో కానీ, పార్టీ మీటింగుల్లో కానీ కనిపించకూడదు. కానీ వారు ఖాతరు చేయడం లేదు. జగన్ చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం పెదఅలవలపాడు గంగగుడి వద్దకు వచ్చేముందు పెదఅలవలపాడు సచివాలయానికి చెందిన సురేష్ అనే వలంటీర్ వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ, ఆపార్టీ నాయకులతో కలిసి ఉండడం కనిపించింది. అయితే దివ్యాంగుడైన తనకు ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని ముఖ్యమంత్రికి అర్జీ ఇస్తానని, ఆ అవకాశం తనకు కల్పించాలని దద్దాలను కోరినట్లు ఆయన తెలిపారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

బాధిత కుటుంబాలకు టీడీపీ ఆర్థిక సహాయం

దొనకొండ, ఏప్రిల్ 7 : ఈతకు వెళ్లి నీటికుంటలో మునిగి మృతిచెందిన యువకుల మృతదేహాలను దర్శి నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి పమిడి రమేష్, దర్శి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మీ భర్త డాక్టర్ లలిత్‌సాగర్ సందర్శించారు. ఆదివారం ఇండ్లచెరువు గ్రామానికి వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంఘటన జరిగిన తీరు, కుటుంబ స్థితిగతులను స్థానిక నాయకులతో తెలుసుకున్నారు. అధైర్యపడొద్దు అండగా ఉంటామని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. మృతి చెందిన మన్నెం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు పమిడి రమేష్ రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, నాయకులు దుగ్గెంపూడి కాశయ్య, వీరపనేని వెంకన్నచౌదరి, వడ్లమూడి చెన్నయ్య, పత్తి వెంకటేశ్వర్లు, దుగ్గెంపూడి చెంచయ్య, మన్నెం గాలయ్య, పణిదపు వీరాంజనేయులు, సింగమనేని హనుమంతు, విప్పర్ల లక్ష్మీరావు, పోతిపోగు చెన్నయ్య మరికొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం

దొనకొండ పంచాయతీ పరిధిలోని వీరవెంకటాపురం ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త రాయని చెన్నయ్య తల్లి షారమ్మ(67) ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ మండలాధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు మట్టిఖర్చులకు చెన్నయ్యకు రూ.10 వేలు అందించారు. టీడీపీ దర్శి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి పమిడి రమేష్, టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మీ భర్త డాక్టర్ లలిత్‌సాగర్, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు చెన్నయ్య ఇంటికి వెళ్లి షారమ్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



తాళ్లూరు, ఏప్రిల్ 7 : తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గుంటి గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మకు పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండలాల నుంచి భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో సందడిగా మారింది. పలువురు వాహన, కుంకుమ పూజలు చేశారు. బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎంభాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పీ కార్తీక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం పాల్గొన్నారు.

ఎన్నికలకు చిత్తశుద్ధితో పనిచేయండి

దర్శి, ఏప్రిల్ 7 : ఎన్నికలకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు అధికారులకు సూచించారు. ఈఆర్‌వో కార్యాలయంలో ఆదివారం ప్రిసైడింగ్ అధికారులు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. నిర్ణీత సమయంలో పోలింగ్ ప్రారంభించి అదేవిధంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంగించిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. రాజకీయ పార్టీలు సభలు సమావేశాలు ఏర్పాటుకు ముందు అన్నీ అనుమతులు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీలు బ్యానర్లు ఏర్పాటు చేసినా, బాణసంచా కాల్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పామూరు, ఏప్రిల్ 7 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం పట్టణంలోని నెల్లూరు రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పామూరు నుంచి చెన్నై వెళుతుండగా పామూరు పట్టణంలో నెల్లూరు రోడ్డు పెట్రోల్ బంకు వద్ద ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వస్తూ బస్సును అధిగమించే క్రమంలో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరు, ఒంగోలుకు తరలించారు. వినుకొండ సుజయ్, దినేష్ బైక్‌పై వస్తూ రోడ్డు మార్జిన్ వద్ద అదుపుతప్పి కిందపడిపోయారు. సుజయ్ తలకు తీవ్ర గాయం కాగా, దినేష్‌కు నడుము భాగంవద్ద గాయమైంది. ఒక్కసారిగా బస్సు వద్ద ప్రమాదం జరగడంతో డ్రైవర్ ఆందోళన చెందారు. వెంటనే ఆయన వారిని ఆసుపత్రికి తరలించి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విషయం తెలిపారు.

చప్పగా సాగిన బస్సుయాత్ర

అభివాదానికే పరిమితమైన జగన్

దర్శి, ఏప్రిల్ 7 : సీఎం జగన్ చేపట్టిన బస్సు యాత్ర చప్పగా సాగింది. ఆశించిన మేరకు ప్రజలు హాజరుకాలేదు. బస్సు గడియార స్తంభం జంక్షన్‌కు చేరే లోపు ఆప్రాంతం కొంత బాగం ఖాళీగా ఉంది. రాత్రి 8.26 నిమిషాలకు మండలంలోని రాజంపల్లికి చేరుకుంది. అక్కడ ప్రజలకు అభివాదం చేసి 8.45కు కొత్తరెడ్డిపాలెం చేరుకుని జగన్ బస్సు పైనుంచే అభివాదం చేశారు. అనంతరం కాటేరు వాగుకు 9 గంటలకు, గడియార స్తంభానికి 9.40కు చేరుకున్నారు. అక్కడ ప్రజలకు అభివాదంచేసి వెంటనే 9.45కు బయలు దేరి క్యాంపు వద్దకు వెళ్లారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి, దర్శి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ బూచేపల్లి, బాలినేని ఉన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ

కూటమి అభ్యర్థి లక్ష్మికి హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

దర్శి, ఏప్రిల్ 7 : టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రజలు ఆమెకు హారతులిచ్చి పూలవర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పడుతున్నారు. ఆదివారం పట్టణంలోని 12, 16 వార్డుల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనేక చోట్ల వృద్ధులు లక్ష్మిని ఆప్యాయంగా పలుకరిస్తూ విజయం నీదేనని ఆశీర్వదిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ ప్రజలు చూపుతున్న ఆదరణ మరువలేమన్నారు. తనను ఆడపడుచులా అభిమానిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గెలిచాక ఇక్కడే మీకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని మాటిచ్చారు. దివంగత మాజీ మంత్రి హనుమంతరావు మనవరాలిగా ప్రజలను సమాన దృష్టితో చూసి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ తలారి కోటయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, పారా గాలయ్య, తెలుగు మహిళ నాయకులు ఎం శోభా రాణి, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పసుపులేటి చిరంజీవి, ఉల్లి బ్రహ్మయ్య, పాపారావు పాల్గొన్నారు.



అభ్యర్థి లక్ష్మిని ఆప్యాయంగా పలుకరిస్తున్న వృద్ధురాలు.. పార్టీలో చేరిన మంగినపూడి వాసులతో లక్ష్మి

టీడీపీలోకి భారీగా చేరికలు

టీడీపీలోకి భారీగా వైసీపీ నుంచి చేరికలు కొనసాగుతున్నాయి. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో వైసీపీ పాలనతో విసుగు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్య లో వచ్చి చేరుతున్నారు. తాజాగా దొనకొండ మండలం మంగినపూడి పంచాయతీకి చెందిన వెంకటరెడ్డి, దేవదానం ఆధ్వర్యంలో 30 కుటుంబాల ఎస్సీ కాలనీ వాసులు టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి లక్ష్మి కండవాలు కప్పి ఆహ్వానించారు. చంద్రబాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్న నమ్మకంతో వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారని లక్ష్మి అన్నారు. టీడీపీ కూటమి విజయానికి అందరూ ఒక్కటై కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు నాయకులు విప్పర్ల లక్ష్మీరావు, రమణయ్య పాల్గొన్నారు. అలాగే దొనకొండ మండలం గంగ దేవిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన చిన్నా, పులికూరి భాస్కర్, నాసరయ్య, గుడిపాటి మోధేష్ మరో 15 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీలోకి 20 కుటుంబాలు

కురిచేడు : కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ ముష్టగంగవరం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఆదివారం టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఉన్నగిరి వెంకట లింగయ్య, ఉన్నగిరి ఆదినారాయణ, ఉన్నగిరి పెద్ద నాగేశ్వరరావు, ఉన్నగిరి కోటయ్య, ఉన్నగిరి కోటేశ్వరరావు, దారపునేని రమణయ్య, దారపునేని కేశయ్య, వెంకటనారాయణ, పునుగుపాటి రామారావులతో పాటు మరికొంతమంది పార్టీలో చేరారు.

గొట్టిపాటికి మద్దతుగా బూచేపల్లి బంధువు

తాళ్లూరు : గతపదేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉన్న టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎడమకంటి వెంకటరమణారెడ్డి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి మద్దతుగా ముందుకు సాగుతున్నారు. 2009 ఎన్నికల వరకు టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేశారు. 2009 ఎన్నికల్లో బంధువు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉండటంతో టీడీపీని వీడి బూచేపల్లి వైపు నడిచారు. తదుపరి 2014, 2019 ఎన్నికల్లో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు, గొట్టిపాటి నరసయ్యతో రమణారెడ్డికి సత్సంబంధాలున్నాయి. బూచేపల్లికి సమీప బంధువైనప్పటికీ డాక్టర్ లక్ష్మికి అండగా ఉండి గెలుపునకు కృషి చేస్తున్నారు.

ఆశీర్వదించి..అసెంబ్లీకి పంపండి

ముండ్లమూరు : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని, ప్రజలు తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆమె ఆదివారం మండలంలోని శంకరాపురంలో ప్రచారం నిర్వహించారు. శంకరాపురంలో మా తాతయ్య మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు, తన తండ్రి గొట్టిపాటి నరసయ్య, బాబాయ్ ఎమ్మెల్యే రవికుమార్ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. వారిలాగే తనకూ సేవ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. దర్శిలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించి పేదల ఆరోగ్యాన్ని కాపాడతానన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మదలపు వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణ స్వామి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, మాజీ సర్పంచ్‌లు మేదరమెట్ల వెంకటరావు, ఇందూరి పిచ్చిరెడ్డి, నిడమానూరి శ్రీనివాసరావు, జంపాని శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ వీరపనేని రంగా, నవులూరి పెద అంజయ్య, కాటూరి ఏడుకొండలు, ఉప సర్పంచ్ కృష్ణ, వెంకటనారాయణ, రాంబాబు, హనుమంతరావు, బ్రహ్మయ్య, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన శంకరాపురం, చింతలపూడి వాసులు



శంకరాపురంలో చేరిన వారితో లక్ష్మి

శంకరాపురం గ్రామానికి చెందిన వైసీపీ పార్టీ ముఖ్య నాయకులు మేదరమెట్ల అంజయ్య, గంగినేని నాగేశ్వరరావు, మేదరమెట్ల వెంకటేశ్వర్లు, మేడికొండ కొండలరావు, గంగినేని సత్యనారాయణ, మన్నం సురేంద్రతో పాటు చింతలపూడి ఎస్సీ కాలనీకి చెందిన దాసరి చిన కోటయ్య, ముసలయ్య, మహేష్, మార్కు, చిన పౌలు, పెద పౌలు, వెంకటయ్య, వెంకటరావు, ఆశీర్వాదం, అంకారావు, రవి, వీరాస్వామి, కోటేష్, రమేష్, నాగేంద్ర, సుబ్బారావు, శంకర్‌తో పాటు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికీ డాక్టర్ లక్ష్మి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా పెద అంజయ్య చిన అంజయ్య, కాటూరి ఏడుకొండలు, ఉప సర్పంచ్ దామా కృష్ణ, గుర్రం వెంకట నారాయణ బాబు ఉన్నారు.

ఉగ్ర గెలుపుతోనే అభివృద్ధి



ఉగ్ర కోసం ప్రచారం చేస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు

పామూరు, ఏప్రిల్ 7 : వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి గెలుపుతోనే సాధ్యమని పార్టీ బీసీ నాయకులు, మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య అనానరు. పంచాయతీ పరిధిలోని డీవీపాలెం పరిధిలో ఆదివారం ఉగ్ర విజయాన్ని కాంక్షిస్తూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఉగ్రను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటస్వామి, కొంగల ప్రసాద్, సత్యం పాల్గొన్నారు. అనంతరం పంచముఖ శ్రీ ఆంజనేయస్వామికి పూజలు చేశారు.

ప్రజలంతా టీడీపీ వైపే

ప్రజలంతా టీడీపీ వైపే ఉన్నారని, చంద్రబాబును ముఖ్యమంచూడాలని కోరుకుంటున్నారని టీడీపీ బీసీ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.గంగరాజు యాదవ్ అన్నారు. బూత్ నెం.280 పరిధిలో బూత్ కమిటీ ఇన్‌చార్జి గడ్డం రామారావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే బీసీలు బాగుపడతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, మాజీ సర్పంచ్‌లు డీవీ మనోహర్, కావిటి సుబ్బయ్య, యారవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్ బాబు, హరిబాబు, సాంబయ్య, డోలా శేషు, ముబినా మౌలాలి, చినహజరత్, సయ్యద్ ఖాదర్‌బాషా, గుత్తి మహేష్, నాయబ్‌రసూల్, ఊసా మధు, షత్తు మస్తాన్, అబ్బారెడ్డి రాజా, కావేరి రసూల్, తెలుగు మహిళలు రమాదేవి, ఆవుల రమణమ్మ, జనసేన పార్టీ నాయకులు షేక్ సందానిబాషా, గుత్తి మహి పాల్గొన్నారు.

టీడీపీతోనే పల్లెలు సుభిక్షం

పీసీపల్లి : తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే పల్లెలు సుభిక్షంగా ఉంటాయని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని నేరేడుపల్లి, పాలేటిపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగిన టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేస్తారని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్రని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పల్లా మల్లికార్జున్, పువ్వాడి నాగరాజు, వీరపనేని పెద్దన్న, ముప్పూరి బ్రహ్మయ్య, పువ్వాడి బ్రహ్మయ్య, కొల్లా ప్రతాప్, ఏనుగంటి వెంకయ్య, కోమటిగుంట్ల వీరయ్య, గురుబ్రహ్మం, శర్మ, పరిమి మాలకొండయ్య, జనసేన పార్టీ అధ్యక్షుడు బండారు రాజు, వీరనారాయణ, వెంకట్రావు, మాచర్ల, సత్తిరెడ్డి ఉన్నారు.




కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఉగ్ర

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

మండలంలోని జంగాలపల్లికి చెందిన 4 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.ఆదివారం చెన్నైలో ఉన్న కనిగిరి నియోజకవర్గ ప్రాంతం వారితో డాక్టర్ ఉగ్ర ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉగ్రని కలిసిన జంగాలపల్లికి చెందిన కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి(లారీ), కసిరెడ్డి రామిరెడ్డి, కసిరెడ్డి వీరారెడ్డి, వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి కండువా కప్పిన ఉగ్ర టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరివెంట నాయకులు ఓబుల్‌రెడ్డి, ఎబినేజరు, జోసెఫ్, మాలకొండారెడ్డి, పిచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.







ఖాకీ + వైసీపీ = బరితెగింపు

- ప్రతిపక్ష పార్టీ నేతల కదలికలపై డేగకన్ను
- వైసీపీ కార్యకర్తల్లా.. ఓ సామాజిక వర్గ పోలీసులు
- ఐపీఎస్‌ల బదిలీతోనైనా పోలీసుల్లో మార్పు వచ్చేనా?

ఐపీసీని అమలు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు వైసీపీ సేవలో తరిస్తోన్నారన్న విమర్శలు, ఆరో పణలు వస్తున్నా కొందరు పట్టించు కోవడంలేదు. వైసీపీ కార్య కర్తలకంటే ఎక్కువగా పోలీసులు కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు బరి తెగిస్తున్నారు. సామాన్యుల నుంచి ప్రతిపక్ష నాయకుల వరకు వైసీపీ బాధి తులుగా మారుతున్నా పోలీసులు రక్షణ కల్పించకపోగా తిరిగి వారిపైనే కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా పోలీసుల తీరు మారుతుందని అందరూ ఆశించగా ఆ పరిస్థితులు మచ్చుకు కూడా కానరావడం లేదనేందుకు గత కొన్ని రోజులుగా ఎన్నో ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలో వైసీపీ చట్టాన్ని అమలు చేస్తున్న ఐపీఎస్‌లపై బదిలీ వేటు పడటం పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపింది. ఒక్క గుంటూరు రేంజ్‌లోనే ఏకంగా నలుగురు ఐపీఎస్‌లపై వేటు పడిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులపై వేటు పడిన నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బందిలో మార్పు వస్తుందా..? అధికార పార్టీ నేతల సేవలో తరిస్తున్న కొంతమంది ఖాకీల ప్రవర్తనలో ఇప్పటికైనా మార్పు వచ్చేనా..? అనే సందేహాలు అటు పోలీసుల్లోనూ, ఇటు ప్రతిపక్ష పార్టీల్లోనూ సర్వత్రా వినిపిస్తున్నాయి.

రిగ్గింగ్‌కు వైసీపీ వ్యూహం

ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు

గిరిజనులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఇప్పటికీ లేదు. ఇదేదో మారుమూల జిల్లాల్లో కాదు పల్నాడు ప్రాంతంలోని పలు తండాల్లో ఈ పరిస్థితి ఉంది. మైదాన ప్రాంత గిరిజనులు అధికంగా ఉండే పల్నాడు జిల్లాలోని మాచర్ల నియోజక వర్గంలోని అనేక తండాల్లో వైసీపీ నేతల అరాచకం రాజ్యమేలుతోంది. పోలింగ్ సమయంలో బూత్‌ల ఆక్రమణ, రిగ్గింగ్ ఆయా తండాల్లో షరామామూలుగా మారింది. లేదంటే వారిని భయభ్రాంతులకు గురి చేసి ఓటు వేయించుకుంటున్నారు. అయితే ఈ దఫా ఎలాగైనా తాము ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మాచర్ల నియో జకవర్గంలోని దుర్గి, వెల్దుర్తి, మాచర్ల మండలాల్లో ఏఏ తండాల్లో ఎన్ని ఓట్లు ఉన్నా యి, అక్కడి గిరిజనుల పరిస్థితులను వివరిస్తూ, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని టీడీపీ నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. గిరిజనులు వారికి నచ్చిన పార్టీకి ఓటు హక్కును వినియోగించులేక పోతున్నారని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సారి కూడా బలవంతంగా ఓటు వేయించుకోవడమో లేదంటే బూత్‌లు ఆక్రమించి రిగ్గింగ్‌కు పాల్ప డడమో చేసేందుకు వైసీపీ నేతలు ఇప్పటికే పక్కా పథకం రూపొందించారని ఆయా గ్రామాల్లో గిరిజనులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వారికి తగిన రక్షణ కల్పించాలని, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డి గూడెం, రామచంద్రాపురం తండా, మరస పెంట, హనమాపురం తండా, పిచ్చయ్య బావి తండా, దావుపల్లి తండా, మాచర్ల మండలం అచ్చమ్మకుంటతండా, రేగులవరం తండా, లచ్చమ్మబావి తండా, హస్నాబావితండా, కొత్తూరు, చింతల తండా, దుర్గి మండలం మంగాపురం తండా, లక్ష్మీపురం తండా, నెహ్రూ తండాల్లో బూత్‌ల ఆక్రమణ, రిగ్గింగ్ జరిగే అవకాశం ఉందని ఎన్నికల సంఘానికి తెలిపారు.

- ఇటీవల జగమేశ్వరపాడు వద్ద జనసేన కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడితే పోలీసులు బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదే టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడికి పాల్పడితే వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడమే గాక సంబంధం లేని గ్రామంలోని పార్టీ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి జైళ్లకు పంపేవారని పార్టీ నేతలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- డెల్టా ప్రాంతంలో పోలీసులు వైసీపీకి పరోక్ష సహకారం అందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల కొల్లిపర స్టేషన్ పరిధిలోని మున్నంగి గ్రామంలో ఇసుక రీచ్ వద్ద తవ్వకాలు ఆపాలని గొడవ చేసిన ఉదంతంలో ఆందోళనకు దిగిన వారిని ట్రాక్టర్‌తో తొక్కించి, కత్తులతో పొడిచేందుకు యత్నించిన ఘటనపై ఎస్ఐ కేసు లేకుండా రాజీ ప్రయత్నం చేశారు.

- కొల్లూరు మండల పరిధిలోని కిష్కింధపాలెంలో కోడ్ అమలు విషయాన్ని ప్రశ్నించిన పాపానికి టీడీపీ సానుభూతిపరులపై ఇటీవల వైసీపీ శ్రేణులు దాడికి తెగబడగా బాధితుడి మీదే పోలీసులు కేసు నమోదు చేశారన్న విమర్శలున్నాయి. వైసీపీ ఇన్‌చార్జి ఇటీవల భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో వ్యవహరించిన తీరుపై కూడా పోలీసులు కిమ్మనలేదు. బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి ఏకంగా టీడీపీ సానుభూతిపరుడైన ఓ వృద్ధుడిపై చేయిచేసుకున్నాడు. ఇవన్నీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక జరిగిన ఘటనలు కాగా అంతకు ముందు పలు సందర్భాల్లో పోలీసులు వైసీపీ నేతల సేవలో తరించారు. గతంలో చీరాల అధికార పార్టీలోని ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఓ నేత గన్‌మెన్ ఏకంగా ఏఎస్పీ పైనే అనుచితంగా ప్రవర్తించారనే ప్రచారం అప్పట్లో జోరుగా సాగింది. ఈ ఘటనమీద విచారణ జరపడంగాని, బాధ్యులైన వారిమీద చర్యలు తీసుకోవడం గాని జరగలేదు.

వారిని మార్చకుండా ఎన్నికలు కష్టమే...

బరితెగించి వ్యవహరిస్తున్న అనేకమంది సీఐలు, ఎస్ఐలను మార్చకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడం కష్టమనే వాదనలు ఉన్నాయి. ముఖ్యంగా పల్నాడులో ప్రశాంత ఎన్నికలు ఈ దఫా కత్తిమీద సామేనని సర్వత్రా ఆందోళనలున్నాయి. ఇప్పటికే అధికార పార్టీతో మ్యాచ్‌ఫిక్స్ చేసుకున్న సీఐలు, ఎస్ఐలను మార్చకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా ముగించలేరనే విషయం ఎస్పీ ముందుగా గుర్తించాల్సి ఉంది.

గుంటూరు, ఏప్రిల్ 7: చట్టాన్ని పరిరక్షిస్తూ, శాంతిభద్రతలను కాపాడుతూ, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సిన పోలీసులు ఉద్యోగ ధర్మాన్ని విస్మరించి అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. గడిచిన నాలుగున్నరేళ్లకు పైగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు కదిలితే కేసు.. మాట్లాడితే అరెస్టు అన్నట్లుగా కొందరు పోలీసుల తీరు ఉంది. తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేశారు. పోలీస్‌స్టేషన్లు వైసీపీ కార్యాలయాల మాదిరిగా.. అక్కడ ఖాకీలు వైసీపీ రక్షకభటులు మాదిరిగా తయారయ్యారనేలా పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసు చర్యలతో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ రోడ్డు మీదకు వచ్చే సాహసం కూడా చేయలేకపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును లాఠీలతో చితక్కొట్టిన ఉదంతానికి వేదిక కూడా గుంటూరే కావడం గమనార్హం. ఎన్నికల కోడ్‌తోనైనా అధికారుల్లో మార్పు వస్తుందని, కనీసం ఏకపక్ష వైఖరి విడనాడతారని భావించారు. కానీ ఎన్నికల షెడ్యూల్ విడుదలై రెండు వారాలు గడిచినా ఇప్పటికీ కొందరు పోలీస్ అధికారుల్లో మార్పు లేదు. అనేక పోలీస్‌స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలు ఏకపక్ష వైఖరి అవలంబిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా ఓ సామాజిక వర్గానికి చెందిన వారు రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయాన్ని తమ భుజాలపై వేసుకున్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే ప్రభుత్వం అనుకూలమైన వారిని పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసుకుంది. ఎన్నికల్లో కీలకపాత్ర వహించే పోలీసులు పక్ష పాతంగా వ్యవహరించకుండా ప్రతిపక్ష నాయకులు వారిపై ఓ కంట కన్నేసి ఫిర్యాదులు చేసేవారు. దీంతో పోలీసుల ప్రవర్తనలో మార్పు వచ్చేది. కానీ ప్రస్తుతం అటువంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదనే వాదన ఉంది. ఉన్నతాధికారులే గుడ్డిగా అధికార పార్టీకి దాసోహం అన్నట్లుగా వ్యవహరిస్తుంటే క్షేత్ర స్థాయిలో సిబ్బంది మరోలా ఎలా వ్యవహరి స్తారనే వాదన ఉంది. గత నెల 17న చిలకలూరి పేట బొప్పూడిలో ప్రధాని మోదీ పాల్గొన్న ప్రజా గళం సభ సజావుగా సాగేలా భద్రత కల్పించాల్సిన పోలీసు అధికారులే కార్యక్రమ విఘాతానికి సహకరించారన్న ఆరోప ణలున్నాయి. దీంతో ఐపీఎస్‌లపై ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపించింది. గుంటూరు రేంజి ఐజీ జి.పాలరాజు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు ఎస్పీలు రవిశంకర్‌రెడ్డి, పరమే శ్వర్‌రెడ్డి, కె.తిరుమలేశ్వరరెడ్డిలపై బదిలీ వేటు వేయడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మా రింది. వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచా లని ఎన్నికల కమిషన్ ఆదేశించడం పరిస్థితి తీవ్ర తకు అద్దం పడుతోంది.

మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో..

గతంలో మాచర్ల, గురజాల నియోజకవర్గాలు ఫ్యాక్షన్ ప్రభావితంతో అతలాకుతలం అయ్యేవి. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో దాదాపుగా ఫ్యాక్షన్ కనుమరుగైనప్పటికీ రాజకీయ కక్షలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. అక్కడ పోలీసులు పుండు మీద కారం చల్లినట్లుగా వైసీపీకి కొమ్ముకాస్తూ ఆయా గొడవలకు ఆజ్యం పోస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పిడుగురాళ్ల, మాచవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో టీడీపీ కార్యకర్తలపై సీఐలు వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో టీడీపీ కార్య కర్త లపై తప్పుడు కేసులు బనాయించడం, పార్టీలో చురుగ్గా ఉండే వారిని స్టేషన్‌కు పిలిపించి కేసులు బనాయిస్తామని, రౌడీషీట్‌లు తెరుస్తామని బెదిరించడం షరా మామూలుగా మారింది. పోలీసులే వైసీపీ నాయకులను పిలిపించి వారి నుంచి ఫిర్యాదు తీసుకుని టీడీపీ నాయకులను స్టేషన్ల చుట్టూ తిప్పుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎన్నికల సమయంలో కనీసం వారిని ఏజెంట్లుగా కూడా కూర్చోకుండా చూసేందుకు పోలీసులు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

- గుంటూరులో ఇటీవల బదిలీలపై వచ్చిన వారిలో ఎక్కువ మంది ప్రస్తుతానికి వైసీపీ శ్రేణులకు పరోక్ష సహకారమే తప్ప ప్రత్యక్షంగా సహకరించే పరిస్థితి లేదు. నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సీఐపై వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కోడ్‌కు ముందు నుంచి ఆయన వైసీపీ నేతలతో కలిసి తిరగడం, వారు ఏది చెబితే అది చేయడం విధిగా పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మూడేళ్ల క్రితం రాజధాని ఉద్యమానికి సంబంధించి నమోదైన కేసులను బయటకు తీసి ఇప్పుడు వారికి నోటీలును ఇస్తుండటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

- కారంపూడి పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ నేతలు ఏది చెప్తే అదే జరుగుతుంది. ఇటీవల కారంపూడిలోని ఓ స్టాల్ వద్ద ఉన్న టీడీపీ నేత చప్పిడి రాముపై సీఐ చిన మల్లయ్య ఏకంగా సర్వీసు రివాల్వర్‌తో దాడికి పాల్పడటం కలకలం రేపింది. మండలంలోని మిరియాలతో పాటు అనేక గ్రామాల్లో సీఐ చిన్న మల్లయ్య, ఎస్ఐ రామాంజనేయులును అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు రిగ్గింగ్‌కు పథకం రూపొందించినట్లు ప్రచారం జరుగుతోంది.

- గడిచిన ఆరునెలలుగా వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గ్రామం విడిచి వేర్వేరు ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. మిగిలిన వారిని బలవంతంగా వైసీపీలో చేర్చుకున్నారు. కాగా గ్రామానికి చెందిన కొందరు దళితులు టీడీపీపై ఉన్న అభిమానంతో గత నెల 17న బొప్పూడి ప్రజాగళం సభకు రహస్యంగా వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు సభకు వెళ్ళిన వారు తిరిగి గ్రామానికి చేరకముందే గ్రామంలోని వారి ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. దీంతో గడిచిన 20 రోజులుగా ఆ గ్రామానికి చెందిన దళితులు గ్రామం వెలుపలే తలదాచుకుని ఇటీవలే గ్రామంలోకి అడుగు పెట్టారు.



టీడీపీ కార్యకర్తలపై దాడి (పాత చిత్రం)



ఇటీవల కారంపూడిలో సీఐ చినమల్లయ్య రివ్వాల్వర్‌తో టీడీపీ నేతకు బెదిరింపు

- వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో నేటికీ టీడీపీ కార్యకర్తలు వేర్వేరు ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. రెండేళ్లుగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీహరి వైసీపీ కార్యకర్త మాదిరిగా వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. టీడీపీకి చెందిన మత్స్యకారుడు దుర్గారావును వైసీపీలో చేరాలని లేదంటే తప్పుడు కేసులు బనాయి స్తానని ఎస్ఐ వేధించడం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పల్నాడులో పోలీసులే అసలు సమస్య

పల్నాడులో ప్రశాంత ఎన్నికలకు పోలీసులే అడ్డంకిగా మారారన్న ఆరోపణలున్నాయి. ఆ ప్రాంతంలో వైసీపీ అభ్యర్థులను గెలిపించడం కోసం ఆ పార్టీ నాయకుల కంటే పోలీసులే తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్న విమర్శలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పిందే చట్టం.. చేసిందే శాసనం అన్నట్లుగా కొందరు పోలీసులు తూచా తప్పకుండా అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు, వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారు. రెండేళ్లుగా ఒకే స్టేషన్ పరిధిలో ఉంటున్న ఎస్ఐలు, సీఐలు పలువురు రెచ్చిపోతూ టీడీపీ కార్యకర్తలపై ఉక్కుపాదం మోపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పెదకూరపాడు నియోజకవర్గంలో తమ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇటీవల అమరావతి మండలం ధరణికోటలో వైసీపీ కార్యాలయానికి నిప్పుపెట్టిన ఘటనతో సంబంధం లేని ముగ్గురు టీడీపీ నేతలపై కేసులు బనాయించారు. కేసుతో సంబంధం లేని టీడీపీ నాయకులు కంచేటి సాయికుమార్, దండా నాగేంద్ర, షేక్ జానీ బాషాలను నిందితులుగా చేర్చారు. దీనిపై టీడీపీ నేతలు హైకోర్టులో సవాలు చేయగా ప్రస్తుతానికి అరెస్టు నుంచి మినహాయించారు. అయితే సాయికుమార్ విదేశాలకు వెళ్తున్నాడనే కారణంతో మహారాష్ట్రలో ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. అమరావతిలో ఇటీవల వైసీపీ కార్యకర్త టీడీపీలోకి చేరేందుకు సిద్ధమైన విషయం తెలుసుకున్న అమరావతి సీఐ బ్రహ్మం ఆయనతో వివాదం ఉన్న వ్యక్తిని పిలిపించి ఫిర్యాదు తీసుకుని అరెస్టు చేస్తానని బెదిరించారంటే వారి పనితీరు తెలుసుకోవచ్చు. ఈ విధంగా పోలీసు అధికారులు ఎక్కడికక్కడ వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా నడుచుకుంటూ టీడీపీ కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.27(సోమవారం)
సహారీ (ఉదయం) 4.40 (మంగళవారం)

- సత్తెనపల్లి నియోజక వర్గ నేతలతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, ఎంపీ కృష్ణదేవరాయలు



గెలుపే లక్ష్యం కావాలి

- ఉమ్మడి నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం
- అలసత్యం వద్దు.. అప్రమత్తంగా ఉండాలి
- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిదే అధికారం
- మళ్లీ వైసీపీ వస్తే నార్త్ కొరియాలా ఆంధ్రప్రదేశ్
- లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల సమీక్షలో టీడీపీ అధినేత

నరసరావుపేట, సత్తెనపల్లి, ఏప్రిల్ 7: కూటమి అభ్యర్థులు విజయం సాధించాలి. గెలుపే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు పనిచేయాలి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుంది. ఏ మాత్రం అలసత్యం వహించినా నష్టపోతాం. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం నార్త్ కొరియాలా మారిపోతుంది. అందుకే అందరూ ఎన్నికలపై అప్రమత్తంగా వ్యవహరించాలి.. అని ఉమ్మడి పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రజాగళం సభల్లో భాగంగా రాత్రి బస చేసిన టీడీపీ అధినేత సత్తెనపల్లిలో ఆదివారం నరసరావుపేట, గుంటూరు లోక్‌సభ పరిధిలో పోటీ చేసే అభ్యర్థులు, టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలతో ఎన్నికలపై సమీక్షించారు. రానున్న 36 రోజులు ఎంతో కీలకమని, నేతలు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో కష్టపడి పడి పని చేసి అన్ని స్థానాల్లో కూటమి విజయ దుందుభి మోగించాలని తెలిపారు. జనసేన, బీజేపీ ఓట్లు బదిలీ అయ్యేలా చూడాలని నేతలకు సూచించారు. సూపర్ సిక్స్ పథకాలపై స్పందన బాగుందని, వీటిని మరింతగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. వైసీపీ దుష్టపాలనలో దిగజారిన రాష్ట్రాన్ని గాడిన పెట్టి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలంటే కేంద్రం మద్దతు తప్పనిసరని, ఈ క్రమంలోనే పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందన్న విషయాన్ని ప్రజలకు అభ్యర్థులు, నేతలు వివరించి చెప్పాలన్నారు. పింఛన్ల పంపిణీలో వృద్ధులను ఇబ్బంది పెట్టి టీడీపీపై బురద చల్లుతున్న వైసీపీ తీరును ప్రజల ముందు ఎండగట్టి వాస్తవాలు చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో వైసీపీ కుట్రలపై అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీ కోసం పని చేసిన అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సాయంత్రం సత్తెనపల్లిలోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు నేతలు వీడ్కోలు పలికారు. అంతర్గత సమావేశంలో అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, జూలకంటి బ్రహ్మారెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, డాక్టర్ అరవింద బాబు, జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, తెనాలి శ్రావణ్ కుమార్, నక్కా ఆనందబాబు, రామాంజనేయులు, గల్లా మాధవి, నజీర్ అహమ్మద్‌లతో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, రాజ్యసభ మాజీ సభ్యుడు సుజనాచౌదరి, టీడీపీ, జనసేన నాయకులు కోవెలమూడి నాని, గాదె వెంకటేశ్వరరావు, బోనబోయినశ్రీనివాసయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ తదితరులు ఉన్నారు.

ఓవర్ కాన్ఫిడెన్స్ వీడండి.. మెజార్టీ రావాలి

తన వద్ద ఉన్న సర్వే ఆధారంగా నియోజకవర్గాల వారీగా నేతల పనితీరును అంచనా వేసిన చంద్రబాబు పలు సూచనలు చేశారు. బేషజాలు వీడాలని, అందరూ కలసి పనిచేయాలన్నారు. ఇంకా కొన్ని చోట్ల నేతల పనితీరు బాగోలేదని సున్నితంగా మందలించారు. కొందరు నేతలు, అభ్యర్థులు మితిమీరిన విశ్వాసంతో ఉన్నారు.. ఇది సరికాదన్నారు. ఎప్పటికప్పుడు నియోజకవర్గంలో ఏమి జరుగుతుందో గమనిస్తూ ఉండాలని సూచించారు.

మాచర్లలో పార్టీ జోష్‌లో ఉందని, అయితే ఇక్కడ కొన్ని సామాజిక వర్గాలకు ఇంకా దగ్గర కావాల్సి ఉందని అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డికి సూచించారు. మాచర్లలో ప్రశాంత ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని తెలిపారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేసేలా అధికారులపై ఒత్తిడి పెంచాలన్నారు.

సత్తెనపల్లిలో కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ విజయానికి కలసి పనిచేయాలని జనసేన నేత బొర్రా అప్పారావుకు చంద్రబాబు సూచించారు. నకరికల్లు మండలంలో మంచి మెజార్టీ రావాల్సిన బాధ్యత నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీలదేనని ఆదేశించారు. కోడెల శివరామ్‌తో చంద్రబాబు విడిగా చర్చలు జరిపి కన్నా విజయం కోసం పనిచేయాలని సూచించారు.

నరసరావుపేట నియోజకవర్గంలో డాక్టర్ చదలవాడ అరవిందబాబు అందరినీ కలుపుకుపోవడంలేదని నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు నరసరావుపేటలో పార్టీ పరిస్థితిని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. టికెట్ ఆశించిన నల్లపాటి రామచంద్రప్రసాద్‌తో చంద్రబాబు మాట్లాడారు. అరవిందబాబు విజయం కోసం పని చేయాలని తెలిపారు. గురజాలలో యరపతినేని విజయం కోసం కష్టపడి పనిచేయాలని డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావుకు చంద్రబాబు చెప్పారు. పెదకూర పాడు పరిధిలోని ఓటర్ల జాబితాల్లోని అవ కతవకలపై ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. నేతలు సమష్టిగా పనిచేయాలని, భాష్యం ప్రవీణ్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. జనసేన శ్రేణులతో సమన్వయంతో పనిచేయాలని ప్రవీణ్‌కు సూచించారు. జీవీ ఆంజనేయులతో వినుకొండ పరిస్థితిపై చంద్ర బాబు సమీక్షించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ అభ్యర్థులు నజీర్, మాధవీలతో చంద్రబాబు మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్లు, జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. తెనాలిలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయ లోపాన్ని సరిదిద్దుకోవాలని సూచించారు.





సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

14న తెనాలికి పవన్‌కల్యాణ్

- గత షెడ్యూల్‌లాగానే కార్యక్రమం
- ఆయన ఆరోగ్యం మెరుగైందన్న మనోహర్

తెనాలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెనాలి పర్యటన ఈ నెల 14న ఖరారైనట్లు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. పర్యటనకు ముందు రోజు తీవ్ర జ్వరం రావటంతో ఈ నెల 3న తెనాలిలో జరగాల్సిన పవన్ పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం మెరుగుపడటంతో తాజాగా తెనాలి పర్యటన తేదీని ఖరారు చేసినట్లు మనోహర్ తెలిపారు. తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ మేరకు వివరాలను వెల్లడించారు. గత షెడ్యూల్‌లో సూచించినట్లుగానే 14న పవన్ పర్యటన సాగుతుందన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చి కార్యాక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు.

వలంటీర్లను నట్టేట ముంచిన జగన్

తననే నమ్ముకున్న వలంటీర్లను జగన్ మోహనరెడ్డి మోసం చేయడానికి వెనకాడటంలేదన్నారు. వారి ఉద్యోగ ఒప్పంద కాలం మే 31తో రద్దవుతున్నా, వారికి తెలియనివ్వకుండా ఇంతకాలం జాగ్రత్త పడ్డారన్నారు. ఎన్నికల వరకు వలంటీర్లను వాడుకుని వదిలేసేందుకు ముందుగానే పథకం వేశారని, ఇందులో భాగంగానే వారితో బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారని విమర్శించారు. జూన్ 4న మీ ఫైల్‌పైనే సంతకం చేస్తానని, జీవితాలు మార్చేస్తానంటూ జగన్ చెబుతున్న అబద్ధపు మాటలను వలంటీర్లు అర్థం చేసుకోవాలన్నారు. నిజంగా వారిపై ప్రేమ అంతుంటే 4న చేస్తానన్న సంతకమేదో నోటిఫికేషన్‌కు నాలుగు రోజుల ముందు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు తోటకూర రమణారావు, న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, ఇస్మాయిల్ బేగ్ పాల్గొన్నారు.




'సన్'డే!

- మండిన ఎండ
- ఒంగోలులోనూ 40డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- పశ్చిమప్రాంతంలో మరింత తీవ్రత

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 7 : జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. ఇప్పటికే పశ్చిమప్రాంతంలోని పలుచోట్ల 44 డిగ్రీలు దాటింది. ఆదివారం తూర్పుప్రాంతంలో కూడా తీవ్రత అధికంగా కన్పించింది. ఒంగోలులో గరిష్ఠ ఉష్ణోగ్రత 40.5 డిగ్రీలు నమోదైంది. ఉదయం 11 గంటల నుంచే నగరంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఒక వైపు ఎండ తీవ్రత, ఇంకో వైపు ఉక్కపోతతో ప్రజానీకం అల్లాడిపోయారు. రోజువారీ చిరువ్యాపారాలు చేసుకొని జీవించే వారు అనేక ఇబ్బందులు పడ్డారు. ఏదైనా పనిమీద బయటకు వెళ్లిన వారు మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతతో ఎక్కడో ఒకచోట కొద్దిసేపు సేదతీర్చుకోవాల్సి వస్తోంది. మరోవైపు శీతలపానీయాలకు డిమాండ్ ఏర్పడింది. సాయంత్రం కూల్‌డ్రింక్, జ్యూస్, ఐస్‌క్రీమ్ దుకాణాల వద్ద రద్దీ కనిపిస్తోంది. ఇదే పరిస్థితి మరికొద్దిరోజులు కొనసాగే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



మద్యానికి రేషన్

ఈనెల 6 నుంచి అమలు

విచ్చలవిడి విక్రయాలపై ఈసీ సీరియస్

మధ్యాహ్నానికే మూతపడుతున్న సర్కారు దుకాణాలు

బార్లు మాత్రం బార్లా

పొదిలిలో ఎక్సైజ్, ఎస్ఈబీ తనిఖీలు

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 7 : ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపట్టడంపై ఈసీ సీరియస్ అయ్యింది. దీంతో రేషన్ విధానాన్ని అధికారులు అమల్లోకి తెచ్చారు. ఆ ప్రకారం గత ఏడాది ఏప్రిల్ నెలలో ఏతేదీన ఎంత మద్యం విక్రయించారో ఇప్పుడు కూడా అంతే అమ్మాల్సి ఉంటుంది. దాన్ని శనివారం నుంచే ఆచరణలో పెట్టారు. దీంతో నిర్దేశిత కోటా మధ్యాహ్నానికే పూర్తయి అన్ని దుకాణాలు మూతపడుతున్నాయి. ఈ విధానం బార్ల యజమానులకు మాత్రం బాగా కలిసివస్తోంది. బార్లకు సైతం నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు యజమానులు ఖాతరు చేయడం లేదు. ఉదయం 6నుంచి రాత్రి 12 గంటల వరకు తెరచి మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. గత ఏడాది ఏప్రిల్‌లో సరాసరిన రోజుకు సుమారు రూ.4కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది ఎన్నికల సీజన్ కావడంతో నిన్నమొన్నటి వరకు భారీగానే అమ్మారు. ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేసేసరికి రేషన్ విధానం ప్రారంభించి మద్యం విక్రయాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. అంతేకాకుండా బెల్ట్ దుకాణాలను కట్టడి చేసేందుకు ఒక్కొక్కరికి ఒక్కోబాటిల్ చొప్పున విక్రయిస్తున్నారు.

బార్లలో కొనుగోలుకు వైసీపీ నాయకుల చీటీలు

బార్లలో మద్యం కొనుగోలు చేసేందుకు వైసీపీ నాయకులు చీటీల విధానం అవలంబిస్తున్నారు. పొదిలిలోని ఒక బార్‌లో ఈతరహా వ్యవహారం జరుగుతుందని సమాచారం. జిల్లా ఉన్నతాధికారికి అందింది. అక్కడ సీఎం పర్యటన నేపథ్యంలో ఇది జోరుగా నడుస్తుందని ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎక్సైజ్, ఎస్ఈబీ అధికారులను అప్రమత్తం చేశారు. ఒంగోలు ఎక్సైజ్ ఈఎస్ టి.శౌరి, ఎస్ఈబీ ఈఎస్ రవికుమార్‌ల ఆధ్వర్యంలోని బృందాలు అక్కడ తనిఖీలు నిర్వహించాయి. అక్కడ స్లిప్పుల విధానం ఏమీ జరగడం లేదని తేల్చాయి. కానీ ముందస్తుగా అందిన సమాచారం మేరకు బార్ యజమాని అప్రమత్తమైనట్లు తెలుస్తోంది.

మద్యం, డబ్బులు ఇచ్చినా ససేమిరా

రోడ్ షోలు వెలవెల..

పేలవంగా సభ!

కేడర్ ఊసే కరువు

స్థానిక అంశాల ప్రస్తావనే లేదు

కనిగిరిలో 'షో' అట్టర్‌ఫ్లాప్

పొదిలిలో చిమ్మచీకట్లో పర్యటన

సీఎం రాకతో ప్రజలకు చుక్కలు

12 గంటలు కరెంటు నిలిపివేత

ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు

సిద్ధంకు రాంరాం!

జగన్ పర్యటనకు ప్రజల నుంచి స్పందన కరువు


జగన్ సభ జరుగుతుండగానే వెళ్లిపోతున్న ప్రజలు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఆదివారం నిర్వహించిన రోడ్‌ షోలు వెలవెలబోయాయి. కొనకనమిట్ల మండలం దొనకొండ అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సభ పేలవంగా సాగింది. వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేసినా ప్రజల నుంచి స్పందన కరువైంది. మద్యం, డబ్బులు ఆశ చూపినా సభకు వెళ్లేందుకు ససేమిరా అన్నారు. అనేక ప్రాంతాలకు వెళ్లిన బస్సులు ఖాళీగానే తిరుగుముఖం పట్టాయి. దీంతో సభాప్రాంగణంలోని అత్యధిక భాగం ఖాళీగా కన్పించింది. కనిగిరితోపాటు ముఖ్యప్రాంతాల్లో జగన్ రోడ్‌షోలు నిర్వహించగా ఎక్కడా పెద్దగా జనం కన్పించలేదు. సీఎం పర్యటన సాగినంత దూరం విద్యుత్ తీగలు, సర్వీసు వైర్లు తొలగించడంతో 12 గంటలు కరెంటు లేక ప్రజలు పడరానిపాట్లు పడ్డారు. ఓ వైపు ఎండ తీవ్రత, మరో వైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. జగన్ తన ప్రసంగంలో పార్టీ కేడర్ ఊసెత్తకపోగా స్థానిక సమస్యలను ప్రస్తావించకపోవడం ఇటు శ్రేణులు , అటు నాయకులు డీలాపడ్డారు.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'మేమంతా సిద్ధం' పేరుతో బస్సుయాత్ర ద్వారా వైసీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం పలికిన సీఎం జగన్ ఆదివారం జిల్లాలో పర్యటించారు. శనివారం రాత్రి కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం జువ్విగుంట వద్ద ఆయన బసచేశారు. ఆదివారం ఉదయం 10.45 గంటల నుంచి ప్రారంభమైన యాత్ర రాత్రి 9.30 గంటల వరకూ సాగింది. రాత్రికి దర్శి మండలం చలి వేంద్రం వద్ద బస చేశారు. మధ్యంలో దొనకొండ క్రాస్ రోడ్డు సమీపంలో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం చిమ్మచీకట్లో పొదిలి, దర్శిల్లో రోడ్‌షో నిర్వహించారు. మొత్తం ఆయన పర్యటన తీరుతెన్నులు, ప్రసంగాన్ని పరిశీలిస్తే ఆపార్టీ కార్యకర్తలు, నాయకులను కూడా ఉత్సాహపరచలేకపోయిందని చెప్పవచ్చు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నేపథ్యంలో ఇలా కార్యక్రమం పేలవంగా సాగడంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన ఆరంభమైంది. ఇంకోవైపు జనసమీకరణకు ఒంగోలు లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున ప్రయత్నం చేసిన నాయకులు మద్యం, నగదు, ఆహార పొట్లాలు ఇచ్చినా ఆశించిన స్థాయిలో కార్యక్రమం విజయవంతం కాలేదు.

కనిగిరిలో కనిపించని జనం

జువ్విగుంట నుంచి సిద్ధం సభా ప్రాంగణం వరకు సుమారు 55 కి.మీ పొడవున జగన్ బస్సుయాత్ర సాగించారు. అగ్రహారంలో ఒకటికి తొమ్మిది చోట్ల గజమాలలతో స్వాగత కార్యక్రమాన్ని మంత్రి సురేష్ ఏర్పాటు చేశారు. అన్ని చోట్లా పార్టీ నాయకులే తప్ప సాధారణ ప్రజలు కనిపించలేదు. ఆతర్వాత గంగదేవాలయం ప్రాంతంలో కనిగిరి నియోజకవర్గంలోకి బస్సుయాత్ర చేరగా కేవలం నాయకులే స్వాగతం పలికారు. అలవలపాడులో పదిమంది ఉన్న ప్రాంతంలో బస్సులోంచి బయటకు చూడని జగన్ ఐప్యాక్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన బాధితుల వద్ద మాత్రం ఆగి దరఖాస్తులు తీసుకుని ప్రజల సమస్యలపై స్పందించే ప్రయత్నం చేశారు. మధ్యాహ్నం సమయానికి నియోజకవర్గ కేంద్రమైన కనిగిరికి బస్సుయాత్ర చేరింది. కనిగిరి నడిబొడ్డులో ఆయనకు పేలవమైన స్వాగతం లభించింది. బస్సుపైకి వచ్చిన జగన్ అక్కడ పలుచగా ఉన్న జనాన్ని చూసి ఒక నమస్కారం చేసి రెండో నిమిషంలోనే బస్సులోకి వెళ్లిపోయారు. పక్కనున్న అభ్యర్థి నారాయణను పరిచయం చేయడం కానీ, ఆయనతో పాటు బస్సుపైకి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే బాబూరావుల గురించి చెప్పడం కానీ జరగలేదు. ఆతర్వాత 3 గంటల సమయానికి చినారికట్ల వద్ద మధ్యాహ్న భోజనానికి ఏర్పాటు చేసిన ప్రాంతానికి చేరారు. మధ్యలో ఆయనకు ఎక్కడా భారీసంఖ్యలో ప్రజలు స్వాగతం పలుకకపోగా ఉన్నవారిని కూడా ఆయన పలుకరించిన దాఖలాలు లేవు. మధ్యాహ్న భోజనం చేసిన ప్రాంతానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దొనకొండ క్రాస్‌రోడ్డు వద్ద సభా ప్రాంగణానికి ఆయన సాయంత్రం 5 గంటలకు చేరారు. షెడ్యూల్ ప్రకారం 4.30 గంటలకే సభ ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఆశించిన మేర జనం రాలేదన్న సమాచారంతో ఆయన అర్ధగంటసేపు మధ్యాహ్న భోజనం శిబిరం వద్దే వేచి ఉన్నట్లు వెల్లడైంది.

మేమంతా సిద్ధంగా లేమన్న జనం

ఒంగోలు లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణకు నాయకులు ప్రయత్నాలు చేశారు. ఆర్టీసీ తో పాటు, అన్ని ప్రాంతాల్లో విద్యాసంస్థల బస్సులను వినియోగించారు. వాహనాల్లో వచ్చిన వారికి మద్యం బాటిళ్లను, పలావు పొట్లాలు సరఫరా చేశారు. సాధారణ ప్రజలకు రోజువారీ కూలికింద డబ్బులిచ్చి మరీ తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయినా సభా ప్రాంగణం నిండలేదు. మధ్య ప్రాంతమంతా ఖాళీగానే దర్శనమిచ్చింది. ముందు భాగం ర్యాంప్ చుట్టూ ఉన్న జనంపైనే కెమెరా తిరగడంతో భారీగా జనం వచ్చినట్టు లైవ్ చూసేవారికి కనిపించినా అక్కడ నేరుగా వీక్షించేవారికి మధ్యప్రాంతంలో జనంలేక వెలవెలబోయినట్లు కనిపించింది. వచ్చిన వారిలో దర్శి, మార్కాపురం, ఒంగోలు నియోజకవర్గాల నుంచే అధికంగా ఉన్నారు. ఆ నియోజకవర్గాల నుంచి కూడా నాయకులు ఏర్పాటుచేసిన వాహనాలన్నీ రాకపోవడం విశేషం. సరాసరిన పది బస్సుల్లో నాలుగింటిలో మాత్రమే నిండుగా జనం వచ్చారు.

సంతృప్తిపడని కేడర్.. నేతలు

సభ పేలవంగా జరగ్గా జగన్ ప్రసంగం ఇటు కార్యకర్తలను కానీ, అటు పోటీలో ఉన్న అభ్యర్థులను కానీ సంతృప్తిపరచలేదంటే అతిశయోక్తి కాదు. అర్ధగంట ఆలస్యంగా సాయంత్ర 5.06 గంటలకు సభా వేదికవద్దకు బస్సు రాగా 5.20గంటలకు జగన్ ప్రసంగం ప్రారంభించారు. 6.11 గంటలకు ముగించారు. పోటీలో ఉన్న అభ్యర్థులను నామమాత్రంగా పరిచయం చేసి తిరిగి బస్సు యాత్రను ప్రారంభించారు. జగన్ తన ప్రసంగంలో వలంటీర్లను పొగడ్తలతో ముంచెత్తారు. ఒక్కసారంటే ఒక్కసారైనా పార్టీ కార్యకర్తల గురించి ప్రస్తావించలేదు. ఆవిషయంపై సభలో ఉన్న కేడర్ నిరుత్సాహంగా మాట్లాడుకోవటం స్పష్టంగా వినిపించింది. ఇక జిల్లా రాజకీయ అంశాలను కానీ, అభివృద్ధి అంశాలను కానీ ఆయన ప్రస్తావించలేదు. ముందుగా మాట్లాడిన మార్కాపురం అభ్యర్థి అన్నా రాంబాబు వెలిగొండ, మెడికల్ కాలేజీల అంశాలను ప్రస్తావించి ఇక్కడ చాలా పనులు చేశారని జగన్‌ను పొగిడారు. వెలిగొండ పెండింగ్ పనుల గురించి కానీ పూర్తికాని మెడికల్ కాలేజీ విషయాన్ని కానీ ఇతర ప్రాంతాలకు సంబంధించి గతంలో ఆయన ఇచ్చిన హామీల గురించి కానీ జగన్ మాట్లాడలేదు. కొత్త జిల్లాల ఏర్పాటుపై గొప్పగా చెప్పుకున్న జగన్ పశ్చిమప్రాంత ప్రజల ఆకాంక్షలను, మార్కాపురం జిల్లా ఏర్పాటు గురించి మాట వరుసకు కూడా ప్రస్తావించలేదు. చివర్లో ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులను పరిచయం చేసిన జగన్ ఒక్కొక్కరి గురించి మంచివారు, నాతమ్ముడు లాంటి వారు అన్నారు. అంతకుమించి వారికున్న ప్రజాసంబంధాల గురించి కానీ, సేవాకార్యక్రమాల గురించి కానీ మాట్లాడకపోవటంతో అభ్యర్థులు డీలాపడ్డారు.

12 గంటలు కరెంటు కోత
చీకట్లో రోడ్ షో

జువ్విగుంట నుంచి దొనకొండ క్రాస్‌వద్ద సభ జరిగే మార్గమధ్యంలో గ్రామాలన్నింటిలో ఆదివారం విద్యుత్ శాఖ కరెంటుకోత విధించింది. కనిగిరిలో అయితే ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఆరున్నరవరకు కరెంటుకోత విధించారు. దీంతో ప్రజలు ఉక్కపోతతో నానా అవస్థలు పడ్డారు. బహిరంగ సభ అనంతరం బస్సుయాత్ర జరిగే పొదిలితో పాటు మార్గమధ్యంలోని గ్రామాల్లోను కరెంటు తీసేశారు. పొదిలిలో జగన్‌ను చూసేందుకు రోడ్డుమీదకు వచ్చిన వారికి కూడా జగన్ కనిపించకపోగా కరెంటుకోతతో ఆయన ప్రయాణించిన బస్సుకూడా కనిపించలేదు. చివర్లో రాత్రి 9 గంటల ప్రాంతంలో దర్శిలో మాత్రం కరెంటుకోత విధించలేదు.

మండుటెండలో పడిగాపులు!

బస్సులన్నీ సిద్ధం సభకు కేటాయింపు

ప్రయాణికులకు తప్పని పాట్లు

వైసీపీ తీరుపై ఆగ్రహం

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 7 : వైసీపీ సభ అంటేనే జనానికి విరక్తి వస్తోంది. ఎన్నికల్లో గెలుపు కోసం ఆపార్టీ నేతలు చేస్తున్న జిమ్మిక్కులను చూసి వారు అసహ్యించుకుంటున్నారు. కోడ్ రాకముందు వరకు సిద్ధం సభ, పథకాలకు బటన్ నొక్కుడు, ఇళ్ల పట్టాలు పంపిణీ.. ఇలా అయినదానికి, కానిదానికి ప్రజలను పరుగులు పెట్టించారు. ఆర్టీసీని సొంత సంస్థలా వాడేశారు. అధికారులు కూడా వారికి వంతపాడుతున్నారు. ఇప్పుడు కూడా అదేపంథాను కొనసాగిస్తున్నారు. ఆదివారం జిల్లాలో జరిగిన సీఎం పర్యటన, దొనకొండ క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన బహిరంగ సభకు జనాన్ని తరలించేందుకు రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి 1,400 బస్సులు కేటాయించారు. అందులో ఉమ్మడి జిల్లా నుంచి 257 ఉన్నాయి. వాటిలో ఒంగోలు, పొదిలి, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు ఆర్టీసీ డిపోలకు చెందిన 170 పల్లెవెలుగు బస్సులున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం, ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతమయ్యాయి. పల్లెవెలుగు బస్సుల కోసం పడిగాపులు కాశారు. ఒకవైపు ఆదివారం జిల్లాలో 41 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రత నమోదు కాగా మండుటెండలో ప్రజలు పడిగాపులు కాశారు. బస్టాండ్‌లలో గంటల తరబడి ఎదురు చూసిన వారు అటు వైసీపీ నేతలు, ఇటు ఆర్టీసీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


బస్సులు లేక వెలవెలబోతున్న ఒంగోలు ఆర్టీసీ డిపో

డిపోల వారీ కేటాయించిన బస్సుల వివరాలు ఇవీ..

సీఎం సభకు రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి 1,400 బస్సులు కేటాయించారు. అందులో ఒంగోలు డిపో నుంచి 48, మార్కాపురం నుంచి 58, కందుకూరు నుంచి 45, అద్దంకి నుంచి 27, చీరాల నుంచి 22, కనిగిరి నుంచి 7, గిద్దలూరు నుంచి 42, పొదిలి నుంచి 30, మార్కాపురం నుంచి 20 బస్సులు ఉన్నాయి. ఇవి కాక బద్వేలు డిపో నుంచి 20, కడప నుంచి 30, కావలి నుంచి 50, పీలేరు నుంచి 30, సత్యవేడు నుంచి 15, సూళ్లూరుపేట నుంచి 10, నెల్లూరు నుంచి 60, రాజంపేట నుంచి 30, పుత్తూరు నుంచి 15, రాపూరు నుంచి 30, బాపట్ల నుంచి 26, రేపల్లె నుంచి 25, వెంకటగిరి నుంచి 20, గూడూరు నుంచి 20 బస్సులు కేటాయించారు. తిరుపతి డిపో నుంచి 15, శ్రీకాళహస్తి నుంచి 20, మంగళం 15, రాయచోటి నుంచి 40, జమ్మలమడుగు నుంచి 20, పులివెందుల నుంచి 30, ప్రొద్దుటూరు నుంచి 30, ఉదయగిరి నుంచి 30, ఆత్మకూరు నుంచి 8, గుంటూరు నుంచి 110, మంగళగిరి నుంచి 20, పొన్నూరు నుంచి 20, తెనాలి నుంచి 40, కనిగిరి నుంచి 22, పొదిలి నుంచి 30, చిలకలూరుపేట నుంచి 40, మాచర్ల నుంచి 20, నరసరావుపేట నుంచి 30, పిడుగురాళ్ల నుంచి 35, సత్తెనపల్లి నుంచి 30, వినుకొండ నుంచి 45, ఆత్మకూరు నుంచి 32, నెల్లూరు నుంచి 45, కనిగిరి నుంచి 3, మైదుకూరు నుంచి 20 బస్సులు కేటాయించారు. దీంతో ప్రయాణికులకు వెతలు తప్పలేదు.

టీచర్ల విదేశీ ప్రయాణ అనుమతులు రద్దు

- పోలింగ్ తేదీ ముగిశాకే పరిశీలన
- ఎన్నికల విధులకు నియమితులైన వారికే వర్తింపు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 7 : ఎన్నికల ప్రవర్తనా నియామావళి అమలులో ఉన్నందున ఉపాధ్యాయుల విదేశీ ప్రయాణ అనుమతులను రద్దు చేశారు. ఈమేరకు పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు మే 13న జరగనున్నాయి. అందుకు సంబంధించిన విధులకు ఉపాధ్యాయులను నియమించి వారికి శిక్షణ ఇస్తున్నారు. అలాంటి వారిలో ఇప్పటికే మే 13లోపు విదేశాలకు వెళ్లేందుకు ఇచ్చిన అనుమతులు, నిరభ్యంతర సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)లను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం మళ్లీ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, హైస్కూలు హెచ్‌ఎంలు తమ పరిధిలో పనిచేస్తున్న వారు ఎవ్వరైనా ఎన్నికల విధులకు నియమితులై మే 13లోపు విదేశాలకు వెళ్లే వారు ఉంటే నిలిపివేయాలని ఆదేశించారు.

ఓటుహక్కుపై అవగాహన

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 7: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు ఆదివారం సాయంత్రం ఒంగోలులోని గాంధీపార్కులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్క రు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్వో సుబ్బారెడ్డి కోరారు.


గిరిజనుల ద్రోహి జగన్‌రెడ్డి..!

తెలుగుదేశం కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల ధ్వజం

వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పిలుపు

గిరిజన ఆత్మీయ సమావేశానికి హాజరైన ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన గిరిజనులతో దామచర్ల జనార్దన్, దారునాయక్


టీడీపీలో చేరిన 49వ డివిజన్ వైసీపీ కార్యకర్తలతో దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 7: గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీని వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించా లని, గిరిజన ద్రోహి జగన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాల ని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పిలుపుని చ్చారు. తెలుగుదేశం పార్టీ కూటమి ఆధ్వర్యంలో ఒంగోలు లో జరిగిన గిరిజన ఆత్మీయ సమావేశానికి దామచర్లతోపా టు పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజ నులు మరింత వెనుకబాటుతనానికి గురయ్యారని ఆరోపించారు. గిరిజనులు అభివృద్ధి కోసం తెలుగుదేశం అనేక పథకాలు ప్రవేశపెట్టి అన్ని విధాలుగా అండగా నిలిచింద న్నారు. వైసీపీ వచ్చాక ఒక్క సంక్షేమపథకాన్ని కూడా అమ లు చేయకపోగా దళిత, గిరిజనులపై దాడులు, అక్రమ కేసులు పెట్టి అన్ని విధాలుగా ఇబ్బందులు పెట్టిందని వి మర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించడానికి గిరిజనులందరూ సమష్టిగా పని చేయాలన్నారు. టీడీపీ ఉ మ్మడి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిం చాలని, ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎంను చేసుకుందామని కోరా రు. ఒంగోలు నగరంలో రూ.50లక్షలతో గిరిజన భవనం ని ర్మించడం జరిగిందని, ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్ నుంచి వందల మందికి సబ్సిడీ రుణాలు అందించినట్లు తెలిపారు. కానీ వైసీపీ పాలకులు కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని, ఒక్క పైసా నిధులు ఇవ్వకపోగా ఒక్క రుణానికి కూడా అందించలేని దౌర్భాగ్య వైసీపీ ప్రభుత్వానిదని ఆగ్ర హం వ్యక్తం చేశారు. అనంతరం దారునాయక్ మాట్లాడు తూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్, గ్రూప్ 1, సివిల్స్ కోచింగ్, ఇచ్చి ఎందరికో ఉద్యోగ అవకాశాలు అందిచ్చినట్లు చెప్పారు. విదేశీ విద్య ద్వారా అనేకమంది గిరిజనులను విదేశాలకు పంపించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కానీ నేడు వైసీపీ వచ్చాక వా టన్నిటిని రద్దు చేయడమే కాకుండా జగన్ సొంత పేర్లు పెట్టుకున్నారని విమర్శించారు. ఈ సంద ర్భంగా స్థానిక జయప్రకాష్‌కాలనీ నుంచి సుమారు 50 మంది గిరిజను లు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. సమావే శంలో నాయకులు రాపూరి శ్రీను, కత్తి పద్మ, పార్లమెంట్ అధ్యక్షులు సేవ్యానాయక్, రాచగర్ల వెంకట్రావు, లక్ష్మనా యక్, పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

6వ డివిజన్‌లో దామచర్ల ప్రచారం

తెలుగుదేశం అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకా లతోనే ప్రజలకు సంక్షేమం లభిస్తుందని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం నగరం లోని 6వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నగరాన్ని సుంద రంగా తీర్చిదిద్దినట్లు చె ప్పారు. ప్రజలు ఆశీర్వదించి మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనుభవం గల చంద్రబాబు ము ఖ్యమంత్రిగా ఉంటేనే నిరుద్యోగులు, యువతకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అలాగే ప్రతి ఏటా రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థిక సహాయం. మహి ళ శక్తి ద్వారా ప్రతరి మహిళకు నెలకు రూ.1500, పాఠశా లకు వెళ్ళే విద్యార్థులకు ఏడాదికి రూ.15వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా వంటగ్యాస్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. అబద్దపు హామీ లు ఇచ్చి, ఒక్కచాన్స్ అంటూ ప్రజలను మోసం చేసిన ప్ర భుత్వం, చివరికి చెత్తపైనా పన్ను విధించిన చెత్త ప్రభు త్వం అన్నారు. సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకుండా చేసి, లక్షలాది మంది భవన నిర్మాణ రంగ కా ర్మికులకు ఉపాధి దూరం చేసిన దుర్మార్గపు వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, టీడీపీని గెలిపిం చాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని దామచర్లకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, మంత్రి శ్రీనివాసరావు, బండారు మదన్, పాలూరి వెంకటేశ్వర రెడ్డి, రాచగర్ల వెంకట్రావు, కు ట్టుబోయిన శ్రీను, ఆవుల శ్రీను, శ్రీరాములు, జనసేన, బీ జేపీ నాయకులు పాల్గొన్నారు.

49వ డివిజన్ నుంచి టీడీపీలో చేరిక

నగరంలోని 49వ డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రమణబోయి న శ్రీను, చీరబోయిన రమణయ్య, యారం బండయ్య, మేక ల జగదీష్, మల్లెబోయిన హరీష్, బుర్రా పవన్ కళ్యాణ్, ఆవుల శ్రీహరితోపాటు మహిళలు, పెద్ద సంఖ్యలో చేరనివా రిలో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు భైరపనేని శ్రీను, పొనుగుపాటి వెంకటేశ్వర్లు, పేలప్రోలు బ్రహ్మానందం, బా లకృష్ణ, వెంకటేశ్వర్లు తదిత రులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలి

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

సంతమాగులూరు, ఏప్రిల్ 7: ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సంతమాగులూరులో బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే రవికుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్-6 పథకాలతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా సార్వత్రిక ఎన్నికల తర్వాత చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలను ఉన్నత స్థితికి తీసుకెళ్లే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు ఆలోచన విధానం ఉందని చెప్పారు. అందులో భాగంగానే మేనిఫెస్టోను తయారుచేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో రైతన్నల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించక పోవడమే కాకుండా సరైన సమయంలో రైతులు పండించిన పంటలు కొనుగోలు చేయకపోవడం ద్వారా జగన్ రెడ్డికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదనే విషయం తేట తెల్లమవుతోందన్నారు. అధికారంలోకి రాగానే ఈనెల ఏప్రిల్ నుంచి అవ్వ, తాతలకు పింఛన్ రూ.నాలుగు వేలు పరిగణనలోకి తీసుకుని జూన్ నెలలో రూ.7 వేలు అందిస్తామని చెప్పారు. వలంటీర్లను వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నందువల్లే వారిపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో వలంటీర్ల ద్వారానే రూ.4 వేల పింఛన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందజేస్తామని చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాడిపర్తి వెంకట్రావు, అట్లా చినవెంకట రెడ్డి, దూపాటి ఏసోబు, అలూరి శ్రీనివాసరావు, తేలప్రోలు రమేష్, అట్లా పెద వెంకటరెడ్డి, నాగబోతు సుబాత, కోణికి గోవిందమ్మ, జనసేన మండల అధ్యక్షుడు జి.రామాంజి, చల్లా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


సంతమాగులూరులో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థులు కృష్ణప్రసాద్, రవికుమార్

రవికుమార్‌కు కుర్రావానిపాలెం సర్పంచ్ సంఘీభావం


మేదరమెట్ల: ఎమ్మెల్యే రవికుమార్‌కు సంఘీభావం ప్రకటిస్తున్న కుర్రావానిపాలెం సర్పంచ్ దశరథరామయ్య తదితరులు

మేదరమెట్ల, ఏప్రిల్ 7: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు కుర్రావానిపాలెం సర్పంచ్ నాదెండ్ల దశరథరామయ్య సంఘీభావం ప్రకటించారు. ఆదివారం కుర్రావానిపాలెం గ్రామంలో సర్పంచ్ దశరథరామయ్యను ఎమ్మెల్యే కలిశారు. సంఘీభావం తెలిపిన వారిలో నాదెండ్ల అంజనేయులు(తెనాలి), నాదెండ్ల రంగరావు, చుండూరి హరిబాబు, చల్లగుండ్ల భసవయ్య, భవన్నారాయణ, సతీష్, చైతన్య ఉన్నారు. అనంతరం వజ్జా చంద్రకళా పెద్దకర్మకు హాజరై చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట సింగమనేని వాసు, నాదెండ్ల కోటేశ్వరరావు, పిన్నక శ్రీనివాసరావు, చింతల సహదేవుడు, వజ్జా వాసు, తదితరులు ఉన్నారు.


అద్దంకిలో మాట్లాడుతున్న టీడీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ

మద్యంలో రూ.లక్ష కోట్లు, ఇసుకలో రూ.50 వేల కోట్లు లూటీ

అద్దంకి, ఏప్రిల్7: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఐదు సంవత్సరాల కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మద్యంలో రూ.లక్ష కోట్లు, ఇసుక ద్వారా రూ.50 వేల కోట్లు ప్రజల నుంచి లూటీ చేశారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ఆదివారం స్థానిక పోతురాజుగండిలోని టీడీపీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాల నిధులలో సగభాగం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చినవేనని చెప్పారు. నిధులు కేంద్రానివి కాగా, ప్రచారం మాత్రం వైసీపీ ప్రభుత్వానిగా ఉన్నాయన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగు చెందారన్నారు. వచ్చే ఎన్నికలలో వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, చిన్ని శ్రీనివాసరావు, జనసేన నేతలు చల్లా కృష్ణ, కాళీ చరణ్, గోరంట్ల సాయి, బీజేపీ నేతలు కొండ్రగుంట శ్రీనివాసరావు, షేక్ విరాట్ కాలేషా, మంగమూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


పూనూరులో బీసీ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

యద్దనపూడి(మార్టూరు), ఏప్రిల్ 7: తెలుగుదేశం పార్టీ బీసీలకు అండగా ఉంటుందని, వారి సంక్షేమం కోసం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం యద్దనపూడి మండలం పూనూరులో జరిగిన జయహో బీసీ సదస్సుకు గుదే తారకరామారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే మహిళలను డ్వాక్రా గ్రూపుల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేసినట్లు చెప్పారు. బీసీ కుటుంబాలలోని మధ్యతరగతి ప్రజానీకం కోసం ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. తద్వారా చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగించేవారికి పనిముట్లను అందజేసినట్లు చెప్పారు. మొదటినుంచి తెలుగుదేశం పార్టీ బీసీ కుటుంబాల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేసిందన్నారు. మరలా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బీసీ కుటుంబాలు కృషి చేయాలన్నారు. అందరూ సమిష్టిగా పనిచేస్తేనే మన ఆశయం చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడగలమన్నారు. రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో బీసీ కుటుంబాల అభివృద్ధి కోసం చంద్రబాబు ప్రత్యేకంగా మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశ పెడతారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నిరంగాలలో అభివృద్ధి అడుగంటి పోయిందన్నారు. జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపకపోతే మన బిడ్డల బంగారు భవిష్యత్తు అందకారంలోకి పోతుందన్నారు. అందుకే ప్రతిఒక్కరూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడానికి శాయశక్తులా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గుంజి వెంకట్రావు, నల్లపనేని రంగయ్య చౌదరి, శివరాత్రి శ్రీను, పోలూరి సింగయ్య, తుమ్మలపాటి రామవయ్య, పల్లపు అంకమ్మరావు, బోయపాటి సాంబశివరావు, రావిపాటి సీతయ్య, సాంబశివరావు, అంజిబాబు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన వలపర్ల వైసీపీ బీసీ కుటుంబాలు

టీడీపీలో చేరిన వైసీపీ బీసీ కుటుంబాలు

మార్టూరు, ఏప్రిల్ 7: మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన వైసీపీ మద్దతుదారులైన బీసీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆదివారం ఉదయం క్యాంపు కార్యాలయంలో బీసీ కుటుంబాలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ ఏలూరి పార్టీ కండువాలు మెడలో వేసి సాదరంగా ఆహ్వా నించారు. పార్టీలో చేరినవారిలో కుంచాల వాసు, కుంచాల శ్రీను, కుంచాల అనిల్, తన్నీరు అంకమ్మరావు, వెంకట్రావు, శ్రీను, తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ సూపర్‌సిక్స్ కరపత్రాల పంపిణీ

పర్చూరు, ఏప్రిల్ 7: పర్చూరులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గెలుపు కోసం కూటమి శ్రేణులు నేతృత్వంలో ప్రచారం జోరుగా సాగుతోంది. ఆదివారం స్థానిక నెహ్రూ నగర్‌లో చేపట్టిన ప్రచారంలో ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అభివృద్ధిని ఆకాంక్షించే ఏలూరి సాంబశివరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, తలారి శివయ్య, జనసేన ప్రతినిధులు కారంపూడి సందీప్ తేజ, పంద్రా రమేష్, తదితరులు పాల్గొన్నారు.


చినగంజాం: పల్లెపాలెం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు కాలనీల్లో ప్రచారం

మార్టూరు, ఏప్రిల్ 7: తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాత్రి మార్టూరులో జనార్దన్ కాలనీ, సాయి నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఏలూరి సాంబశివరావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కస్నెగంటి శ్రీనివాసరావు, జాష్టి సాంబశివరావు, తాటి నాగేశ్వరరావు, జంపని శ్రీను, కమ్మ శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, ఏప్రిల్ 7: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విస్తృతంగా పర్యటించారు. ముందుగా స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం పల్లెపాలెం పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సోపిరాలలో ఇటీవల మృతి చెందిన తుమ్మలపెంట లక్ష్మమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. గ్రామానికి చెందిన శిఖరం సత్యనారాయణ, పర్వత రెడ్డి వెంకటనరసింహారావు, శిఖరం శ్రీనివాసరావును పరామర్శించారు.

మున్నంవారిపాలెంకు చెందిన వైసీపీ నాయకులు నిద్ర చలమారెడ్డి, కోకి తిరుపతిస్వామి, రాజు హరిబాబులురెడ్డి, ఆసోది మౌలాలి, కుక్కల శ్రీనివాస్‌రెడ్డి, కె.హేమంత్‌రెడ్డి, జోగిరెడ్డి ఆకాష్‌రెడి, గొల్లమూరి శివారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొద వీరయ్య, ఆజాద్, టి.జమరావు, నక్కల వెంకటనారాయణ, సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలి


నక్కబొక్కలపాడులో ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి బాబి

బల్లికురవ, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని యువనేత గొట్టిపాటి కమల్ కిషోర్(బాబి) పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నక్కబొక్కలపాడులో ఎమ్మెల్యే రవికుమార్‌కు మద్దతుగా బాబి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి రవికుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో ఎమ్మెల్యే రవికుమార్ కృషితో గ్రామంలో పెద్దఎత్తున సీసీ రోడ్లు, ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో అభివృద్ధి పథకాలు ప్రజలకు అందాలంటే అనుభవశాలి అయిన చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, గొట్టిపాటి శంకర్, ఆళ్ల చంద్రమౌళి, అమరనేని బాస్కరరావు, తన్నీరు ఏడుకొండలు, సర్పంచ్ దూళిపాళ్ల బుల్లిరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. పాప మృతి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

మేదరమెట్ల, ఏప్రిల్ 7: జాతీయ రహదారిలో వెంకటాపురం- పి.గుడిపాడు మధ్య ఎమర్జెన్సీ రన్‌వేపై కారు డివైడర్ దిమ్మెను ఢీకొన్న సంఘటనలో పాప మృతి చెందింది. కారులోని మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఉదయం శ్రీకాకుళం నుంచి స్వగ్రామమైన రైల్వేకోడూరుకు కారులో శివసురేందర్ కుటుంబంతో వెళుతున్నారు. ఉగాది పండుగకు, తమ తండ్రి తృతీయ వర్ధంతిని నిర్వహించడానికి శ్రీకాకుళంలో డాక్టర్‌గా పని చేస్తున్న శివసురేందర్, సంఘారికలు పిల్లలు శివశేషన్, ద్వారక, అత్త నాగేశ్వరమ్మతో వెళుతున్నారు. ఈక్రమంలో వెంకటాపురం- పిగుడిపాడు మధ్య కారు డివైడర్‌ను ఢీకొని ఎదురు రోడ్డులోకి వెళ్లి లారీని ఢీకొంది. ఈప్రమాదంలో ఆరు సంవత్సరాల పాప ద్వారక అక్కడికక్కడే మృతి చెందింది. బెలూన్లు తెరుచుకోవడంతో మిగిలినవారు గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని 108లో ఒంగోలు ఆస్పత్రికి తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం


ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బలరాం, వైసీపీ అభ్యర్థి వెంకటేష్

చీరాల, ఏప్రిల్ 7: ఆర్యవైశ్యులు ఎప్పటికీ తమ ఆత్మబంధువులేనని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ చెప్పారు. మండలంలోని గాంధీనగర్ పంచాయతీ ఎంజీహెచ్ కాలనీలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమాపేశంలో వారు మాట్లాడారు. ఆర్యవైశ్యులకు అండగా ఉంటామన్నారు. ముందుగా కాలనీలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బలరాం

చీరాల, ఏప్రిల్ 7 : ఇఫ్తార్ విందులో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నామని ఎమ్మెల్యే బలరాం, వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. ఆదివారం మక్కా మసీదు వద్ద ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బలరాం, వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నిర్వాహకులకు, హాజరైన వారికి వారు శుభాకాంక్షలు తెలిపారు. అందరిని పలకరిస్తూ వడ్డన చేశారు.

చేనేత అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

» చీరాల ప్రజల గుండెల్లో నిలిచేవిధంగా నడుచుకుంటా

» ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి కొండయ్య


నేతన్నల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, ఏప్రిల్ 7: మాటల్లో చెప్పటం కన్నా, అవకాశం ఇస్తే చేతల్లో చేసి చూపిస్తా.. చీరాల నియోజకవర్గ ప్రజల గుండెల్లో నిలిచేవిధంగా నడుచుకుంటానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని దేవాంగపురిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పృథ్వి లలితామోహన్, వ్యాపారవేత్త సిద్ది బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చేనేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతన్నలు సంక్షేమానికి, అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తామన్నారు. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు అవసరమైతే తాము భూమి కొనుగోలుచేసి మరీ ప్రభుత్వానికి ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు మువ్వల వెంకటరమణరావు, జనసేన, టీడీపీ నాయకులు, నేతన్నలు పాల్గొన్నారు.

80 కుటుంబాలు టీడీపీలో చేరిక

స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వేటపాలెంకు చెందిన 80 కుటుంబాలు టీడీపీ నేత పొగడదండ వెంకటేశ్వర్లు కుమారులు సుబ్బారావు, నరసింహారావుల ఆధ్వర్యంలో కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారి మెడలో కొండయ్య పార్టీ కండువాలువేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ఐకమత్యంగా అడుగులు వేద్దామన్నారు. కార్యక్రమంలో కొండయ్య కుమారులు గౌరీఅమర్‌నాథ్, మహేంద్రనాథ్, సీనియర్ నాయకుడు వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో కొండయ్య చినకుమారుడు మహేంద్రనాథ్, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావులు ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఓటర్లను కలిశారు. కొండయ్యను గెలిపించాలని కోరారు. బోయినవారిపాలెంకు చెందిన యువకులు కొండయ్య పెద్దకుమారుడు గౌరీఅమర్‌నాథ్‌ను కలసి సంఘీభావం ప్రకటించారు. తామంతా కొండయ్య గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు.

మండలంలోని బుర్లవారిపాలెంలో ఆదివారం జయహో బీసీ కార్యక్రమంలో కొండయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈపురుపాలెంలో కుర్రు కోటయ్య కమ్యూనిటీలో జరిగిన జనసేన పార్టీలో చేరికలకు హాజరయ్యారు. అలాగే, వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ బీసీ డిక్లరేషన్ ప్రయోజనాలను వివ రించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు పవిత్ర కార్యం

చీరాల, ఏప్రిల్ 7: మండల పరిధిలోని ఈపురుపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కొండయ్య హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం విందులో వడ్డన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు గుద్దంటి చంద్రమౌళి, ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికులకు పాట్లు


ఖాళీగా ఉన్న అద్దంకి ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి, ఏప్రిల్ 7: వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన బస్ యాత్రకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్‌లను తీసుకోవటంతో ప్రయాణికులకు పాట్లు తప్పటం లేదు. శనివారం కావలి, ఆదివారం కొనకనమిట్లలో జరిగిన సీఎం బహిరంగ సభలకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను తీసుకున్నారు. ఈనేపథ్యంలో అద్దంకి డిపోలో ఉన్న 27 పల్లెవెలుగు బస్సులు వెళ్ళాయి. దీంతో ఆయా రూట్లలో ప్రయాణికులు మరింత ఇబ్బంది పడ్డారు. మరలా పిడుగురాళ్ళ, గుంటూరులో జరిగే బహిరంగ సభలకు కూడా రెండు రోజుల పాటు ఆర్టీసీ బస్సులు వెళ్ళే అవకాశం ఉంది. ఆ రెండు రోజులలో కూడా బస్సులు రద్దయ్యే అవకాశం ఉంది. అద్దంకి డిపోలో ప్రయాణికులకు రెండు రోజుల నుంచి అద్దె బస్సులు, ఎక్స్‌ప్రెస్‌లే దిక్కు అయ్యాయి. తరచూ ఆర్టీసీ బస్‌లను రాజకీయ నేతల సమావేశాలకు పంపిస్తూ ఆయా రూట్లలో రద్దు చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.


బస్సులు లేక నిర్మానుష్యంగా ఉన్న ఇంకొల్లు బస్టాండు

ఇంకొల్లులోనూ అదేతీరు..

ఇంకొల్లు, ఏప్రిల్ 7: గత వారం రోజులుగా ఇంకొల్లు చుట్టుపక్కల గ్రామాల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంకొల్లు బస్టాండుకు వచ్చే బస్సుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. ఈ రూటులలో తిరిగి బస్సులను సభలకు పంపారు. ఎటువంటి సమాచారం తెలియని ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఇంకొల్లు బస్టాండులో గంటలతరబడి బస్సులు లేక ప్రయాణికులు పడిన బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఒకవైపు మండే ఎండలకు తోడు బస్సు సర్వీసులు లేకపోవడంతో చిన్నారులతో ప్రయాణం చేయాల్సివచ్చినవారు ప్రయివేటు వాహనాలను ఆశ్ర యించి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆర్టీసి అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యధోరణి పట్ల ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చినగంజాం ఎంపీపీ దారెటు?

చినగంజాం, ఏప్రిల్ 7: చినగంజాం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి టీడీపీలో చేరడం తాత్కాలికంగా వాయిదా పడింది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రణీత్ రెడ్డి జోక్యంతో వాయిదా పడినట్లు తెలుస్తుంది. పెదగంజాం గ్రామంలోని ఎంపీపీ స్వగృ హంలో మండల పరిధిలోని పలుగ్రామాలకు చెందిన వైసీపీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఎంపీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆత్మీయ సమా వేశంలో చర్చించి, టీడీపీలో చేరేందుకు నిర్ణయం తీసుకోవాలని అనుకున్నా రు. సమావేశం జరుగుతున్న మధ్యలో బాలినేని ప్రణీత్‌రెడ్డి వచ్చారు. ఆయన రావడంతో ఆత్మీయ సమావేశం అర్థంతరంగా ముగించారు. బాలినేని శ్రీనివాసరెడ్డిని సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఒంగోలులో కలవాలని ప్రణీత్‌రెడ్డి అంకమ్మరెడ్డికి సూచించారు. అంకమ్మ రెడ్డి టీడీపీలో చేరకుండా బుజ్జగించేందుకు పిలిచినట్లు తెలుస్తుంది. ఈనెల 11వ తేదీ టీడీపీలో చేరేందుకు అంకమ్మరెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇంతలో బాలినేని పిలుపుతో అంకమ్మరెడ్డి టీడీపీలో చేరడం వాయిదా పడింది. ఆత్మీయ సమవేశంలో చినగంజాం-2, రాజుబంగారుపాలెం, పెదగంజాం, కొత్తపాలెంకు చెందిన వైసీపీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చీరాలటౌన్, ఏప్రిల్ 7: ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ప్రత్యేక పోలీసు బలగాలతో పాపాయిపాలెం, కీర్తివారిపాలెం, పేర్లవారిపాలెం, వాడరేవు, బుర్లవారిపాలెం గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఆయా ప్రాంతాల ప్రధాన రహదారుల్లో వాహనాలు తనిఖీలు చేశారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేయడం అభినందనీయం

ఇంకొల్లు, ఏప్రిల్ 7: పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా ఇంకొల్లుకు చెందిన టీడీపీ ముస్లిం మైనార్టీల నాయకుడు షేక్ బాబర్ బాషా అందజేయడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. బాబర్ బాషా దంపతులు సుమారు 300 మంది కుటుంబాలకుపైగా ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా ఆదివారం తోఫా అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.వెయ్యి విలువ కలిగిన నిత్యావసరాలతోపాటు చీరను అందజేశారు.

వృద్ధుడికి ట్రైసైకిల్ అందజేత

మార్టూరు, ఏప్రిల్ 7: స్థానిక అమ్మ ఆశ్రమంలో రాజుపాలెం గ్రామానికి చెందిన తిరుపతి హనుమంతరావు అనే వృద్ధుడికి ఇన్నర్ వీల్ క్లబ్ క్లబ్ ఆఫ్ కోలలపూడి శతాబ్ది వారు ఆదివారం ట్రైసైకిల్‌ను అందజేశారు. కోలలపూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సహకారంతో ట్రైసైకిల్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కందిమళ్ల నిర్మల, సెక్రటరీ శివకుమారి, అరుణ, సుజాత, కస్తూరి, తదితరులు పాల్గొన్నారు. వారికి ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాలలో పోలీసుల కవాతు


ద్రోణాదులలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న మార్టూరు ఎస్‌హెచ్‌వో రాజశేఖర్ రెడ్డి, ఏఎస్ఐ సైదా

మార్టూరు, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మండలంలోని రాజుగారిపాలెం, ద్రోణాదుల, బొబ్బేపల్లి, మార్టూరు, రాజుపాలెం గ్రామాలలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. మార్టూరులో రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద హైవేపై వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. మార్టూరులో పెద్ద అండరు పాస్‌వద్ద పోలీసులతో ప్రదర్శన నిర్వహించారు. స్టేషన్‌లో రౌడీ షీటర్లుగా నమోదయిన వ్యక్తులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో నిఘా ఉంటుందని, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని రాజశేఖర్ రెడ్డి హెచ్చ రించారు.

వాహనాల తనిఖీల్లో బంగారం, వెండి వస్తువులు స్వాధీనం

మార్టూరు, ఏప్రిల్ 7: మార్టూరులో మండల కాంప్లెక్స్ వద్ద జాతీయ రహదారిపై గుంటూరు వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న కొల్లిపర సుపేరావు అనే యువకుడిని ఆదివారం సాయంత్రం పోలీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో యువకుడి దగ్గర ఉన్న 92 గ్రాముల బంగారపు వస్తువులు, 4 కిలోలు వెండి వస్తువులను స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశే ఖర్ రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. వలపర్లకు చెందిన సదరు వ్యక్తి బంగారపు పనులు చేస్తుంటాడు. స్వాధీనం చేసుకున్న ఈ వస్తువులను జిల్లా గ్రివెన్స్ కమిటీకి పంపిస్తున్నట్లు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కమిటీకి వస్తువులకు సంబంధించిన బిల్లులు, తదితర ఆధారాలను చూపించి పొందవచ్చునని ఆయన తెలిపారు.

దుద్దుకూరులో అగ్నిప్రమాదం

ఇంకొల్లు, ఏప్రిల్ 7: మండలంలోని దుద్దుకూరులో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇళ్ల సమీపంలో ఉన్న చెత్తకుప్పలను తగలబెడుతుండగా ప్రమాదవశాత్తు మంటలు ఎగిసి పక్కనేఉన్న చిగురుపాటి శేషయ్య పాత పెంకుటింటికి అంటుకున్నాయి. గ్రామస్థులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వారువచ్చి మంటలను అదుపుచేశారు. ఈప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు

ఇంకొల్లు, ఏప్రిల్ 7: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు గుర్తింపు వచ్చిందని రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతనిధి గుంజి వెంకట్రావు అన్నారు. మండలంలోని దుద్దుకూరు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే బీసీలకు గుర్తింపు, రాజకీయంగా అభ్యున్నతి జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, శ్రీనివాసరావు, రవి, సుబ్బారావు, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపును అడ్డగించిన గ్రామస్థులు

మార్టూరు, ఏప్రిల్ 7: మండలంలోని కోలలపూడి గ్రామంలో ఆదివారం రాత్రి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీని గ్రామస్థులు అడ్డుకున్నారు. కోలలపూడి గ్రామ పంచాయతీ పరిదిలోని గ్రావెల్ కొండ నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నారని ఇంకొల్లు వైపే వెళుతున్న లారీని గ్రామస్థులు సెంటరు లో ఆపివేశారు. అనంతరం ఈ విషయాన్ని మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డికి, డయల్ 100కు సమాచారం అందజేశారు. దాంతో కోలలపూడి గ్రామానికి ఆయన పోలీసులను పంపించారు. అక్కడ గ్రావెల్ తరలింపుపై పోలీసులకు, గ్రామస్థులకు కొంత వాదన జరిగినట్లు తెలిసింది. అనంతరం పోలీసులు ముందస్తు జాగ్రత్తగా లారీ డ్రైవర్‌ను స్టేషన్‌కు తీసుకు వచ్చారు. ఈవిషయమై కొంతమంది గ్రామస్థులు రాత్రి 10 గంటల సమయంలో స్టేషన్‌కు వచ్చారు. ఈవిషయమై రాజశేఖర్ రెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అక్రమ గ్రావెల్ తరలింపుపై గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు గాని, మైనింగ్ అధికారులకుగాని తెలియజేయాలన్నారు. అయితే, గ్రామస్థులు ఆగ్రహంతో లారీ డ్రైవర్‌పై చేయి చేసుకుంటారనే ముందస్తు జాగ్రత్తగా స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు. మైనింగ్ అధికారులకు కూడా ఈ విషయంపై సమాచారం ఇచ్చామన్నారు.

అత్తపై కోడలు దాడి

మార్టూరు, ఏప్రిల్ 7: మార్టూరులోని సంపత్‌నగర్‌లో ఒక కుటుంబంలో జరిగిన గొడవలో అత్తపై కోడలు భౌతిక దాడి చేసినట్లు తెలిసింది. ఈవిషయమై అత్తను కుటుంబసభ్యులు ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మేదరమెట్ల, ఏప్రిల్ 7: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పమిడిపాడులో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన అత్తంటి అంజయ్య(58) చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పుట్టింటికి వెళ్లి రెండు నెలల నుంచి తిరిగి రాలేదని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అంజయ్యకు ఒక కుమార్తె ఉన్నారు.

ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	41.0	26.0
కావలి	41.0	27.0
కందుకూరు	39.0	28.0
ఆత్మకూరు	42.0	27.0
ఉదయగిరి	43.0	25.0



కర్ఫ్యూను తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం



జనసంచారం లేని బట్వాడిపాలెం సెంటర్



ఎస్పీ కార్యాలయం వద్ద రాకపోకల్లేని పొదలకూరు రోడ్డు



నిర్మానుష్యంగా గాంధీబొమ్మ కూడలి



ఉదయగిరి : గొడుగు వేసుకొని వెళుతున్న చిన్నారి



బండిపై వెళుతున్నా ముసుగు తప్పదు మరి!



ఎన్ని నీళ్లు తాగాలో..



అబ్బా ఏమి ఎండ... కాస్త గొడుగు పట్టు!

సన్ డే!

- మండిన ఎండ
- అల్లాడిన జనం
- నిర్మానుష్యంగా నగర వీధులు

జిల్లాలో పెరిగిన వేసవి తీవ్రతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఏకంగా 41 డిగ్రీలకుపైగా నమోదు కావటం ఆందోళనకు గురిచేస్తుంది. దీంతో ఉదయం 9 గంటలపైన బయటకు రావాలంటే ప్రజలు బెంబేతెత్తిపోతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు ఇళ్లలోనే ఉండిపోతున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది.దీంతో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా బయటకు వెళ్లద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమలో ఆదివారం నెల్లూరు నగరంలో కనపించని దృశ్యాలివి. -నెల్లూరు (వైద్యం)


ఇల్లు పాతది.. బిల్లు కొత్తది !

- గృహాలు నిర్మించకనే నిర్మించినట్లు బిల్లుల స్వాహా
- కాసులు కురిపిస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకం
- వైసీపీ నేతలు, హౌసింగ్ సిబ్బంది చేతివాటం
- ఎన్నికల కోడ్‌కు ముందే భారీగా అప్‌లోడ్!
- జేసీ విచారణ ఏమైందో..?

నెల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు కోసం ఉద్దేశించిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం వైసీపీ నేతలు, హౌసింగ్ అధికారులకు కాసులు కురిపిస్తోంది. పేదల ముసుగులో కొందరు అధికారపార్టీ నేతలు, హౌసింగ్ సిబ్బంది ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారు. కొత్తగా ఇల్లు కట్టకుండానే ఎప్పుడో కట్టిన ఇంటికి ఇప్పుడు బిల్లులు డ్రా చేస్తూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. కొన్ని వేల దొంగ ఇళ్లను సృష్టించి వాటి పేరిట రూ.కోట్లు కాజేశారు. ఈ వ్యవహారం రెండేళ్ల కిందటే వెలుగులోకి వచ్చింది. ఆధారాలతో సహా వెలుగుచూడడంతో అప్పటి జాయింట్ కలెక్టర్‌ను కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ తర్వాత కొన్నాళ్లు సొంత స్థలాల్లో ఇళ్ల జోలికి వెళ్లకుండా లేఅవుట్ల ఇళ్లపై దృష్టి పెట్టారు. అయితే ఎన్నికలు సమీపిస్తుండడంతో మరోమారు విచ్చలవిడిగా పాత ఇళ్లకు బిల్లులు పెట్టుకున్నారు. ఇటీవల ఈ బిల్లులు పడుతుండడంతో మరోమారు ఈ అవినీతి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పొదలకూరు మండలంలో విచ్చలవిడిగా పాత ఇళ్లకు బిల్లులు తీసుకున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. స్థానిక హౌసింగ్ అధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నారు. పొదలకూరే కాదని జిల్లా మొత్తం ఇదే పరిస్థితి ఉందని చెబుతున్నారు. జిల్లాలో మొత్తం నిర్మించిన ఇళ్లలో సగానికిపైగా సొంత స్థలాల్లోనే నిర్మించారు. అందులోనూ మూడొంతుల ఇళ్లు పాతవే ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది.

● జేసీ విచారణ ఏమైందో..?

తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా పేదల ముసుగులో కొందరు అధికారపార్టీ నేతలు, హౌసింగ్ సిబ్బంది ప్రజాధనాన్ని దిగమింగారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. లేఅవుట్లు, సొంత స్థలాల్లో నిర్మించే ఇళ్లలో భారీ అవినీతి జరిగినట్లు గతంలోనే ఆధారాలు బయటపడ్డాయి. సొంతస్థలాల్లో పాత ఇళ్లకు బిల్లులు పెట్టడం ఒక ఎత్తయితే, లేఅవుట్లలో గోడలు నిర్మించి బిల్లులు డ్రా చేసు కోవడం మరో ఎత్తు. ఈ అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఏడాదన్నర కిందట అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు విచారణకు ఆదేశించారు. జేసీ రోణంకి కూర్మనాథ్‌ను విచారణ అధికారిగా నియమించారు. అయితే ఆ విచారణ ఏమైందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రజాధనాన్ని దోచుకుంటున్నట్లు బట్టబయలైనా ఉన్నతాధికారులు కూడా మౌనం దాల్చడంతో అవినీతిపరులకు మరింత బలం చేకూరింది. జిల్లాకు 97,121 ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటి వరకూ 21,699 ఇళ్లను పూర్తి చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందులో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి సంఖ్యనే 12 వేలకు పైగా ఉంది. ఈ ఇళ్లల్లోనూ మూడొంతులు నిర్మించకుండానే పాత ఇళ్లను చూపించి బిల్లులు తినేశారు.



పాత ఇళ్లకు.. కొత్త బిల్లు మంజూరు

● అన్నింటికి ఒకటే ఫొటో

ఒక ఇంటి నిర్మాణం మొదలై బిల్లులు మంజూరు కావాలంటే అందుకు వివిధ దశలున్నాయి. బేస్‌లెవల్, లింటెల్ లెవల్, రూఫ్‌కాస్ట్ లెవల్, కంప్లీట్.. ఇలా ప్రతీ దశలోనూ అధికారులు పరిశీలించి ఎంబుక్ రికార్డు చేసిన తర్వాతనే లబ్ధిదారుడి ఖాతాల్లో బిల్లులు జమవుతాయి. ప్రతీ సందర్భంలోనూ ఇంటి స్థలంలో జియో ట్యాగింగ్ చేస్తూ ఇంటి ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ స్థలంలో కాకుండా మరో స్థలంలో నుంచి జియోట్యాగింగ్ చేస్తే అక్షాంశాలు, రేఖాంశాలు సరిపోలవు. దీనిని వెబ్‌సైట్ తిరస్కరిస్తుంది. కాబట్టి కచ్చితంగా లబ్ధిదారుడి స్థలంలోని ఇంటినే ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ కారణంగానే చాలా ఇళ్లకు బేస్ లెవల్ సందర్భంలోనూ పూర్తయిన ఇంటి ఫొటోనే, లింటెల్ లెవల్‌లోనూ పూర్తయిన ఇంటి ఫొటోనే, రూఫ్‌కాస్ట్ లెవల్‌లోనూ అదే ఫొటోను అప్‌లోడ్ చేశారు. ఇక్కడ అక్రమార్కుల బండారం బయటపడింది. ఈ నిర్మాణాలను ఏఈలు నేరుగా పరిశీలించాలి. వాటిల్లో డీఈలు కనీసం 30 శాతం, ఈఈలు పది శాతం ఇళ్లను తనిఖీ చేయాలి. కానీ వారు ఈ అక్రమాలను పట్టించుకోలేదు. వారికి కూడా భాగం ఉండబట్టే చూసీచూడనట్లు వదిలేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేదలందరికీ ఇళ్లు పథకం పేదలకు సొంత గూడు నిర్మించలేదు కానీ అనేక మంది హౌసింగ్ సిబ్బందికి భారీ భవంతులను నిర్మించి ఇచ్చింది. కొందరు అధికారులు ఏకంగా రూ.కోట్లకు పడగలెత్తినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్, ఏసీబీ అధికారులు హౌసింగ్‌లో జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి పెడితే అనేక అక్రమాలు వెలుగుచూసే అవకాశమున్నట్లు ఆ శాఖలోని కొందరు సిబ్బందే చెబుతుండడం గమనార్హం.

డిప్యుటేషన్ల రద్దు



- వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాలు
- జిల్లా కేంద్రంలోనే 40 మంది ఉద్యోగులు
- తాజా ఉత్తర్వులు అమలయ్యేనా...?
- జీవో విడుదల కాకనే బదిలీ
- కలెక్టర్ ఆదేశాలతోనే చేశాం : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 7: వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లను రద్దు చేస్తూ శనివారం రాత్రి వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్ ఆదేశాలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆ ఆదేశాల మేరకు వైద్యశాఖలో అత్యవసర డిప్యుటేషన్ మినహా మిగిలిన డిప్యూటేషన్లు రద్దు చేయాల్సి ఉంది.

● నేడో, రేపో నివేదిక

జిల్లా వ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 4వేల మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయితే వైద్య ఆరోగ్య శాఖలోనే ఎక్కువగా డిప్యుటేషన్‌లు జరిగాయి. ఇందులో వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయంలోనే దాదాపు 40 మంది వరకు డిప్యుటేషన్లపై వచ్చినవారే ఉన్నారు. ఇందులో వైద్యులతోపాటు పీహెచ్‌సీల్లో పనిచేసే ఎంపీ హెచ్‌ఈవోలు, హెల్త్ ఎడ్యుకేటర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్ట్‌లు ఉన్నారు. తాజా ఉత్తర్వులతో వీరందరి డిప్యుటేషన్లు రద్దయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే కేవలం నోటి మాటతో డిప్యుటేషన్లపై ఉద్యోగులు జిల్లా కేంద్రంలో పనిచేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆదేశాలను ఎంత వరకు అమలు చేస్తారోనన్న సందేహం లేకపోలేదు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను సోమ, మంగళవారాల్లో అందచేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

● ఇద్దరు వైద్యులపై విమర్శలు

కాగా ఇద్దరు వైద్యులు డిప్యుటేషన్‌పై జిల్లా కార్యాలయానికి వచ్చారు. అయితే వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో కూడా తెలియని పరిస్థితి. ఇక ఓ ప్రాజెక్టు అధికారి క్యాంపులపై వెళితే అందులో పనిచేసే కొంతమంది ఉద్యోగులతో తమ సొంత పనులను చక్కబెట్టుకుంటున్నట్లు విమర్శలున్నాయి. వీరిలో చాలా మందికి డిప్యుటేషన్ ఉత్తర్వులు ఇవ్వకుండానే నోటిమాట ద్వారా పనిచేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ డిప్యుటేషన్ల వ్యవహారంలో అధికారులు పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిని రద్దు చేస్తూ 2021లోనే ఉత్తర్వులు వచ్చాయి. అయితే అప్పట్లో డిప్యుటేషన్లపై పెద్ద దుమారమే రేగింది. అత్యవసర పరిస్థితిలో కలెక్టర్ అనుమతితోనే డిప్యుటేషన్లు అమలు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఈ ప్రక్రియ ఇష్టారాజ్యంగా జరిగినట్లు సమాచారం.



డిప్యూటేషన్లు ఏమి లేవు..

వైద్య ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్లు ఏమీ లేవు. ప్రస్తుతం డిప్యుటేషన్‌లో ఉన్న ఉద్యోగులను కలెక్టర్ అనుమతి తోనే నియమించాం. కమిషనర్ నుంచి తాజాగా వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా నివేదిక ఇస్తాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

పరిమితంగానే అమ్మకాలు !

- గత ఏడాది గణాంకాల ఆధారంగా మద్యం షాపుల్లో విక్రయాలు
- టార్గెట్ పూర్తి కాగానే దుకాణం బంద్
- బార్లలోనూ సేల్స్ నిలుపుదలకు యత్నాలు ?
- ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ చర్యలు
- విచ్చలవిడిగా 'బెల్టు'

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాల్లో కొత్త నిబంధనలు అమలవుతున్నాయి. ఉదయం 11 గంటలకు మద్యం దుకాణం తెరిచి, రాత్రి 9 గంటలకు మూసేయాల్సి ఉంది. అయితే కొద్ది రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మద్యం దుకాణాలు సమయానుసారంగా పనిచేయడం లేదు. ముందుగానే దుకాణాలను మూతేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే, గాంధీ జయంతి తదితర జాతీయ పర్వదినాలు లేవుకదా... ఎన్నికలకు ఇంకా గడువు ఉంది కదా...? ముందుగా మద్యం దుకాణాలను ఎందుకు మూసేస్తున్నారబ్బా.. అని మందుబాబులు తలపట్టుకుంటున్నారు. ఈ విషయమై సర్వత్రా చర్చ సాగుతోంది.

● విక్రయాలకు పరిమితులు

ఎన్నికల నేపథ్యంలో మద్యం పక్కదారి పడుతోందన్న ఆలోచనతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాలకు ఎక్సైజ్ శాఖ పరిమితులు విధించింది. గత ఏడాది ఏప్రిల్‌లో ప్రతి దుకాణంలోని అమ్మకాల లెక్కలు చూసి ఎక్సైజ్ అధికారులు వాటి ఆధారంగా ఈ ఏడాది కూడా విక్రయాలు చేయాలని నిబంధనలు విధించారు. ఉదాహ రణకు ఓ దుకాణం గత ఏడాది ఏప్రిల్‌లో రూ.1.50 కోట్ల మేరకు అమ్మకాలు చేసుంటే, ప్రస్తుతం ఆ దుకాణంలో రోజుకు రూ.5లక్షల మద్యం అమ్మకాలు చేయాలి. రూ.5లక్షల విక్రయాలు పూర్తయ్యాక దుకాణం మూసేయాల్సి ఉంటోంది. జిల్లా వ్యాప్తంగా ఈ పరిమితులతోనే మద్యం అమ్మకాలను సాగిస్తున్నారు. బార్లలో మాత్రం ఈ నిబంధనలు ఇంకా అమల్లోకి రాకపోయినా, కొద్ది రోజుల్లో అమలవుతాయని అధికారులు తెలియచేస్తున్నారు. అయితే పరిమితులతో అమ్మకాలు సాగించి, మద్యం దుకాణాలు మూసివేస్తుండడంతో మందుబాబులకు ఇబ్బందులు తప్పవని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. దీంతో విక్రయాలను మరో 20 శాతం పెంచేలా చర్యలు చేపడుతున్నారు.



నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డులో మూసి ఉన్న మద్యం దుకాణం

● విచ్చలవిడిగా బెల్టు షాపులు

మద్యం అమ్మకాలపై అధికారులు నిబంధనలు విధించడంతో మందుబాబులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో బ్లాక్‌లో మద్యం కొనేందుకు, బార్లకు వెళ్లేందుకు వారు ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన పలువురు ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ముందుగానే మందును కొనుగోలు చేసి, దుకాణాలు మూసేశాక బెల్ట్ దుకాణాలు ఓపెన్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అంతేకాక ప్రభుత్వ మద్యం దుకాణాలకు పక్కనే ఉన్న శీతలపానియాల దుకాణాలను వ్యాపా రులు బెల్ట్ దుకాణాలుగా మార్చేస్తున్నారు. స్థానిక పోలీసులు, సెబ్ అధికారు లు, సిబ్బంది మామూళ్ల మత్తులో మునుగుతూ వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు.

టీడీపీని వీడే ప్రసక్తే లేదు..

- వైసీపీలో చేరుతున్నట్లు తప్పుడు ప్రచారాలు
- విలేకరులతో వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 7: వైసీపీలో చేరుతున్నట్లు తమపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, తాము తెలుగుదేశం పార్టీని వీడే ప్రసక్తే లేదని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు స్పష్టం చేశారు. ఆదివారం నెల్లూరులోని వారి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీలో మాకు గౌరవం ఉంది. తాము టీడీపీని వీడుతున్నట్లు ఇటీవల సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారమని వారు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ తరఫున సైకిల్ గుర్తుపై పోటీ చేసి అత్యధిక మెజార్టీతో తాము గెలుపొందుతామన్నారు. తమకు వస్తున్న విశేష ఆదరణను చూసి తట్టుకోలేక, వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరుతున్నారని, దాన్ని జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. తమపై నమ్మకం పెట్టుకున్న ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఈ ప్రచారాలు చేస్తున్నారని వారు వివరించారు. తమ విజయం మీద ఎలాంటి అనుమానం లేదని, ప్రజల నుంచి వస్తున్న స్పందనే అందుకు నిదర్శనమని వీపీఆర్ దంపతులు చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

పాట.. ప్రచారంలో తూటా !

- ప్రజల్ని ఆకట్టుకుంటున్న గీతాలు
- పార్టీ, వ్యక్తుల పేర్లతో లిరిక్స్
- సిద్ధాంతాలు, మేనిఫెస్టో అంశాలతో సాంగ్స్
- జనాన్ని ఆకర్షిస్తున్న నేతలు

పొదలకూరు, ఏప్రిల్ 7: వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం వివిధ రాజకీయ పక్షాల నాయకులు ఇప్పటికే ప్రచారంలో మునిగి తేలుతున్నారు. అన్ని పార్టీలు కూడా తమ ప్రచారంలో పాటలను తప్పనిసరి చేశాయి. పార్టీలే కాకుండా, అభ్యర్థులు కూడా సొంతంగా పాటలు రాయించుకుంటున్నారు. తమ పేర్లు, పార్టీ గుర్తు, చేసిన పనులను గుర్తు చేస్తూ లిరిక్స్ రాయిస్తున్నారు. వాటిని మ్యూజిక్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో రికార్డు చేయించి ప్రచార రథాల్లో వినియోగించుకుంటున్నారు.

● కొన్ని పాటలు హిట్

కొన్ని పాటలు క్యాచీగా ఉంటుండడంతో సినిమా పాటల స్థాయిలో హిట్ అవుతున్నాయి. యూట్యూబ్, సోషల్ మీడియాలో ప్రచారం పాటలు కూడా ట్రెండింగ్‌గా మారుతున్నాయి. దీంతో వెంటనే ఆ పాటలకు పేరడీలు, కౌంటర్ సాంగ్స్, జానపద గేయాలు కూడా తెరపైకి వస్తున్నాయి. ఈ ప్రచార పాటల పోటీ తో కొత్త కవులు, రచయిత లకు, సింగర్స్‌కు అవకాశాలు దొరుకుతున్నాయి. గత ఎన్నికల్లో వైసీపీ రూపొందించిన 'రావాలి జగన్.. కావాలి జగన్'... అనే పాట జనాదరణ పొందింది. బలిరా బలిరా.. సాంగ్, టీడీపీ 'తిప్పరా మీసం.. ఇది ఆంధ్రుని రోషం'.. 'రా రమ్మని పిలుస్తోంది తెలుగుదేశం'.. అనే గీతాలు ఎంతో బాగా వైరల్ అయ్యాయి. జగన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నామని చెబుతున్న టీడీపీ వైసీపీ టార్గెట్ చేసుకుని గూస్‌బంప్స్ వచ్చే సాంగ్‌ను రిలీజ్ చేసింది. 'రా కదలిరా'... అంటూ జగన్‌పై విమర్శల బాణాలు ఎక్కు పెట్టింది. అలాగే పరుశురాముడు వచ్చినాడురో సూడన్నా.... ప్రజల కొరకు నిలిచినాడురో పవనన్నా.. సింహమై కదిలినాడురో మా యన్నా.. గాజు గ్లాసుకు ఓటు వేయరో పెద్దన్న!!.. అంటూ సాగే జనసేన ఎన్నికల ప్రచారగీతం అందరినీ ఆకట్టుకుంటోంది.



● పాటలతో ఆకట్టుకుంటూ...

ఒక పాట ఎన్నో వేల మాటలకు మించిన భావాన్ని వ్యక్తం చేస్తుంది. విషయం సూటిగా చేరేలా చేస్తుంది. అలాంటి పాటను అభ్యర్థులు ప్రచారంలో వినియోగిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. లక్షల్లో వ్యూస్ కూడా వస్తుండడంతో అభ్యర్థులు మరిన్ని పాటలతో ఓటర్ల ముందుకు వస్తున్నారు. గతంలో గోడలపై రాతలు, కరపత్రాలు పంచడం లాంటి వాటిపై ఎక్కువ దృష్టి పెట్టే వారు. డిజిటల్ యుగంలో ప్రచార వ్యూహాలు మారుతు న్నాయి. ఆకట్టు కునే పాటలతో సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాన పార్టీలు కళాకారులతో ప్రత్యేక గీతాలను రికార్డు చేయించి, వాటిని అభ్యర్థులకు అందిస్తున్నాయి. దీంతో పలువురు కళాకా రులకు ఉపాధి దొరు కుతున్నది. బాణీల నుంచి పాట రూపకల్పనకు ఒక్కో పాటకు రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారు. ఎమ్మె ల్యేలు, ఇతర ప్రముఖులు కూడా వారి వారి పేర్లతో పాటలు రాయిం చుకుని పాట పాడిస్తుండడంతో ఈ రంగంలోనూ పోటీ పెరిగిపోయిందని పలువురు అంటున్నారు.

ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తా !

● ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్


కాకర్ల సురేష్‌తో కలిసి విక్టరీ సింబల్ చూపుతున్న చింతలపాలెం గ్రామ మహిళలు

వింజమూరు, ఏప్రిల్ 7: మండలంలోని కిస్టిపురం, చింతలపాలెం, అర వీడుపల్లి, చంద్రపడియ, తొగటపాలెం, బుక్కాపురం గ్రామాల్లోని ఎస్సీ, ఎసీ కాలనీల్లో ఆదివారం తెలుగుదేశం, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా కాకర్లకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగు దేశాన్ని గెలిపించాలని ప్రతి ఒక్కరిని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి కొన్ని జీవితాలు మారుస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి మాత్రమే పల్లెల్లో కనిపిస్తుందని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒరిగిందేమీ లేదన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రం అధోగతి పాలై 20 సంవత్సరాలు వెనక్కిపోయిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. 40ఏళ్లుగా ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న మేకపాటి కుటుంబంతో అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉంది అన్న చందంగా ఉందన్నారు. సమస్యలు నేటికి అలాగే ఉన్నాయే తప్ప మార్పు రాలేదన్నారు. మార్పు రావాలంటే అజాతశత్రువు, అపర భగీరధుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా, అదేవిధంగా ట్రస్టు ద్వారా మీకు అనేక సేవలు చేస్తూ మీ మనిషిగా ఉన్న నన్ను గెలిపించాలని కోరారు. ప్రతి పల్లెల్లో టీడీపీ నాయకులు, అభిమానులు కాకర్ల సురేష్‌ను శాలువా, గజమాలలతో సత్కరించారు. కిస్టిపురం పంచాయతీ సర్పంచ్ దాట్ల రమణారెడ్డి కాకర్ల వెంట ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే చంద్రపడియ గ్రామంలో యూనిట్ ఇన్‌చార్జ్ పాములపాటి మాల్యాద్రి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునా థరెడ్డి, మాజీ కన్వీనర్ గూడా నరసా రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ దంతులూరు వెంక టేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, జనసేన మం డల అధ్యక్షులు బండారు సత్యనారాయణ, బీజేపీ నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను ఆది వారం విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు వింజ మూరులోని బొమ్మరాజుచెరువులోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో విశ్వబ్రాహ్మణులు ఎదు ర్కొంటున్న సమస్యలను ఆయనకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కాకర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే విశ్వబ్రాహ్మణుల సమ స్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు జిల్లాలో మహాకూటమి అభ్యర్థుల విజయానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం కాకర్లను సన్మానించి జ్ఞాపిక లు అందజేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మ ణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఆగర సుబ్రహ్మణ్యం ఆచారి, ప్రధాన కార్యదర్శి విజయాచారి, కోశాధికారి, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, అర్కాట్‌కుమార్, నాయకులు రామకృష్ణ, సుమన్, పిచ్చయ్య, బాలబ్రహ్మాచారి, చెన్నయ్య పాల్గొన్నారు.


కాకర్లకు వినతిపత్రం ఇస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు

‘సోమశిల’ మనుగడకే ప్రమాదం తెచ్చారు


సీడీని విడుదల చేస్తున్న ఆనం, తదితరులు

అనంతసాగరం, ఏప్రిల్ 7: జిల్లాకు సాగు, తాగు నీటిని అందించే మహత్తర ప్రాజెక్టు సోమశిల మనగడ నేడు ప్రమాదకర స్థితికి చేరిందని, ఇందుకు కారణం వైసీపీ ప్రభుత్వమే అని ఆత్మకూరు అసెంబ్లీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామానారాయణరెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అనంతసాగరం ప్రజాగళం సభలో ఆయన పాల్గొన్నారు. అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో వచ్చి ఆనంకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడారు. రాష్ట్రంలో హత్యా రాజకీయం నడుస్తుందని ఈ ఎన్నికల్లో వైసీపీని వేర్లతో సహా పెకిలించాలని ఓటర్లకు అభ్యర్థించారు. ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాని అధోగతి పట్టించారని మండిపడ్డారు. నియోజకవర్గంలో తన హయంలో జరిగిన అభివృద్ధిని ఆనం గుర్తుచేశారు. అధ్వానంగా ఉన్న ఆత్మకూరు సోమశిల రహదారిని రెండు వరసల రోడ్డుగా మార్చినట్లు గుర్తుచేశారు. సోమశిలకు అగ్రికల్చర్ కళాశాలను తెచ్చానని చెప్పారు. సోమశిల డ్యాం ప్రాజెక్టు అభివృద్ధికి తాను ఎంతగానో పనిచేశానని అయితే నేడు డ్యాం దెబ్బతిని మూడేళ్లు గడుస్తున్నా మరమ్మతు పనులు చేపట్టక పోవడం విస్మయానికి గురిచేస్తుం దన్నారు. మెట్టగ్రామాలకు సంజీవని లాంటి హైలెవల్ కెనాల్ పనులు పూర్తి చే యలేదని అందులో భాగమైన నాయకులకు ఆదాయం చేకూర్చే గ్రావెల్ పనులు చేస్తున్నట్లు తెలిపారు. తన రాజకీయ ప్ర స్థానంలో ఇంతవరకు ఎలాంటి అవినీతి మచ్చలేదని చెబుతూనే ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిపై పరోక్ష విమర్శలు చేశారు. ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అధికారంలోకి వచ్చేలా చూడాలని కోరారు. తన హయాంలో ఆత్మకూరులో జరిగిన అభివృద్ధిని సీడీ రూపంలో విడుదల చేశారు. తొలుత ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి ప్ర సం గించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కం భం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఆత్మకూ రు జనసేన నాయకులు నలిశెట్టి శ్రీధర్, బీజేపీ నాయకులు కాకూరు నాగరాజారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆనం సమక్షంలో పార్టీలో చేరిన కొత్తపల్లి వాసులు

ఏఎస్ పేట: గుడిపాడు పంచాయతీలోని కొత్తపల్లివాసులు ఆదివారం ఆత్మకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామనికి చెందిన పొలిమేరు నాగేశ్వర్‌రెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, దుద్దుగుంట మాధవరెడ్డి, పొలిమేరు బాలిరెడ్డి, సుబ్బారెడ్డి, మొలక మాల కొండలరెడ్డితో 30కుటుంబాలు వారితో ఉన్నాయి. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు, దేవరాల హజరత్తయ్య, నంది వివేకానందరెడ్డి, కాటంరెడ్డి నరసింహరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన యువత


జనసేనలో చేరిన వారికి కండువాలు వేస్తున్న నలిశెట్టి శ్రీధర్

సంగం, ఏప్రిల్ 7: మండలంలోని సంగం, ఉడ్‌హౌస్ పేట, కోలగట్ల, గాంధీ జనసంఘం గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి శ్రీధర్ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.


నాగారపమ్మకు ప్రత్యేక పూజలు


నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఏప్రిల్ 7: కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారపమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కంపచెట్లను తొలగించండి

ఉదయగిరి, ఏప్రిల్ 7: పట్టణ సమీపంలోని అబీద్ బాబా దర్గా సమీపంలోని కోనకాలువకు ఇరువైపులా అల్లుకున్న కంపచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలో సగానికిపైగా జనం ఈ కాలువ తాగునీటిపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. కంపచెట్లు తొలగించక పోవడంతో విషపురుగులు నీటిలో పడి నీరు కలుషితం అవుతున్నట్లు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా స్పందించడం లేదని మండిపడ్డారు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు


సమావేశంలో మాట్లాడుతున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 7: ఒక్క అవకాశమని చెప్పి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీకి ఎప్పుడు గుణపాఠం చెబుదామా అని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో 17పంచాయతీల టీడీపీ నాయకు లు, కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగివేసారి పోయి టీడీపీ చేపడుతున్న ప్రచార కార్యక్రమాలకు బ్రహ్మారథం పడుతున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో వైసీపీ అవలంభిస్తున్న విధానాలు, పెంచిన విద్యుత్, ఆర్టీసీ, నిత్యావసర వస్తువుల ధరలపై ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ ప్రభుత్వం వ్యతిరేకం కాదని, వారు చేసే రాజకీయాలకు మాత్రమే వ్యతిరేకమన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం సృష్టించిందన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో మహాకూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. అలాగే నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, నరసింహా, రమణారెడ్డి, రమణయ్య, శివకృష్ణ, జల్సాయాదవ్, మస్తాన్, హరీష్ పాల్గొన్నారు.

శేషవాహనంపై సంగమేశ్వరుడు


శేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సంగమేశ్వరుడు

సంగం, ఏప్రిల్ 7: సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారు శేషవాహనసేనంపై ఊరేగారు. ఈ సందర్భంగా కామాక్షీదేవి సహిత సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గజపూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ రథంను విద్యుత్ దీపాలతో అలంకరించి సంగం పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఉత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి శాఖవరపు శ్రీహరి, శివకుమార్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవారికి పూలంగి సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ రవీంద్రబాబు, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం


పేదలకు నగదు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 7: రంజాన్‌ను పురస్కరించుకొని పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో కూలి పనులు, చేతివృత్తులు, చిరుద్యోగులు చేస్తున్న 30ముస్లిం ని రుపేద కుటుంబాలకు ఆదివారం దిలావర్ భాయ్ వెల్ఫేర్ అండ్ రిలీఫ్ ఆర్గనైజేషన్ సంస్థ నిర్వాహకులు ఆర్థికసాయం అందజేశారు. ఒక్కొక్క కు టుంబానికి రూ.1500నుంచి రూ.3వేల వరకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి పేదవాడు పండుగను సంతోషంగా జరుపుకునేందుకు సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఆర్థికసాయం చేస్తామన్నారు. సంస్థ అధ్యక్షుడు రఫీ, కార్యదర్శి ముక్తియార్, సభ్యులు మసూద్, నసుల్లా, దావూద్, అలీ, దిలావర్, అష్ఫాక్, మహబూబ్‌బాషా, అజీజ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైసీపీ ప్రచారం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని ఆదివారం వైసీపీ నాయకులు దుత్తలూరు బీసీ, పూసల, ఏసీ కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కండ్లగుంట వెంకటరెడ్డి, జయసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఒక్క అవకాశం ఇవ్వండి : కావ్య

కావలి, ఏప్రిల్ 7: ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 14వ వార్డు ముసునూరులో ఆదివారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి ఇంటింటి ప్రచార నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా పింఛన్ రూ.4,000 పెంచి ప్రతి నెలా ఇంటివద్దకే వచ్చి అందజేస్తామన్నారు. కావలి ప్రజలు ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే కావలిని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, టీడీపీ నేత లింగం మాల్యాద్రి, జనసేన నేతలు సిద్ధూ, అలా శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నగారిపాలెం వాసులు టీడీపీలో చేరిక : కావలిరూరల్ మండలం అన్నగారిపాలెం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులగం రామారావు, మాజీ సర్పంచు వై.వెంకటేశ్వర్లు, అశహరి హనుమంతరావు, గుద్దేటి వెంకటప్రసాద్ వారి అనుచరులు, పాత హరిజనవాడ యానాదిసంఘం నుంచి 43 కుటుంబాలు టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, గోపాలపు నరసింహారావు, గోళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే తుమ్మలపెంట పట్టపుపాలెంకు చెందిన చిననాగూర్, జయరాం వారి అనుచరులు భారీగా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని ముసునూరు టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో వారందరికీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన పాలడుగు

కావలి, ఏప్రిల్ 7: కావలిరూరల్ మండలం తుమ్మలపెంటకు చెందిన పాలడుగు వెంకటేశ్వర్లు తన అనుచరులతో వైసీపీని వీడి జనసేన నేతలు సమ్మన వెంకటసుబ్బయ్య, సిద్ధూ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంతరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.


టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో కావ్య

రాష్ట్ర అభివృద్ధికి వైసీపీని ఓడించండి

కావలి రూరల్ : రాష్ట్ర అభివృద్ధి కోసం వైసీపీని ఓడించి టీడీపీని గెలిపించాలని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం తాళ్లపాలెం పంచాయతీ లింగంగుంట, రామచంద్రాపురం, గండి హరిజనవాడ, తాళ్లపాలెం, జువ్విగుంటపాలెం, కోటడవి, బట్లదిన్నె తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి దోచుకోవటం దాచుకోవటం తప్ప చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల రామక్రిష్ణ, ఉప్పాల వెంకట్రావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, జనసేన నాయకుడు సిద్ధూ, కోసూరి వెంకటేశ్వర్లు, నాయకులు దగ్గుమాటి మాల్యాద్రి రెడ్డి, మక్కి శ్రీహరి, జడ్డా శేఖర్ బాబు, రవి, ప్రసాద్, ఉప్పాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమంటూ అభివృద్ధికి తిలోదకాలు


ఇంటింటి ప్రచారంలో గిరిధర్, వాకాటి బినీత్‌రెడ్డి

అల్లూరు, ఏప్రిల్ 7 : వైసీపీ ప్రభుత్వం సంక్షేమమంటూ రాష్ట్రంలో అభివృద్ధి మరచి యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. ఆయన ఆదివారం అల్లూరు పట్టణ పరిధిలోని కలుగోళమ్మ గుడివీధి, పంచాయతీ ఆఫీసు వీధి, వెంగన్నగుంట, ఆర్‌డీఆర్ కాలనీల్లో టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చందన్‌రెడ్డిలతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లని, ఒకేవైపు మొగ్గుచూపితే మరోవైపు తీవ్ర నష్టానికి గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, అరగల రమణయ్య, అనూరాధ, నజీర్‌బాషా, గోళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేశమ్మకు పొంగళ్లు


గ్రామోత్సవంలో దేశమ్మ

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 7: దగదర్తి మండలం శ్రీరామపురం పంచాయతీలో కొలువై ఉన్న గ్రామదేవత దేశమ్మకు ఆదివారం పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారు కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నసంతర్పన జరిగింది. కాగా శనివారం రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు కాయాకర్పూర హారతులు అందచేశారు.

బూత్ ఇన్‌చార్జిలకు అవగాహన

కొండాపురం, ఏప్రిల్ 7: మండల పరిధిలోని కొమ్మి పంచాయతీకి సంబంధించిన 210, 211, 212, 213 బూత్ ఇన్‌చార్జిలకు టీడీపీ మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో బూతు ఇన్‌చార్జిల పాత్ర చాలా కీలకమన్నారు. ఓట్లు పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు కే.సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జి సీహెచ్.వెంకటాద్రి, నాయకులు యారవ క్రిష్టయ్య, పీ.రమేష్, చెరుకూరు శేషయ్య, చెరుకూరు వెంకపనాయుడు, షేక్ ఖాసిం, కాసుల బాదుల్లా, ఆకుల మహేష్, గుంటూరు యోనా, బాలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తారు విందులో విష్ణువర్ధన్‌రెడ్డి

బిట్రగుంట, ఏప్రిల్ 7: బోగోలులో ముస్లింలు ఆదివారం ఏర్పాటు ఇఫ్తారు విందులో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులు ప్రాణదాతలు : ఇంటూరి రాజేష్


మాట్లాడుతున్న ఇంటూరి రాజేష్

కందుకూరు, ఏప్రిల్ 7: గ్రామీణ వైద్యులు ప్రాణదాతలని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ పేర్కొన్నారు. పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం కందుకూరు నియోజకవర్గంలోని గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంటూరి రాజేష్ మాట్లాడుతూ సాధారణ వ్యాధులకు వేలకువేలు ఖర్చులేకుండా సామాన్యులకు ఇంటివద్దే వైద్యచికిత్సలు అందించటం ద్వారా గ్రామీణ వైద్యులు చేస్తున్న సేవ మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులసంఘం ప్రతినిధులు స్వర్ణ తిరుమలరావు, సింగయ్య, కె.రామరాఘవులు, నరసింహారావు, సుధాకర్, అనిల్‌కుమార్, గంగోలు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కొద్ది రోజులు ఓపిక పడితే అన్నీ మంచిరోజులే..


కందుకూరు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న సౌజన్య


లింగసముద్రం : ఇఫ్తార్ విందులో నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 7: ఐదేళ్లుగా వైసీపీ పాలనలో ఎన్నో ఇబ్బందులు పడ్డ ప్రజలు కొద్ది రోజులు ఓపికపడితే ముందున్నది మంచి రోజులేనని కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య పేర్కొన్నారు. పట్టణంలోని 31, 32 వార్డుల పరిధిలోని సాయినగర్‌లో ఆదివారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మినీ మ్యానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటమే ధ్యేయంగా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలకు మద్దతిచ్చి వారి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు ముచ్చు శ్రీనివాసులు, ముప్పవరపు వేణు, జమ్ము చైతన్య, చుంచు వేణు, ఒరుగంటి రామ్మూర్తి, పసుపులేటి రమణయ్య, మచ్చా మనోహర్, ముచ్చు రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

టీడీపీలో ముస్లిం కుటుంబాల చేరిక

పట్టణంలోని 6వ వార్డుకు చెందిన పలు ముస్లిం కుటుంబాల వారు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ ముస్లిం మైనారిటీ కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో షేక్ అహ్మద్‌బాషా, షేక్ ఖలీల్, షేక్ రసూల్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ సలాం, షేక్ రూబీ, షేక్ ఖలీల్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో ఆదివారం రాత్రి ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. మదరస-ఎ-ఖమ్‌రున్నీసా మసీదులో ముస్లింలతో కలిసి దువా చేశారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ నాయబ్‌రసూల్, నాయకులు గొర్రెపాటి సాంబయ్య, పటాన్ హిదయతుల్లా, టెంకం హజరత్తయ్య, ఖాదర్‌బాషా, షేక్ మాబాషా, షేక్ కరీముల్లా, షేక్ రఫీ, చిన్న నాయబ్, షేక్ సలాం, జమీల్, సోంపల్లి మనోహర్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

బిట్రగుంట, ఏప్రిల్ 7: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి (కావ్య) క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సుధీర్‌బాబు, తిరుపతిరెడ్డి, శివకోటయ్య ఎల్.కిషోర్, హరిబాబు, బాలాజీ, నరసింహారావు, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరిలో ముమ్మర ప్రచారం

కలిగిరి, ఏప్రిల్ 7: కలిగిరి పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ఆదివారం తెలుగుదేశం పార్టీ గెలిస్తే అందించే సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంచిపెడుతూ ఆపార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకర్ల సురేష్‌ను, ఎంపీ అభ్యర్థిగా వీపీఆర్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు బిజ్జం క్రిష్ణారెడ్డి, ఊసా మల్యాద్రి, స్వర్ణ కొండయ్య, కొప్పోలు కొండలరావు, వెంకటరావు, పెద్ద అంకిరెడ్డి పాల్గొన్నారు.


కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుని గెలిపించుకోవాలి : మాలేపాటి


స్థానికులతో మాట్లాడుతున్న సుబ్బానాయుడు

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 7: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన పోవాలంటే చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలని టీడీపీ కావలి నియోజకవర్గ నేత మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలం తిరువీధిపాడులో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి పార్టీల నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థిగా కావ్య క్రిష్ణారెడ్డిలను గెలిపించడం అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం రాత్రి యలమంచిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఉన్నారు.

ఉత్సాహం నింపిన సిద్ధం సభ : ఎమ్మెల్యే

కావలిటౌన్, ఏప్రిల్ 7: కావలిలో జరిగిన సిద్ధం సభ వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాకర్ల సురేష్‌ను గెలిపించండి


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొండాపురం, ఏప్రిల్ 7: ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను గెలిపించాలంటూ సోదరుడు కాకర్ల సునీల్, భార్య సురేఖ ఆదివారం ప్రచారం నిర్వహించారు. సాయిపేట పంచాయతీలోని కొత్తపాలెంలో ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంచారు. అనంతరం ఆయన రేణమాల, భీమవరప్పాడులో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. నాయకులు ఎమ్.ఓంకారం, కామేపల్లి సుబ్బారావు, గంటా నరసింహులు, కుంకు మోహనరావు, దామా మహేశ్వరరావు, దామా శివబాబు, యారవ క్రిష్ణయ్య, పీ.రమేష్, బొట్లగుంట హరిబాబు పాల్గొన్నారు.